ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

సోమవారం 19 అక్టోబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 123 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar



మార్కండేయకాలనీలో..



ఎన్టీపీసీ టౌన్ షిప్ లో జరిగిన వేడుకల్లో ఈడి, పోలీస్ కమిషనర్

రంగు రంగుల సింగిడి
పూల పండుగ సందడి

రామగుండంలో సద్దుల బతుకమ్మ సంబరాలు

ఆనందోత్సాహాలతో ఆడిపాడిన ఆడపడుచులు

రామగుండం నియోజకవర్గ వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ గీతాలు, ఆడపడుచుల ఆటపాటలతో స్థానికంగా పండుగ శోభను సంతరించుకుంది.నియోజకవర్గంలోని రామగుండం కార్పోరేషన్ వివిధ డివిజన్లు, కాలనీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.

(గోదావరిఖని- సింగిడి)

2



రాష్ట్ర వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ
సంబురాలు

ట్యాంక్ బండ్‌పై ఘనంగా బతుకమ్మ వేడుకలు

700 మంది కళాకారులతో మహా బతుకమ్మ ర్యాలీ

పాల్గొన్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు, మంత్రి సీతక్క

అలరించిన ఆటపాటలు, నృత్యాలు



తెలంగాణ రాష్ట్రంలో సద్దుల బతుకమ్మ సంబురాలు ఈ ఏడాది మరింత ఉత్సాహంగా జరగుతున్నాయి. హైదరాబాద్ నగరంలోని ట్యాంక్‌బండ్ వద్ద భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రంలో సద్దుల బతుకమ్మ సంబురాలు ఈ ఏడాది మరింత ఉత్సాహంగా జరగుతున్నాయి. హైదరాబాద్ నగరంలోని ట్యాంక్‌బండ్ వద్ద భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు, రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబిస్తూ, ప్రజలందరినీ ఆకర్షిస్తున్నాయి. ట్యాంక్‌బండ్ అమరవీరుల స్మారకం నుంచి ప్రారంభమైన మహా బతుకమ్మ ర్యాలీలో 700 మంది కళాకారులు, 600 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సీతక్క కూడా పాల్గొని, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ వేడుకలు తెలంగాణ సంస్కృతికి ప్రత్యేకమైన గుర్తింపును ఇస్తున్నాయి. ఈ సందర్భంగా, ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేసిన ఆటపాటలు, నృత్యాలు, సంగీతం ప్రజలను ఎంతగానో అలరించాయి. గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రముఖ సినీనటులు విజయ్ దేవరకొండ మరియు రష్మిక మందన్న కూడా ఈ వేడుకలో పాల్గొని, తమ సాన్నిహిత్యాన్ని అందించారు. ఈ వేడుకలు తెలంగాణ రాష్ట్రంలో మహిళల శక్తిని, సాంస్కృతిక సంపదను ప్రతిబింబిస్తూ, ప్రతి ఒక్కరినీ ఒకే చోట చేర్చాయి.

- హైదరాబాద్, అక్టోబర్ 18 (సింగిడి) 2

ఎల్‌నినో ఎఫెక్ట్..
వరి రైతుకు కష్టాలు

వర్షాభావంతో తగ్గిన నీటి లభ్యత

460 టీఎంసీల అవసరం.. 209 టీఎంసీలే అందుబాటులో

వరి సాగుపై ఎల్‌నినో ప్రభావం

పది లక్షల ఎకరాల్లో పంట నష్టం ఉంటుందన్న అంచనాలు

విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పైనే

పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు

వర్షాభావం.. తగ్గుతున్న జల నిల్వలు.. పెరుగుతున్న సాగు ఖర్చులు.. ఇవన్నీ రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సాధారణ స్థాయిలో కురవకపోతే వ్యవసాయంపై మరింత ఒత్తిడి పెరిగే ప్రమాదముంది. గత కరువు అనుభవాలు, ప్రస్తుత నీటి లభ్యతను పరిశీలిస్తే.. వరి సాగు, విద్యుత్ సరఫరా, పంట నష్టంపై ముందస్తు చర్యలు కీలకంగా మారాయి.

హైదరాబాద్ బ్యూరో - సింగిడి



గతంలోనూ కరువు దెబ్బ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1972, 1992, 2002, 2004, 2009 సంవత్సరాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నమోదయ్యాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా కొన్ని సంవత్సరాల్లో వర్షాల కొరత వ్యవసాయాన్ని ప్రభావితం చేసింది. 2023లో జూలైలో అధిక వర్షపాతం నమోదైనా.. ఆగస్టులో లోటు ఏర్పడటంతో వర్షాల అస్థిరత మరోసారి చర్చనీయాంశమైంది.

నీటి నిల్వలపై ఒత్తిడి

2026లో తెలంగాణలో సాధారణం కంటే వర్షపాతం తక్కువగా నమోదైనట్లు అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి. అక్టోబర్ మధ్య నాటికి వర్షపాతం 596.8 మిల్లీమీటర్లుగా ఉండగా.. సాధారణం 826.83 మిల్లీమీటర్లు. అంటే దాదాపు 28 శాతం లోటు. ప్రాజెక్టుల్లో నిల్వలు, సాగుకు అందుబాటులో ఉన్న నీటి పరిమాణం కూడా కీలకంగా మారాయి. రాష్ట్ర అవసరాలకు సుమారు 460 టీఎంసీల నీరు కావాల్సి ఉండగా.. 209 టీఎంసీలే అందుబాటులో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. కృష్ణా, గోదావరి బేసిన్లలో నిల్వలు తగ్గడం సాగునీటి ప్రణాళికపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

వరి సాగుకు సవాలు

నీటి కొరత కొనసాగితే వరి సాగు విస్తీర్ణం తగ్గే ప్రమాదముంది. సాధారణ సాగు లక్ష్యంతో పోలిస్తే ప్రస్తుత సాగు గణాంకాల్లో తగ్గుదల కనిపిస్తున్నట్లు వ్యవసాయ శాఖ సమాచారాన్ని ఉటంకించిన వార్తలు పేర్కొన్నాయి. నీటి లభ్యతను బట్టి పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. పది లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగే అవకాశం ఉందని, నష్టం రూ.20 వేల కోట్లకు చేరవచ్చని కొన్ని అంచనాలు ప్రచారంలో ఉన్నాయి.

విద్యుత్ డిమాండ్ పెరుగుదల

నీటి కోసం బోర్లు, పంపుసెట్లపై ఆధారపడటం పెరిగితే విద్యుత్ వినియోగం కూడా అధికమవుతుంది. రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లు సుమారు 30 లక్షలు ఉన్నట్లు పేర్కొంటున్నారు. అక్టోబర్‌లో విద్యుత్ డిమాండ్ 20,003 మెగావాట్లకు చేరినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. సాధారణంగా ఈ కాలంలో ఉండే డిమాండ్‌తో పోలిస్తే ఇది గ్రిడ్‌పై అదనపు ఒత్తిడిని సూచిస్తోంది.

రైతులకు సాయం కీలకం

వర్షాభావం తీవ్రతను బట్టి పంట నష్టం అంచనా వేయడం, అర్హులైన రైతులకు పరిహారం అందించడం, చెరువులు–కుంటల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం అవసరం. నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపికపై రైతులకు ముందస్తు సూచనలు ఇవ్వాలి. సాగునీరు, విద్యుత్ సరఫరా, పంట బీమా, పరిహారం వంటి అంశాల్లో సమన్వయంతో చర్యలు తీసుకుంటేనే కరువు ప్రభావాన్ని కొంతవరకు తగ్గించవచ్చు. కరువు ముప్పును ఎదుర్కోవడంలో ముందస్తు ప్రణాళికే కీలకం. వర్షాలు, నీటి నిల్వలు, పంటల పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణతో పాటు రైతులకు సకాలంలో సాయం అందించడమే తక్షణ అవసరం.

రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి
మంటల్లో ఇంధన టెర్మినల్! 2



బాలీవుడ్ హీరో
టైగర్ ష్రాఫ్ పై కాల్పులు
ముంబైలో తీవ్ర కలకలం

ముంబై (సింగిడి)

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ ప్రయాణిస్తున్న కారుపై కాల్పుల ఘటన ముంబైలో తీవ్ర సంచలనం సృష్టించింది. ఆదివారం సాయంత్రం జుహు ప్రాంతంలో జరిగిన ఈ దాడిలో ఆయన తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్‌కు ఎలాంటి గాయాలు కాలేదని, అయితే ఆయన డ్రైవర్ గాయపడ్డారని ముంబై పోలీసులు ధ్రువీకరించారు. వివరాల్లోకి వెళితే, ఆదివారం సాయంత్రం ఫుట్‌బాల్ ఆడి తన బీఎండబ్ల్యూ కారులో ఇంటికి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. 2

జర్మనీ ఉద్యోగాల పేరిట
టోమ్‌కామ్ భారీ మోసం

70 మంది యువకుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.4.5 లక్షల వరకు వసూలు

రెండేళ్లు గడిచినా ఒక్కరికీ ఉద్యోగం రాలేదని, ఇంటర్వ్యూ కూడా జరగలేదని ఆరోపణ

TELANGANA OVERSEAS MANPOWER COMPANY LTD.

బతుకమ్మ, దసరా పండగల వేళ
ఆర్టీసీ ఛార్జీల మోత
ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్ 2

పండగ స్పెషల్ బస్సుల ఛార్జీల పెంపుపై హరీశ్ రావు విమర్శలు

సాధారణ బస్సులనే స్పెషల్స్‌గా నడుపుతూ అధిక ఛార్జీలు వసూలు

స్పెషల్ బస్సులపై 50 శాతం సర్‌ఛార్జి మాత్రమేనంటున్న టీజీఎస్ఆర్టీసీ



బతుకమ్మ, దసరా పండగల వేళ తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. పండగకు సొంతూళ్లకు వెళ్లేవారి ఉత్సాహాన్ని ఈ ఛార్జీల పెంపు దెబ్బతీసిందని ఆయన ఆరోపించారు. ఛార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్, అక్టోబర్ 18 (సింగిడి)

ఏపీలో మున్సిపల్ ఎన్నికలు..
ముగిసిన నామినేషన్ల గడువు

చివరి రోజు భారీగా తరలివచ్చిన అభ్యర్థులు

దర్శిలో సమయానికి చేరుకోలేక 25 మంది వైసీపీ అభ్యర్థుల వెనుదిరిగిన వైనం

అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన, 28న పోలింగ్

30న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి 2

రాష్ట్రపతి పాలనకు
జగన్ డిమాండ్

స్థానిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికారం యంత్రాంగం విఫలం: జగన్

ఈసీ ప్రేక్షక పాత్ర వహిస్తోందని విమర్శ



చైనా ఏజెంట్లకు 2
రహస్య సమాచారం
ఆర్మీ అధికారి భార్యపై కేసు నమోదు

విద్యావేత్తల ముసుగులో ఉన్న చైనా ఏజెంట్లకు సమాచారం అందించిందన్న ఆరోపణలపై సీనియర్ ఆర్మీ అధికారి భార్యపై జమ్ముకశ్మీర్‌లో కేసు నమోదైంది. అక్కడి పోలీసులు పలు సెక్షన్లు కింద ఆమెపై అభియోగాలు మోపారు. భారత సీనియర్ ఆర్మీ అధికారి భార్యపై జమ్ముకశ్మీర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

- న్యూఢిల్లీ, అక్టోబర్ 18(సింగిడి)



రాష్ట్రపతి పాలనకు జగన్ డిమాండ్

అమరావతి (సింగిడి)

నామినేషన్ కేంద్రాల వద్ద టీడీపీ వర్గాలు మాటువేసి, వైసీపీ అభ్యర్థులను దౌర్జన్యం గా అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. కేవలం రెండు రోజుల ముందు రిజర్వేషన్లు ప్రకటించి, 24 గంటల్లో నామినేషన్లు వేయమనడం ప్రతిపక్షానికి సమయం ఇవ్వ కూడదనే కుట్రలో భాగమేనని ఆరోపించారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఎస్ఈసీగా నిమ్మగడ్డ రమేశ్ కుమార్ ఉన్నప్పుడు కలెక్టర్లు, ఎస్పీలను బదిలీ చేసినా తాము ధైర్యంగా ఎన్నికలకు వెళ్లి విజయం సాధించామని జగన్ గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ఆ ధైర్యం లేదని విమర్శించారు. అన్నమయ్య జిల్లా పుంగనూరులో జరిగిన ఘర్షణల నేపథ్యంలో ఈ వివాదం మరింత ముదిరింది. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి తన పార్టీ అభ్యర్థులతో నామినేషన్ వేయడా నికి వెళ్లినప్పుడు టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగాయి. ఈ హింసకు వైసీపీనే కారణమని టీడీపీ ఆరోపిస్తుండగా, తమ ఎంపీపైనే దాడి జరిగిం దని వైసీపీ ప్రత్యారోపణలు చేస్తోంది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా ఎంపీ మిథున్ రెడ్డి వందలాది మంది అనుచరులతో రావడం వల్లే ఉద్రిక్తత తలెత్తిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలపై ఇరు పార్టీల నేతలు రాష్ట్ర ఎన్నికల సంఘానికి పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి. ఈ ఆరోపణలపై ఈసీ నివేదికలు కోరినట్లు సమాచారం.

రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 18 (సింగిడి)

రష్యాపై ఉక్రెయిన్ భారీస్థాయిలో విరుచుకుపడింది. ఏకకాలంలో వెయ్యికిపైగా డ్రోన్లను ప్రయోగించింది. ఉక్రెయిన్ జరిపిన అతిపెద్ద వైమానిక దాడుల్లో ఇది ఒకటి. ఈ డ్రోన్ల దాడిలో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ఓ ఇంధన టెర్మినల్ మంటల్లో చిక్కుకుపోయింది. రష్యా చమురు మౌలిక సదుపాయాలను కీవ్ లక్ష్యంగా చేసుకో వడాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శిస్తున్న తరుణంలోనే తాజా దాడులు జరగడం గమనార్హం. ఉక్రెయిన్ దాడుల్లో ఒకరు మృతి చెందగా.. మరో ఐదుగురు గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. పీటర్స్‌బర్గ్ ఆయిల్ టెర్మినల్‌తోపాటు రూచి ఆయిల్ డిపోలో మంటలు చెలరేగాయని చెప్పారు. ఓజోన్ లాజిస్టిక్స్ కేంద్రం, పీకే డేటా సెంటర్‌పైనా దాడులు జరిగాయన్నారు. మొత్తం 1,015 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. మరోవైపు.. ఉక్రెయిన్‌లోని జపోరిజియాపై రష్యా జరిపిన దాడుల్లో ఒక మహిళ ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ట్రంప్ 'ఇంధన కాల్పుల విరమణ' ప్రకటించిన వారం రోజుల్లోనే తమ ఇంధన, చమురు, గ్యాస్ సదుపా యాలపై రష్యా 76 సార్లు దాడులకు తెగబడిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. విద్యుత్ బ్లాక్‌అవుట్ సృష్టించేందుకు మాస్కో యత్నిస్తోందని 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. ఆంక్షల సడలింపులు, ఒప్పందాలకు అనుగుణంగా రష్యా ఎటువంటి సానుకూల చర్యలు తీసుకోవడం లేదనే వాస్తవాన్ని అమెరికా గుర్తించా లన్నారు.



బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్ పై కాల్పులు

జుహు పోలీస్ స్టేషన్ పరిధిలోని పుష్పా పార్క్ సమీపంలోకి రాగానే, మోటార్స ైకిలపై వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ఆయన కారును లక్ష్యంగా చేసుకుని మూడు నుంచి ఐదు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్ సురక్షితంగా ఉండగా, ఆయన కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నానావతి ఆసుపత్రికి తరలించారు. ఈ దాడిలో సమీపంలో ఉన్న ఒక ఆటో డ్రైవర్‌కు కూడా గాయాలైనట్లు సమాచారం. ఘటన గురించి తెలియగానే ముంబై పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. డీసీపీ మోహిత్ గార్గ్ సహా ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షించారు. టైగర్ ష్రాఫ్ సురక్షితంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీ నంలోకి తీసుకుని, నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దుండ గులను పట్టుకోవడానికి దాదాపు 12 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

చైనా ఏజెంట్లకు రహస్య సమాచారం

విద్యావేత్తల ముసుగులో సంప్రదించిన విదేశీ గూఢచారి సంస్థల ఏజెంట్లకు భారత సైన్యానికి చెందిన కీలక సమాచారాన్ని ఆమె చేరవేసినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఆర్మీ ఆఫీసర్ భార్యపై కేసు నమోదైంది. 'అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్- 1923'లోని సెక్షన్- 3, సెక్షన్ 5, అలాగే 'భారతీయ న్యాయ సంహిత' లోని సెక్షన్లు 152, 61(2) కింద పోలీసులు అభియోగాలు మోపారు. ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఏపీలో మున్సిపల్ ఎన్నికలు.. ముగిసిన నామినేషన్ల గడువు

అమరావతి (సింగిడి)

ఏపీలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ ముగిసిం ది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచా యతీలకు నామినేషన్లు దాఖలు చేసేం దుకు విధించిన గడువు ఆదివారం (అక్టోబర్ 18) మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. చివరి రోజు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు అభ్యర్థులు, వారి మద్దతుదారులతో కిటకిట లాడాయి. ఆదివారం మధ్యా హ్నం 3 గంటల సమయానికి కార్యాలయ ప్రాంగణాల్లో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు జారీ చేసి, వారి నుంచి నామి నేషన్ పత్రాలను స్వీకరించారు. ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో పురపోరు రసవత్తరంగా మారనుంది. ప్రకాశం జిల్లా దర్శిలో వైసీపీకి ఊహించని పరిణామం ఎదురైంది. గడువు ముగియడంతో దాదాపు 25 మంది వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారు. సమయానికి కార్యాల యానికి చేరుకోలేకపోవడంతో వారు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది. నామినేషన్ల పర్వం ముగియడంతో ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియపై దృష్టి సారించింది. షెడ్యూల్ ప్రకారం, రేపు (అక్టోబర్ 19) నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 21 వరకు నామినే షన్ల ఉపసంహరణకు గడువు విధించారు.

రంగు రంగుల సింగిడి

పొట్యాలలో..



పూల సోయగాలతో ప్రత్యేక ఆకర్షణ

మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, తంగేడు, గునుగు తదితర పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. వాటిని ఒకచోట చేర్చి, చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడారు.
కోలాటాలు, ఆటపాటలతో సందడి చేశారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు మహిళలు ఉత్సాహంగా పాల్గొని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.

సంప్రదాయాలకు ప్రతిబింబం

ప్రకృతి ఆరాధనకు, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కొనసాగిస్తూ ఆడపడు చులు భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహిం చారు. సద్దుల బతుకమ్మతో రామగుండం కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలు పూల పరిమళాలు, సంప్రదాయ గీతాలతో కళకళలాడాయి.



లక్ష్మీ నగర్ కాలనీలో



సాంధినగర్‌లో



లక్ష్మీ నగర్ సిటీ స్కాన్ ప్రాంతంలో



గొలివాడలో



పొట్యాలలో..

జర్మనీ ఉద్యోగాల పేరిట టోమ్‌కామ్ భారీ మోసం

హైదరాబాద్, అక్టోబర్ 18 (సింగిడి)

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వ ఆధ్వర్యంలోని టోమ్‌కామ్ (తెలం గాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) నిరుద్యోగ యువతను దోచుకునే ఓ పెద్ద రాకెట్‌గా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. జర్మనీలో ఉద్యోగాల పేరు చెప్పి 70 మందికి పైగా యువకుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారిని నట్టేట ముంచారని సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హరీశ్ రావు ఆరోపణల ప్రకారం, సుమారు 15 జిల్లాల నుంచి 70-75 మంది నిరుద్యోగ యువకుల నుంచి టోమ్‌కామ్ ఒక్కొక్కరి దగ్గర రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేసింది. పరీక్షలు, ఇన్సూరెన్స్, వీసా ఖర్చులతో కలిపి ఇది ఒక్కో అభ్యర్థికి దాదాపు రూ.4.5 లక్షలకు చేరిందని ఆయన వివరించారు. పేద రైతు కుటుంబాలకు చెందిన వారు తమ ఇంట్లోని మహిళల బంగారాన్ని తాకట్టు పెట్టి, అప్పులు చేసి ఈ డబ్బు కట్టారని, రెండేళ్లు గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో ఇంకా వడ్డీలు చెల్లిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లు దాటినా, బాధితుల్లో ఒక్కరిని కూడా ఒక్క జర్మన్ కంపెనీ కూడా



ఇంటర్వ్యూ చేయలేదని హరీశ్ రావు తెలిపారు. జర్మన్ భాషలో బీ1 పరీక్ష పాసైన వారిని, ఇప్పుడు బీ2 పాస్ కావాలని చెప్పి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వీరిలో తొమ్మిది మంది జర్మనీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారంటూ టోమ్‌కామ్ ప్రచారం చేసుకున్నా, ఒక్కరు కూడా వెళ్లలేదని స్పష్టం చేశారు. ఈ అభ్యర్థులతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఏదైనా వివాదం తలెత్తితే 1,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నో కోర్టులో తేల్చుకోవాలని నిబంధన పెట్టడం దారుణమని అన్నారు. టోమ్‌కామ్ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలని ఆర్టీఐ ద్వారా అడిగినా, గడువు ముగిసినా సమాధానం ఇవ్వడం లేదని విమర్శిం చారు. బాధితులు రెండేళ్లుగా ఎదురుచూస్తుంటే, ఈ ఏడాది జూన్‌లో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి కొత్త టోమ్‌కామ్ బ్యాచ్‌ను ప్రారంభించి ఉద్యోగ హామీలు ఇవ్వడం బాధితులను అవమానించ డమేనని హరీశ్ రావు దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఈ మోసానికి పాల్పడిన టోమ్‌కామ్, ఫెయిర్‌స్టీట్ ఇండియా సంస్థల నుంచి వసూలు చేసిన ప్రతి రూపాయిని బాధితులకు తిరిగి చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. వారు కోల్పోయిన రెండేళ్ల కాలానికి, వడ్డీ భారం, మానసిక వేదనకు నష్టపరిహారం అందించాలన్నారు. బాధితులందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, ఈ వ్యవహారంపై తక్షణమే సీబీడీ లేదా జ్యుడీషియల్ విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఫీజుల వసూళ్లు, కల్పించిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హరీశ్ రావు తన పోస్టులో స్పష్టం చేశారు.





బతుకమ్మ, దసరా పండగల వేళ ఆర్టీసీ ఛార్జీల మోత

సాధారణ సర్వీసులను తగ్గించి, వాటినే పండగ స్పెషల్ బస్సులుగా చూపిస్తూ అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు సాధారణ టికెట్ ధర రూ. 230 ఉండగా, ఇప్పుడు రూ. 400 వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీ ఎస్‌కు రూ. 220 ఉన్న టికెట్‌ను రూ. 290కి పైగా పెంచారని తెలిపారు. ఇదేనా మీ ప్రజా పాలన? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అయితే, ఈ ఛార్జీల పెంపు కేవలం పండగ రద్దీ కోసం నడుపుతున్న 7,000 ప్రత్యేక బస్సులకు మాత్రమే వర్తిస్తుందని టీజీఎస్ఆర్టీసీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణ సర్వీసుల్లో ఛార్జీలు యథాతథంగానే ఉన్నాయని తెలిపాయి. పండగ సమయంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన తర్వాత బస్సులు ఖాళీగా తిరిగి రావడం వల్ల అయ్యే నిర్వహణ ఖర్చులను భర్తీ చేసేందుకు ఈ 50 శాతం సర్ఛార్జి విధిస్తున్నట్లు అధి కారులు వివరిస్తున్నారు. 2003లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు (జీవో ఎంఎస్ నెం. 16) ప్రకారమే ఈ సర్ఛార్జిని వసూలు చేస్తున్నామని, ఇది కొత్త విధానం కాదని టీజీఎస్ఆర్టీసీ చెబుతోంది. అయినప్ప టికీ, పండగ వేళ ఛార్జీల పెంపు సరైంది కాదని ప్రతి పక్షాలు విమర్శిస్తుండటంతో ఈ అంశంపై రాజకీ యంగా చర్చ మొదలైంది.

రాష్ట్ర వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబురాలు





బతుకమ్మ వేడుకలు, తెలంగాణ ప్రజల హృదయా లకు దగ్గరగా ఉండి, వారి సంస్కృతిని ప్రదర్శించ డానికి ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తున్నాయి. సద్దుల బతుకమ్మ వేడుకలు, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం నిర్వహించబడుతున్న ప్రత్యేకమైన పండుగ. ఈ వేడుకల ద్వారా మహిళలు తమ సాంప్రదాయాలను, సంస్కృతిని పునరుద్ధరించు కుంటున్నారు.
బతుకమ్మ ఆడడం ద్వారా, వారు తమ ఆనందాన్ని, సంతోషాన్ని పంచుకుంటున్నారు. ఈ వేడుకలు, మహిళల శక్తిని, సమానత్వాన్ని ప్రోత్స హించడానికి ఒక ముఖ్యమైన మార్గంగా మారాయి. తెలంగాణ రాష్ట్రంలో ఈ వేడుకలు, ప్రతి ఒక్కరికీ సాంస్కృతిక అనుభూతిని అందించ డంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ వేడుకల ద్వారా, తెలంగాణ ప్రజలు తమ సంస్కృతిని, సంప్రదాయాలను మరింత బలంగా నిలబెట్టుకుం టున్నారు.

మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

బస్సును ఢీకొట్టిన కారు
ఐదుగురు మృతి

ముంబై అక్టోబర్ 18 (సింగిడి)

ఒక కారు గుంతలో పడి అదుపుతప్పింది. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆ కారు నుజ్జు కావడంతో పాటు దాని భాగాలు చెల్లాచెదురుగా రోడ్డుపై పడ్డాయి. అందులో ప్రయాణించిన చిన్నారి సహా ఐదుగురు ఈ ప్రమాదంలో మరణించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పంధర్‌పూర్-ఖమ్‌గావ్ జాతీయ రహదారిలోని షిండేవాడి ఫాటా సమీపంలో వేగంగా వస్తున్న స్విఫ్ట్ కారు ఒక గుంతలో పడింది. దీంతో డ్రైవర్ కారుపై నియంత్రణ కోల్పోయాడు. ఈ నేపథ్యంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఆ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అది పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. కారు శిథిలాలు, బంపర్ ముక్కలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. కాగా, ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. కారులో ప్రయాణించిన చిన్నారితో సహా ఐదుగురు ఈ ప్రమాదంలో మరణించగా బస్సులోని ప్రయా ణికులు సురక్షితంగా ఉన్నారు. మరోవైపు మృతులను మజల్‌గావ్‌కు చెందిన ఒక కుటుంబ సభ్యులుగా పోలీసులు గుర్తించారు. దర్శనం కోసం తులజాపూర్‌కు వెళ్లి కారులో వారు తిరిగి
వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుసుకు న్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటన వల్ల హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో దానిని క్లియర్ చేశారు.

భక్తులపైకి దూసుకెళ్లిన ట్రక్కు

12 మంది దుర్మరణం..
29 మందికి గాయాలు

గ్వాలియర్ శీత్లా మాతా ఆలయం వద్ద పెను విషాదం

గ్వాలియర్ (సింగిడి)

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలో నవరాత్రి వేళ అత్యంత హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. ప్రముఖ శీత్లా మాతా ఆలయ సమీపంలో అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 1:30 గంటల సమయంలో నియంత్రణ కోల్పోయిన వరి ధాన్యపు ట్రక్కు భక్తులపైకి దూసుకెళ్లిన ప్రమాదంలో 12 మంది ప్రాణాలు. చినూర్ వైపు నుంచి మితిమీరిన లోడుతో
వస్తున్న ట్రక్కు, భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఉన్న ఏటవాలు మార్గంలో అకస్మాత్తుగా అదుపుతప్పింది. పోలీసుల చెక్‌పోస్టు బారికేడ్లను బలంగా ఢీకొట్టి దూసుకొచ్చి, రోడ్డుపై నడుస్తున్న భక్తులను, తాత్కాలిక దుకాణాలను తొక్కు కుంటూ చివరికి ఆలయ ప్రధాన ముఖద్వారం, ప్రహరీ గోడను బలంగా ఢీకొట్టి ఆగింది. ఈ ప్రమాదంలో విధుల్లో ఉన్న ఇద్దరు పోలీసు సిబ్బంది సహా మొత్తం 39 మంది బాధితులను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, వారిలో 12 మంది మృతి చెందినట్లు గ్వాలియర్ ఎస్పీ ధర్మవీర్ సింగ్ ధ్రువీకరించారు . ఈ దుర్ఘటనలో గాయపడిన 29 మంది ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వారిలో ఐదారుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని గ్వాలియర్ కలెక్టర్ రుచికా చౌహాన్ వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే అత్యవసర అంబు లెన్సులు, సహాయక వాహనాలను ఘటనా స్థలానికి రప్పించి సహాయక చర్యలను వేగవంతం చేశామని తెలిపారు. క్షతగాత్రులకు సీటీ స్కాన్‌లు, ఎక్స్-రేలు తీసి నిపుణులైన వైద్యులతో మెరుగైన అత్యవసర వైద్యం అందిస్తు న్నట్లు పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాల వేళ భారీ వాహనాల రాకపోకలు నిలిపివేసి చెక్‌పోస్టు ఏర్పాటు చేసినప్పటికీ.. సదరు ఓవర్‌లోడ్ ట్రక్కు బారికేడ్లను ఎలా దాటి లోపలికి వచ్చిందనే కోణంలో సమగ్ర విచారణకు ఆదేశించారు. ట్రక్కులో ఏదైనా సాంకేతిక లోపం తలెత్తిందా అనే విషయాన్ని నిర్ధారించేందుకు ఆర్టీవో బృందాన్ని రంగంలోకి దించారు. పండుగ వేళ జరిగిన ఈ పెను విషాదం ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

- నిర్మలా జగ్గారెడ్డి
- సదాశివపేట, సంగారెడ్డి కలెక్టరేట్‌లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న నిర్మల జగ్గారెడ్డి



సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 18 (సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో అన్ని శాఖల ఉద్యోగులు, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ ఆటపాటలతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు బతుకమ్మల చుట్టూ వలయంగా ఏర్పడి ఉత్సాహంగా ఆడిపాడారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన బతుకమ్మ పాటలు వేడుకలకు మరింత ఉత్సాహాన్ని చేకూర్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంగీత, కలెక్టరేట్ లోని మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. సదాశివపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సదాశివపేట లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లోనూ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతిని పూజించే అరుదైన పూల పండుగ బతుకమ్మ తెలంగాణకు ప్రత్యేకమని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ఈ పండుగ చిహ్నంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం లో సదాశివపేట మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుకా చిరు, కౌన్సిలర్ లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తాండూరు సబ్ డివిజన్ పరిధిలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 18 (సింగిడి): వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రో ఐ పీ ఎస్ ఆదేశాల మేరకు, తాండూరు సబ్ డివిజన్ డీఎస్పీ ఎన్. యాదయ్య ఆధ్వర్యంలో రాజీవ్ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని శనివారం తెల్లవారు జామున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 95 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సరైన పత్రాలు లేని 33 ద్విచక్ర వాహనాలు, 9 త్రిచక్ర వాహనాలు కలిపి మొత్తం 42 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా పాపిలాన్ డివైస్ సహాయంతో ఒక అనుమానిత వ్యక్తిని గుర్తించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ కాలనీకి చెందిన సుమారు 150 మంది పౌరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు శాంతిభద్రతలు, వ్యక్తిగత భద్రత, నేరాల నివారణ, అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండటం, అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాండూరు సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీ ఎన్. యాదయ్య మాట్లాడుతూ, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడం, నేరాలను నియంత్రించడం, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని, ప్రజలు అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలను గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ, నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజలకు పోలీసులకు మధ్య సత్సంబంధాలను పెంపొందిస్తూ, ప్రజల భాగస్వామ్యంతో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో తాండూర్ టౌన్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్, కరణ్ కోట్ సీ ఐ ప్రవీణ్ కుమార్, సబ్ డివిజన్ ఎస్.ఐ లు పాల్గొన్నారు.

మరో ఫ్లోరైడ్ సమస్యలా... జవహర్ నగర్ డంపింగ్ యార్డ్

- డంపింగ్ యార్డ్ తరలింపుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- దుర్వాసనతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి.. నరకయాతన అనుభవిస్తున్న స్థానికులు
- కార్మిక నగర్‌లో పల్లె నిద్ర కార్యక్రమంలో ఏనుగు సుదర్శన్ రెడ్డి
- డంపింగ్ యార్డ్ ఎత్తివేసే వరకు బీజేపీ పోరాటం



జవహర్ నగర్, అక్టోబర్ 18 (సింగిడి): మరో ఫ్లోరైడ్ సమస్యలా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తయారయిందని బిజెపి మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల ప్రజలు డంపింగ్ యార్డ్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసనను మాటల్లో వర్ణించలేమని, ప్రజలు ప్రతిరోజూ నరకయాతన అనుభవిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. శుక్రవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా కార్మిక నగర్‌లో బస చేసిన ఆయన, స్థానిక పరిస్థితులపై మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలిస్తామని గతంలో హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రస్తుతం సమస్యను విస్మరించారని సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. ప్రజల ఆరోగ్యం, జీవన పరిస్థితులపై పాలకులకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సమస్య పరిష్కారానికి సరైన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. డంపింగ్ యార్డ్ కారణంగా సుమారు 20 లక్షల మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కార్మిక నగర్‌లో నివసిస్తున్న సుమారు 8 వేల మంది ప్రజలు దుర్వాసనతో తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. చర్మ వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు, గుండె, కిడ్నీ, ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్య సమస్యలపై స్థానికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మిక నగర్‌లో కనీసం అంగన్‌వాడీ కేంద్రం, ఆసుపత్రి, పాఠశాల వంటి సౌకర్యాలు కూడా లేకపోవడం శోచనీయమని సుదర్శన్ రెడ్డి విమర్శించారు. మేడ్చల్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన ప్రజాప్రతినిధులు జవహర్ నగర్ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఏనుగు సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించి, డంపింగ్ యార్డ్ ఎత్తివేత కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ జేఏసీ నేతలు పాల్గొన్నారు.



చెంగోముల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీ ఎస్



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 18 (సింగిడి): వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రో, ఐపీఎఎస్ శనివారం జిల్లా పరిధిలోని చెంగోముల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ నిర్వహణ, పోలీస్ సిబ్బంది విధులు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ పరిసరాలు, లాక్‌అప్, రైటర్స్ రూమ్‌తో పాటు వివిధ విభాగాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో పరిశుభ్రత, క్రమశిక్షణ, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించి, స్టేషన్ నిర్వహణలో నిర్దేశిత ప్రమాణాలను పాటించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, పెండింగ్ కేసుల ఫైళ్లు, కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. ముఖ్యంగాఐ సీ జే ఎస్, సీ సీ టీ ఎన్ ఎస్ వ్యవస్థల్లో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, డేటా అప్‌డేషన్‌లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, దర్యాప్తును వేగవంతం చేసి, నిర్దిష్ట గడువులోగా కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్ డి పీ ఎస్ కేసుల దర్యాప్తు, నిందితులకు సంబంధించిన వివరాల నమోదు, సాక్ష్యాధారాల సేకరణ, కేసుల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల కేసుల్లో ప్రమాద కారణాలను విశ్లేషిస్తూ, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా దర్యాప్తు చేపట్టాలని, ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను బాధ్యతాయుతంగా స్వీకరించి చట్టప్రకారం పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం చేశారు. పోలీస్ స్టేషన్ నిర్వహణలో పారదర్శకత, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, కేసుల త్వరిత పరిష్కారం, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడం ప్రధాన లక్ష్యాలుగా పనిచేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పరిగి సీఐ కొండల్ రెడ్డి, చెంగోముల్ ఎస్ఐ భరత్ కుమార్ రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికత, ఐక్యతకు ప్రతీక

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



మల్కాజిగిరి, అక్టోబర్ 18(సింగిడి): మల్కాజిగిరి సర్కిల్ మల్కాజిగిరి దిల్లర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవి నవరాత్రులు సందర్భంగా శనివారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవీ నవరాత్రులు భక్తి తోపాటు ఆధ్యాత్మికత, ఐక్యత కు ప్రతీకలని, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బూంపల్లి సాయి తేజా, కాంగ్రెస్ బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, పి వి సత్యనారాయణ, జీడి సంపత్ గౌడ్, కపిలేశ్వర్, చెన్నారెడ్డి, రాఘవన్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేతలో ఉద్రిక్తత

టౌన్ ప్లానింగ్ అధికారులను అడ్డుకున్న స్థానిక ప్రజలు



రాజేంద్రనగర్, అక్టోబర్ 18 (సింగిడి): జీహెచ్ఎంసీ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని మధురానగర్ కాలనీలో అక్రమ నిర్మాణాల కూల్చివేతకు వెళ్లిన టౌన్ ప్లానింగ్ అధికారులకు స్థానిక నాయకులు, ప్రజల నుంచి అడ్డంకులు ఎదురవడంతో ఉద్రిక్తత నెలకొంది. శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, జీవో 111 పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాలను తొలగించేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీసు బందోబస్తుతో కాలనీకి చేరుకున్నారు. టీపీఎస్ సంతోష్ సింగ్‌తో పాటు టౌన్ ప్లానింగ్ సిబ్బంది కూల్చివేత చర్యలు చేపట్టేందుకు ప్రయత్నించారు. అయితే, ఈ చర్యలను స్థానిక ప్రజలు, నాయకులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అధికారులకు, స్థానికులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులను ఉద్దేశించి కొందరు తీవ్ర పదజాలంతో దూషించినట్లు సమాచారం. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు అక్కడే ఉన్నప్పటికీ పరిస్థితుల నేపథ్యంలో కూల్చివేత చర్యలను అధికారులు నిలిపివేసి వెనుదిరిగారు. విధి నిర్వహణలో భాగంగా వచ్చిన తమను స్థానికులు దూషించడం బాధాకరమని టౌన్ ప్లానింగ్ అధికారులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తా..

బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 18 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సర్వముఖాభివృద్ధే లక్ష్యం, మౌలిక వసతుల కల్పనే అభివృద్ధే లక్ష్యంగా సీఎంసీ కొంపల్లి సర్కిల్ విధాత్రి విల్లాస్ లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విధాత్రి విల్లాస్ వాసులు మరియు సమీప కాలనీ వాసులు లో ప్రెషర్ తో త్రాగునీటి సరఫరా అవుతున్నందునా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కొంపల్లి నుంచి విధాత్రి విల్లాస్ కి వచ్చే ప్రధాన రహదారిలో వీధి దీపాలు లేక కాలనీకి వచ్చే వారు చీకట్లలో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని, చీకట్లో ప్రధాన రహదారిలో ఇష్టం వచ్చినట్లు చెత్త వేసి వెళ్తున్నారని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్రాగునీటి సరఫరా లో నీటి ప్రెషర్ ను పెంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. అదేవిధంగా వీధి దీపాలను వెంటనే ఏర్పాటు చేసి ప్రజల అసౌకర్యాన్ని తొలగించాలి. రాత్రి వేళల్లో చెత్తను డంప్ చేయకుండా పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో విధాత్రి విల్లాస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కొంపల్లి మున్సిపల్ డీసీ లావణ్య, మాజీ చైర్మన్ సన్న కవితా శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవితా శ్రీశైలం యాదవ్, పాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సంగీతా రెడ్డి, నాయకులు పూజారి లక్ష్మణ్ గౌడ్, క్రిష్ణ సాగర్, ఛన్ను భాయ్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి

- వరిధాన్యం కొనుగోళ్ల సన్నాహక సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 18 (సింగిడి): 2026--27 వానాకాలం వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి నిర్వహించిన సన్నాహక సమావేశం, శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి మాట్లాడుతూ, 7 సన్న రకాల బోనస్, ఆర్ ఎన్ ఆర్ 15048, తెలంగాణ సోనా, కే ఎన్ ఎం 1638, హెచ్ ఎం టీ, సోనా, కే ఎన్ ఎం 7715, బీపీటీ . 5204 సాంబ మసూరి, జైశ్రీ రామ్, డబ్ల్యూ జీ ఎల్ 44 సిద్ధ ఈ ఏడు రకాలకు 500 బోనస్ ఇవ్వబడుతుందని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. పీపీసీ . సెంటర్స్ , దొడ్డు రకం 118, సన్న రకం , 22 మొత్తం సెంటర్లు 140 ఏర్పాటు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతి కొనుగోలు సెంటర్ కు 2 లారీలు 10 మంది హమాలీలు. ఏర్పాటు చేస్తున్నట్లు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులను ముందస్తుగా ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోమౌలిక వసతులు తప్పనిసరి గా ఉండాలని ఆదేశించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, రైతులకు అవసరమైన ఇతర వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. రాబోయే ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ఎండ, వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడేందుకు డీసీఓ, డీఆర్డీఓ, డీసీఎంఎస్ సంస్థల సమన్వయంతో టార్పాలిన్లు, తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలు సుమారు 45 రోజులపాటు కొనసాగనున్నందున, ధాన్యం నిల్వకు తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ప్రస్తుతం అందుబాటులో సెంటర్లకు సరిపడా టార్పాలిన్లను అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని, ఒక్కో కొనుగోలు కేంద్రానికి 20 టార్పాలిన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సన్న ధాన్యం రకాల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి కొనుగోలు కేంద్రాల్లో సన్న ధాన్యం రకాలను గుర్తించేందుకు సెంటర్ బోర్డులు ఏర్పాటు చేయాలని, ఏడు రకాల సన్న ధాన్యాన్ని గుర్తించేలా సాంకేతిక నిపుణుల సేవలను వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. అనంతరం నవంబర్ మొదటి వారంలో పత్తి కొనుగోలు కేంద్రాలు జిల్లాలోసీసీఐ (సీసీఐ) ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను నవంబర్ మొదటి వారంలో ప్రారంభించనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటాచారి తెలిపారు. పత్తి కొనుగోలుకు సంబంధించి సీసీఐ నుంచి అధికారిక ఆదేశాలు అందాయని సూచించారు. జిల్లాలో పరిగి లో 1, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్ 2, రాకంచెర్ల కాటన్ మిల్స్ 3, నరసింహ కాటన్ మిల్స్ మరియు తాండూరులో 1, ఎమ్మెస్ శుభం ఇండస్ట్రీస్ 2, ఎమ్మెస్ మారుతి ఇండస్ట్రీస్ 3, బాలాజీ కాటన్ ఇండస్ట్రీస్ మరియు వికారాబాద్ లో 1, ఎమ్మెస్ ధరణి కాటన్ మిల్స్ 2, ఎమ్మెస్ సాయిబాబా అగ్రోటెక్ 3, ఎమ్మెస్ అయ్యప్ప కాటన్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, కొడంగల్ లో 1, ఎమ్మెస్ విజయ ఇండస్ట్రీస్, కోట్ పల్లిలో ఎమ్మెస్ సుమిత్ర కాటన్ మిల్ 2, సాయిబాబా కాటన్ ఆగ్రో ఇండస్ట్రీస్ , దారూర్ లో ఎమ్మెస్ శ్రీ సాయిబాబా అగ్ర కమోడిటీస్ , మర్పల్లి లో ఎమ్మెస్ అయ్యప్ప కాటన్ ఇండస్ట్రీస్ సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లను అధికారులు ముందుగానే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వెంకటాచారి ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. పత్తి క్వింటాల్‌కు రూ. 8,667 ధర ఉంటుందని ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు సౌకర్యవంతమైన సేవలు అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలోఅగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ కవిత, కో పరేటివ్ డిపార్ట్‌మెంట్ శ్రీనివాస్, డి ఎం సివిల్ సప్లై నరసింహ డీటీ సివిల్ సప్లై గణపతి, డీసీఎం ఎస్ శ్యాంసుందర్, మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా స్వరన్ సింగ్ సింగ్, డీసీవో కె. నాగరాజన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ నోటీసుల పంపిణీ, విచారణలను వేగవంతంగా పూర్తి చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్





సంగారెడ్డిబ్యూరో , అక్టోబర్ 18 (సింగిడి): ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ -ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న నోటీసుల పంపిణీ, విచారణలను వేగవంతంగా పూర్తిచేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ , అన్ని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ ఐ ఆర్--2026 ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్దేశిత ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ) ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం ఫారం--6, 7, 8 దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు జాబితాలో స్థానం కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు జారీ చేసిన నోటీసులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్దేశిత ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ) ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్--2026 ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, అర్హులైన ఓటర్లకు జాబితాలో చోటు కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలకు సూచించారు. ఈ నెలాఖరు వరకు పెండింగ్ నోటీసుల పంపిణీ, విచారణలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు పాండు, సంగీత, ఏఈఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

- పట్టభద్రుల మల్కాజిగిరి నియోజకవర్గ ఇంచార్జి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



మల్కాజిగిరి, అక్టోబర్ 18 (సింగిడి): హైదరాబాద్, రంగారెడ్డి , మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరం కష్టపడి పని చేయాలని హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ పట్టభద్రుల మల్కాజిగిరి నియోజకవర్గ ఇంచార్జి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. హైదరాబాద్ రంగారెడ్డి, మహబూబ్ నగర్, పట్టభద్రుల మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం ఈస్ట్ ఆనంద్ బాగ్ లోని మైనంపల్లి క్యాంప్ కార్యాలయం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టభద్రుల ఎన్నికల మల్కాజిగిరి నియోజకవర్గ ఇంచార్జి మెదక్ ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు సామ రామ్మోహన్ రెడ్డి ని గెలిపిస్తాయని నవంబర్ 6 వరకు పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త నాయకుడు నమోదు చేపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి లక్ష్మీకాంత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, రాజ్ జితేంద్రనాథ్, ఏకే మురుగేష్, బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, నాయకులు బికే శ్రీనివాస్, జిఎన్ వి సతీష్ కుమార్, కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, పిట్టల శ్రీనివాస్, సంతోష్ రాందాస్, జీడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, వైనాలా ప్రవీణ్, పిట్టల నాగరాజు, మంద భాస్కర్, రొట్టెల ధరణ్ కుమార్, యూసుఫ్, రాఘవన్, లక్ష్మి, కపిలేశ్వర్, రామచందర్, జీడి చరణ్ జిత్ గౌడ్, ఆశా, సుమలత, ఇందిరా ప్రియదర్శిని, శారద, పుష్పలత, కనకలక్ష్మి, సుమలత యాదవ్, జ

Editorial

ఎడిటోరియల్

ప్రకృతి విపత్తు పై రాజకీయ బురదజల్లుడేంది?..

విపక్షాల అసహనానికి ఇది నిదర్శనం!



ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు పాలకుల పరిణతి, ప్రతిపక్షాల స్పందన ఒక సమాజం యొక్క ప్రజాస్వామ్య దృక్పథాన్ని, బాధ్యతారాహిత్యాన్ని ఎత్తిచూపుతాయి. ప్రస్తుతం తెలంగాణ సమాజం తీవ్రమైన వర్షాభావం, ఊహించని ఎల్‌నినో వాతావరణ పరిణామాల వల్ల భయంకరమైన నీటి ఎద్దడి, విద్యుత్ కొరత ఎదుర్కొనే ప్రమాదంలో పడింది. ఐక్యరాజ్యసమితి హెచ్చరికలు, ప్రపంచ శాస్త్రవేత్తల పరిశోధనలు వందకు పైగా దేశాల్లో ఎల్‌నినో ముప్పు తీవ్రంగా ఉండబోతోందని తేల్చిచెప్పాయి. భారతదేశంలోని అనేక రాష్ట్రాలు ఎండల తీవ్రతకు, నీటి కొరతకు అల్లాడుతున్నాయి. ఇటువంటి తరుణంలో, ఇది కేవలం ప్రకృతి సృష్టించిన గ్లోబల్ వైపరీత్యమని తెలిసీ, తెలంగాణలో ఏర్పడిన ప్రతికూల పరిస్థితులకు ప్రభుత్వంపై నెపం నెడుతూ బిఆర్ఎస్, టిఆర్ఎస్ , బిజెపి నాయకులు 'కాంగ్రెస్ తెచ్చిన కరువు' అని విషప్రచారం చేయడం అత్యంత హేయమైన, బాధ్యతారాహిత్యమైన రాజకీయ దిగజారుడుతనానికి ప్రత్యక్ష నిదర్శనం.

ఎల్‌నినో అనేది మానవుల చేతుల్లో లేని అంతర్జాతీయ పర్యావరణ వ్యవస్థ మార్పు. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల రుతుపవనాలు తీవ్రంగా బలహీనపడతాయి. గతేడాది ఇదే సమయానికి తెలంగాణ రిజర్వాయర్లలో 462 టీఎంసీల నీరు అందుబాటులో ఉంటే, ఈరోజు అది 200 టీఎంసీలకు పడిపోవడం ఎవరి వైఫల్యం? మానవ ప్రమేయం లేకుండా వానలు పడకపోవడం ప్రకృతి శాపం కాదా? అలాగే, రాష్ట్రావిర్భావం నాటి కంటే విద్యుత్ డిమాండ్ ఏకంగా 20,000 మెగావాట్లకు చేరడం, చలికాలం ప్రారంభంలోనే మార్చి నెలను తలపించేలా 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం వంటి అంశాలు శాస్త్రీయంగా నగ్న సత్యాలు. ఈ క్రమంలో, పరిస్థితి తీవ్రతను గ్రహించి ప్రజలను ముందే అప్రమత్తం చేయడం పాలకుడి బాధ్యత. ముఖ్యమంత్రి ఆ ధైర్యం చేసి, దాచకుండా నిజాన్ని ప్రజల ముందు ఉంచారు.

ప్రభుత్వం సంక్షోభ నివారణకు ప్రణాళికాబద్ధమైన చర్యలు ప్రారంభించింది. అందుబాటులో ఉన్న నీటిని సాగు కంటే తాగునీటికే మొదటి ప్రాధాన్యతగా కేటాయించడం, రాబోయే 8 నుండి 10 నెలలు పొదుపు చర్యలు పాటించాలని కోరడం బాధ్యతాయుతమైన ముందస్తు ఆలోచన. ఎండాకాలం వరి పంటలు వేసి నీరు అందక పెట్టుబడులు కోల్పోయి, మోటార్లు కాలిపోయే దయనీయ పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ఒక సీజన్ వాయిదా వేసుకోవాలని, ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని కోరడంలో రైతు సంక్షేమం కాక మరేముంది? దీనిని "కరువు"గా చిత్రీకరిస్తూ రైతులను రెచ్చగొట్టడం ద్వారా ప్రతిపక్షం ఏం సాధించాలనుకుంటోంది? రైతును ఆదుకోవడానికి ఎంత మూల్యమైనా చెల్లించి బహిరంగ మార్కెట్ నుంచి విద్యుత్ కొనుగోలు చేస్తామని స్పష్టం చేస్తున్నప్పుడు అభినందించాల్సింది పోయి, శవ రాజకీయాలు చేయడం పైశాచికం కాదా?

సంక్షోభాన్ని అధిగమించడానికి ప్రభుత్వం సర్వశక్తులూ ఒడ్డుతోంది. 2.5 లక్షల మంది ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించడం, పశుగ్రాసం అభయారణ్య నిల్వలు పెంచడం, తాగునీటి సరఫరాను 24 వేల గ్రామాలకు సజావుగా అందించడం, వైద్య ఆరోగ్య శాఖను అత్యవసరంగా సన్నద్ధం చేయడం ద్వారా ఒక సమగ్ర విపత్తు నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేసింది. వీటికితోడు ప్రత్యేక వార్ రూమ్, టోల్ ఫ్రీ నంబర్, సీనియర్ అధికారితో నోడల్ ఆఫీస్ పర్యవేక్షణ, సబ్ కమిటీ ఏర్పాటు వంటివి యంత్రాంగం యొక్క పారదర్శకతను నిరూపిస్తున్నాయి.

అంతేగాక, రాజకీయాన్ని పక్కనబెట్టి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని, నవంబర్ మొదటి వారంలో ప్రతిపక్షాల ప్రతినిధులతో కలిసి ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రిని కలిసి కేంద్ర విపత్తు నిధులు, అదనపు విద్యుత్ పూల్ సాధిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు, పౌరసమాజం ఏకతాటిపైకి వచ్చి ప్రకృతి విపత్తుపై పోరాడాలని పిలుపునిచ్చినప్పుడు, దానిని ఆసరాగా చేసుకుని విషం చిమ్మడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమే.

కరువు లేదా నీటి ఎద్దడి అనేది శాస్త్రీయ కారణాల వల్ల సంభవించే వైపరీత్యం. అంతర్జాతీయ స్థాయిలో శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న ఎల్‌నినో పరిస్థితులను "కాంగ్రెస్ తెచ్చిన కరువు" అని వ్యాఖ్యానించడం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయన వర్గాల అజ్ఞానానికి, తీవ్ర అసహనానికి నిదర్శనం. అధికారం కోల్పోయిన ఆక్రోశంతో ప్రజలను భయాందోళనలకు గురిచేయడం, భ్రమలు కల్పించి రైతాంగాన్ని నష్టాల్లోకి నెట్టాలని చూసే కుట్రలు తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉంది.

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల పాత్ర కేవలం నిందించడం కాదు; ఆపదలో ఉన్న ప్రజలకు ధైర్యాన్ని ఇవ్వడం, ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలు చేయడం. కష్టకాలంలో రైతులను రెచ్చగొట్టి పెట్టుబడులు నష్టపోయేలా చేయడం శ్రేయోస్కరం కాదు. ప్రతిపక్షాలు తమ సంకుచిత రాజకీయ స్వార్థాన్ని, బురదజల్లే నైజాన్ని పక్కనబెట్టి బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. ఇది రాజకీయం చేసే సమయం కాదు, ప్రజా రక్షణకు భుజం భుజం కలిపి నిలబడాల్సిన సమయం! ఇప్పటికైనా అబద్ధాల ప్రచారాన్ని కట్టిపెట్టి, ఎల్‌నినో విపత్తును జయించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యాచరణలో ప్రతిపక్షాలు భాగస్వామ్యమవ్వాలి!

వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ 984559863

అమరజీవి ఆత్మార్పణానికి మరో కోణం

అక్టోబర్ 19... పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష ప్రారంభించిన దినం

అక్టోబర్ 19, 1952లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర డిమాండ్‌తో పొట్టి శ్రీరాములు మద్రాసులో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన దినం. 50రోజుల నిరహార దీక్ష తరువాత, మద్రాసును వదులుకొంటే ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం సాధ్యపడుతుందని ప్రధాని నెహ్రూ ప్రకటించినా, పొట్టి శ్రీరాములు అందుకు అంగీకరించ కుండా తన నిరాహార దీక్షను కొనసాగించి డిసెంబర్ 15వ తేదీన ఆత్మార్పణ చేసుకొన్న నేపథ్యం. అమరజీవి'గా ప్రాచుర్యం పొందిన పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేసి, ఆత్మార్పణం చేసుకున్న నేపథ్యం గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆయన ఆమరణ నిరాహారదీక్ష ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసమే అనే మిగుల ప్రచారంలో ఉన్నా, దాని వెనక మద్రాసు నగర అంశం ప్రధానమని కొందరి అభిప్రాయము.



రాష్ట్ర ఏర్పాటు అనేది చాలా తీవ్రమైన రాజకీయ సమస్యగా మారిపోగా, అలాంటి రాజకీయ సమస్య కోసం శ్రీరాములు దీక్ష చేయటానికి ప్రధానంగా మద్రాసు నగర భవిష్యత్తే అని పలు వ్యాసాలను బట్టి మరో కోణానికి బలం చేకూరు తున్నది.

మద్రాసు ప్రెసిడెన్సీలో 40 శాతం జనసంఖ్య, 58 శాతం రాష్ట్ర విస్తీర్ణం తెలుగు వారిదే. రాష్ట్ర రాజకీయాలలో తమకు పలుకుబడి లేదని, తమిళుల చేత అవహేళనకు గురౌతున్నామన్న భావన తెలుగు వారిలో మెదలైంది. 1911 లో ఆనాటి వార్తా పత్రికల వ్యాసాల ద్వారా, సంపాదకీయం ద్వారా తెలుగు ప్రజలలో ప్రత్యేక రాష్ట్ర వాంఛ మొదలైంది. 1911 చివరి నాటికి ప్రత్యేక రాష్ట్ర చర్చ ఊపందుకుంది. తెలుగు మాట్లాడే ప్రజలందరూ ఒకే రాష్ట్రంగా ఏర్పడాలనే అభిప్రాయాలు ఆంధ్రరాష్ట్ర ఉద్యమం ప్రారంభమైనప్పటి నుండి వినబడు తుండేది. హైదరాబాద్ సంస్థానం విమోచన తర్వాత సమైక్య తెలుగు రాష్ట్రం ఏర్పాటుకు అవకాశాలు పెరిగాయి. 1949 లో అయ్యదేవర కాళేశ్వరరావు విశాలాంధ్ర మహాసభ ఏర్పాటు చేశారు. 1951 లో కూడా కాంగ్రెస్ అఖిల భారత సమావేశాలలో ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు విశాలాంధ్ర విషయాన్ని ప్రస్తావించారు.

ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన 58 రోజుల ఆమరణ దీక్షకు ముందు శ్రీరాములు ఐదు సార్లు నిరాహార దీక్షలు చేశారు. నెల్లూరులో దళితులకు ఆలయ ప్రవేశం, అస్పృశ్యత నివారణ మొదలైన వాటికోసం ప్రచారం, నిరాహార దీక్షలు చేసి విజయం సాధించారు.

ఈ నేపథ్యంలోనే శ్రీరాములు లక్ష్య సాధన కోసం ఆమరణ దీక్ష ప్రారంభించాలని నిర్ణయించారు.

"మద్రాసును కేంద్ర పాలిత ప్రాంతం చేయాలి" అని 1952 సెప్టెంబర్ 15వ తేదీన శ్రీరాములు నెల్లూరు నుంచి భాగవతుల లక్ష్మీ నారాయణకు ఒక లేఖ రాశారు. అందులో.. "ఆంధ్ర రాష్ట్ర సమస్య అనేక మందికి, అనేక పార్టీలకు, అనేక అభిప్రాయాలకు, అనేక భావాలకు అనేక రకాలుగా పుట్టిల్లు అయ్యింది. ప్రతి ఒక్కరి స్వార్థమూ వేర్వేరుగా ఉంది. ప్రత్యక్ష ఆర్థిక లాభాలున్నాయి. కాబట్టి అందరూ పరమార్థ దృష్టితో ఆలోచిస్తే తప్ప ఏకాభిప్రాయానికి రాలేరు. అధికారంలో ఉన్న మహా నాయకుల దృష్టి మార్చాలంటే సామాన్యం కాదు. ఇందుకు ఒక్కటే మార్గం కనబడుతోంది. నిష్కామ దృష్టితో, ద్వేష రహితంగా, నిశ్చింతగా ప్రాణాలర్పించటమే. ఇక ఈ సమస్యను ఉపేక్షించటం పాపమని నిన్నే (1952 సెప్టెంబర్ 14) అనిపించింది".

తర్వాత 15 రోజులకు భీమవరంలో స్వామి సీతారాంను శ్రీరాములు కలిసి, లక్ష్మీనారాయణకు రాసిన లేఖను, దానితోపాటు పంపించిన 'ఆంధ్ర రాష్ట్రం' అనే వ్యాసాన్ని చూపించారు. వాటిని పరిశీలించిన స్వామి సీతారాం అక్టోబర్ 2వ తేదీన శ్రీరాములుకు తన స్పందన తెలియజేస్తూ లేఖ రాశారు. దీక్ష చేయాలన్న శ్రీరాములు నిర్ణయాన్ని అభినందిస్తూనే.. "ప్రస్తుతానికి మద్రాసు నగర భవిష్యత్తును గూర్చి పట్టుబట్టడం ఉచితం కాదు" అని సూచించారు. కానీ, ఆయన సూచనను శ్రీరాములు అంగీకరించ లేదు. "మద్రాసు నగర భవిష్యత్తు నిర్ణయించే బాధ్యతను పండిట్ నెహ్రూకు అప్పగించటానికి వీలులేదు. మద్రాసు నగర పౌరులే ఆ నగరం భవిష్యత్తుని నిర్ణయించాలి. నా దీక్ష వలన మద్రాసు నగరంలోని తమిళ ప్రముఖుల్లో కొందరిలోనైనా హృదయ పరివర్తన ఏర్పడి.. మద్రాసు నగరాన్ని కేంద్ర పాలిత రాష్ట్రంగా ఏర్పరచడానికి వారు అంగీకరించగలరని నేను నమ్ముతున్నాను. ప్రజాభీష్టాన్ని అమలు జరపడమే పండిట్ నెహ్రూ వంతు" అని పేర్కొన్నారు.

1952 అక్టోబరు 19వ తేదీన తన దీక్ష ప్రారంభించడానికి ముందు పత్రికలకు శ్రీరాములు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో.. "మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం సాధించడానికి తీవ్రమైన కృషి జరగాలి" అని పేర్కొన్నారు.

దీక్షకు ఐదు రోజుల ముందు మద్రాసు పౌరులకు చేసిన విజ్ఞప్తిలో ఆయన ఇలా పేర్కొన్నారు..

"ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని తగినంత ప్రచారం, ఆందోళన, లెక్కల సేకరణ మొదలైనవి ఇప్పటికే జరిగాయి. 1916లోనే ఆంధ్రోద్యమ ప్రచారం ముమ్మరం కావటంతో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర స్థాపన సమస్య అందరి దృష్టినీ ఆకర్షించింది. దానివలన కలిగిన తక్షణ ఫలితం అనిబిసెంటు అధ్యక్షతన 1917 డిసెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘాన్ని ఏర్పాటు చేయడం. 'ఆ రాష్ట్ర కాంగ్రెసు సంఘం మదరాసు నగరం మీద తక్కిన మదరాసు రాష్ట్ర కాంగ్రెసు సంఘంతో సమానంగా హక్కు కలిగి ఉంటుంది' అని ఒక తీర్మానం కూడా ఆ సందర్భంగా ఆమోదించబడింది."

ఆయనదీక్షను చేపట్టాక...విరమించడానికి రెండు షరతులు పేర్కొన్నారు.

1) మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం ఏర్పడటం.
2) భారత ప్రభుత్వం రాజ్యాంగం లోని 3వ ఆర్టికల్ కింద ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించటం.

"పొట్టి శ్రీరాములు దీక్ష వెనుక లక్ష్యం గురించి ఆయన మేనల్లుడు ఎన్ఆర్ గుప్తా మాటల్లో.. "మద్రాసు ఉమ్మడి సొత్తుగా ఉండాలని ఆయన అనుకుంటూ వచ్చారు. మద్రాసు మన సొత్తు కావచ్చు. అయితే, వాళ్లు (తమిళులు) మనం చాలా కాలంగా కలసి ఉంటున్నాము. అలాంటప్పుడు మనల్ని వాళ్లు వెళ్లిపొమ్మంటే ఎంత కష్టపడతామో.. వాళ్లను మనం వెళ్లిపొమ్మన్నా అంత కష్టపడతారు. అందువల్ల ఉమ్మడిగా నగరం చేస్తే బాగుంటుందన్నారు."

"మరి నిర్వివాద ప్రాంతాలతో చాలామంది రాష్ట్రం కావాలంటున్నారు కదా! అంటే.. 'మనం మద్రాసు ఎందుకు వదులు కోవాలి? వేరేచోటకు వెళ్లి మట్టిలోను, ఇటుకల్లోను రూ. 15-20 కోట్లు ఎందుకు పోసు కోవాలి? ఇంత డబ్బు ఎందుకు వృధా చెయ్యాలి? త్వరగా రాష్ట్రం వస్తుందని ఉన్న హక్కు ఎవరైనా వదులు కుంటారా? అసలు ఆ మాటకు వస్తే మద్రాసుపై మనకు ఎక్కువ హక్కు ఉంది. ఇదంతా గుర్తించే ధార్ కమిటీ మద్రాసును ప్రత్యేక రాష్ట్రం చెయ్యాలని న్యాయంగా తీర్పు చెప్పింది. మన రాజధాని ఈ నగరంలో వద్దు అని అంతా అంటే నేను ఏమంటా? ఆంధ్ర రాష్ట్రపు రాజధాని వేరేచోట పెట్టుకోవచ్చు. అయితే, ఈ వ్యవహారాన్ని సామరస్యంతో పరిష్కరించుకోవాలి."

అయితే, మద్రాసు కోసం ఎందుకు ఉపవాసం చేయటం, విడిచి పెట్టవచ్చు కదా? అని తాను అడిగానని, అందుకు శ్రీరాములు స్పందిస్తూ.. "నేను చచ్చిపోవాలని చెయ్యడం లేదు. మనకు న్యాయమైన హక్కు ఉన్నదనటం కోసం చేస్తున్నాను. అదివస్తే సంతోషిస్తాను. రాకపోతే చచ్చిపోతాను. నేను పోతే దీన్ని సాధించటానికి ఎవరికైనా అవకాశం ఉండవచ్చు" అన్నారని గుప్తా తెలిపారు. (ఆంధ్ర పత్రిక: 18 డిసెంబర్ 1952)ప్రకాశం పంతులు మాటల్లో చెప్పాలంటే.. "ఉపవాసం చెయ్యడానికి ఎవ్వరూ స్థలం ఇవ్వకపోతే అట్టలు కట్టుకొని, వీధుల్లో తిరిగి ప్రాణాలైనా అర్పిస్తానన్న పట్టుదల గల మనిషి శ్రీరాములు". ఆయనకు ఆశ్రయం ఇచ్చేందుకు బులుసు సాంబమూర్తి ముందుకు వచ్చారు. పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19వ తేదీన బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ దీక్ష ప్రారంభించారు. 1952 అక్టోబర్ 19వ తేదీ నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు ఆమరణ నిరాహార దీక్ష చేశారు.

మద్రాసు లేకుండా ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డిసెంబర్ 19వ తేదీన లోక్‌సభలో ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు. ఈ మేరకు వాంఛూ కమిటీని ఏర్పాటు చేశారు. 1953 అక్టోబర్ 1వ తేదీన కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 2008 మే 22వ తేదీన నెల్లూరు జిల్లా పేరును శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

పిల్లల్లో సహితం ఎముకల
సంబంధ రుగ్మతలు

(19 అక్టోబర్ "ప్రపంచ పిల్లల ఎముకలు, కీళ్ల రుగ్మతల దినం" సందర్భంగా)



నేటి డిజిటల్ యుగంలో పిల్లలు, కౌమార యువతలో అతి సాధారణంగా మస్కులోస్కెలిటల్ అనారోగ్య సమస్యలు వేధిస్తున్నాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఎముకలు విరగడం, టెండినిటిస్, తుంటి అభివృద్ధి క్షీణత, మస్కులార్ డిస్ట్రోఫీ, ఆస్టియోపొరోసిస్ లాంటి రుగ్మతలు పిల్లల్లో కూడా కనిపించడం ఒక ప్రమాదకర హెచ్చరికగా తీసుకోవాలి. స్థూలకాయ సమస్యలు ఉన్న పిల్లల్లో ఈ రుగ్మతలు మరింత పెరగడం గమనించారు. ప్రతి వెయ్యిమంది పిల్లల్లో ఒక్కరికి ఎముకలు, కీళ్ల సమస్యలు ఉండటం గమనించారు. మస్తిలోస్కెలిటల్ సమస్యలతో బాధపడుతున్న పిల్లలకు జీవితకాల శాపంగా ఈ రుగ్మతలు మారుతున్నాయి. సరైన సమయంలో చికిత్స అందించని పక్షంలో జీవితాంతం వాటితో బలపంతపు సంసారం చేయాల్సి వస్తుంది.

వరల్డ్ పెడియాట్రిక్ బోన్ అండ్ జాయింట్ డే:

శిశువులు, పిల్లలు, టీనేజ్ యువత బోన్, జాయింట్ ఇన్ఫెక్షన్ సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ రుగ్మతలు ఉన్న వారిలో 52 శాతం ఆర్థరైటిస్, 44 శాతం ఆస్టిసోమైలిటిస్, 16 శాతం సూక్ష్మ జీవులతో సంక్రమించే సమస్యలు, 13 శాతం ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నట్లు తేలింది. జువెనైల్ ఇడియోపథిక్ ఆర్థరైటిస్ సమస్య పిల్లలను అధికంగా వేధిస్తోంది. ఈ సమస్యతో ఎముకలు, కీళ్ల అభివృద్ధి కుంటుపడుతున్నది. దీని వల్ల వాపులు, కంటి సమస్యలు కూడా రావడం జరగవచ్చు. ఇలాంటి ప్రమాదకర అనారోగ్య సమస్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏట 19 అక్టోబర్ రోజు "ప్రపంచ పిల్లల ఎముకలు, కీళ్ల దినం (వరల్డ్ పెడియాట్రిక్ బోన్ అండ్ జాయింట్ డే)" పాటించడం 2012 నుంచి ఆనవాయితీగా మారింది. ఈ దినోత్సవ వేదికగా "దృఢమైన ఎముకలతో ఉజ్వల భవిష్యత్తు (స్ట్రాంగ్ బోన్స్ స్ట్రాంగ్ ఫ్యూచర్) లాంటి ఇతివృత్తంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పిల్లల్లో ఎముకలు, కీళ్ల సంబంధిత రుగ్మతలను నివారించడానికి లేదా తగ్గించడానికి సరైన పోషకాహారం, ప్రతి రోజు శారీరక వ్యాయామం, కూల్ డ్రింక్స్ మానేయడం, ప్రోటీన్ ఆధారిత ఆహారాన్ని తీసుకోవడం, విటమిన్ డి, కెలను అదనంగా ఇవ్వడం, శరీర బరువును నియంత్రించడం లాంటి సరైన జీవనశైలి చర్యలను తీసుకోవాలి.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



సిద్దిపేట ప్రతినిధి, అక్టోబర్ 18, (సింగిడి): సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా తొగుట మండల వ్యాప్తంగా గ్రామల్లో తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ సంబరాలు తొమ్మిదో రోజు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. తెలంగాణ సాంస్కృతికప్రతీకగా నిలిచే ఈ బతుకమ్మ పండుగను 9 రోజుల పాటు కనుల పండుగగా జరుపుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అడపచులు తీరొక్క పూలతో అలంకరించి బతుకమ్మను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. గ్రామంల్లో చెరువుల వద్ద విద్యుత్తు దీపాలతో అలంకరించి సిద్ధం చేశారు ఆయా గ్రామా సర్పంచ్ లు ప్రజాప్రతినిధులు, ఆడపడుచులు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మగా పూజించి ఆడపడుచులంతా బతుకమ్మను ఊరేగింపుగా చెరువుల వద్దకు చేరుకొని బతుకమ్మ లను నిమజ్జనం చేశారు.



అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబురాలు



మూసకొండూర్,అక్టోబర్ 18(సింగిడి): మండలం లోని రంగపేట గ్రామం లో సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్ని అంటాయి. తొమ్మిది రోజుల పాటు సాగిన బతుకమ్మ ఉత్సవాల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.గ్రామ ఉత్సవాల్లో భాగంగా రంగపేట డా. బి.ఆర్ అంబేద్కర్ భవనం వద్ద బతుకమ్మ ఆట పాటల సందడి మిన్నంటింది. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో హాజరై, రంగురంగుల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలను ఒకచోట చేర్చి సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అంబేద్కర్ భవన ఆవరణంలో మహిళలు చప్పట్లు కొడుతూ, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సాగిన ఈ వేడుకలు గ్రామస్తుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపాయి. చీకటి పడేవరకు సాగిన ఈ ఆటపాటల అనంతరం, మహిళలు బతుకమ్మలను స్థానిక జలాశయంలో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.ఈ సంబురాల్లో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లి జ్ఞాపకార్థం ఏడేళ్లుగా భక్తులకు ఉచిత తాగునీరు

నిమ్మటూరి సాయికృష్ణ సేవలు అభినందనీయం

హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని



జమ్మికుంట, అక్టోబర్ 18 (సింగిడి): హుజురాబాద్ పట్టణానికి చెందిన నిమ్మటూరి సాయికృష్ణతల్లి రాజేశ్వరి జ్ఞాపకార్థం గత ఏడేళ్లుగా సద్దుల బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలు, భక్తులకు ఉచితంగా తాగునీరు అందిస్తూ తన తల్లిపై ఉన్న మమకారాన్ని చాటుకోవడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్‌రావు అన్నారు. హుజూరాబాద్‌లోని మారుతీనగర్ బతుకమ్మ ప్రాంగణంలో నిర్వహించిన సేవా కార్యక్రమానికి చైర్‌పర్సన్ సుహాసిని, మున్సిపల్ కమిషనర్ జి. కిషన్ హాజరై సాయికృష్ణను అభినందించారు. తల్లి జ్ఞాపకార్థం భక్తుల దాహార్తిని తీర్చడం గొప్ప మానవతా దృక్పథానికి నిదర్శనమని చైర్‌పర్సన్ పేర్కొన్నారు.తన తల్లి జ్ఞాపకాలను పదిలంగా నిలుపుకుంటూ, భక్తులకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తోందని సాయికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే మహిళా సంక్షేమానికి పెద్దపీట

సిద్ధిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అత్తు ఇమామ్



సిద్ధిపేట ప్రతినిధి, అక్టోబర్ 18, (సింగిడి): మహిళా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని మహిళల ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేటలో బతుకమ్మ పండుగ సందర్భంగా పట్టణంలోని 8,9,10 మున్సిపల్ వార్డుల్లో అందంగా బతుకమ్మలను పేర్చిన ఐదుగురు మహిళలకు పట్టుచీరలు మరో 50మంది మహిళలకు కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 10ఏళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో మహిళల సంక్షేమాన్ని గాలికి వదిలేసి ఆడబిడ్డలకు మొండిచేయి చూపించారని బిఆర్ఎస్ ప్రభుత్వంలో బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు పంపిణీ చేసిన చీరలు నాణ్యతలేకుండా ఉండేవని మహిళలను బిఆర్ఎస్ అవమానించిందని. ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే, మహిళల అభ్యున్నతి ఆర్థిక వ్యవస్థ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ మహిళ సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పథకాల అమలు చేస్తుందని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పించిందనీ, అర్హులైనా రూ. 500కే గ్యాస్ సిలిండర్ గృహజ్యోతి పథకం కింద నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా మహిళలకు ఆర్థికంగా ఊరట ఇచ్చిందనీ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు అత్తు ఇమామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్యాదారి మధు, గయాజుద్దీన్. అజ్మత్, విజయ డానియల్, నజ్జు ముద్దు రవితేజ, అజారుద్దీన్, కుమార్ సాయి, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో అర్చకుడు.. ఆపదలో ఆపన్నహస్తం

సేవలో ముందడుగు.. దేవర వినోద్

మంచిర్యాల, అక్టోబరు 18 (సింగిడి): ఉదయం ఆలయానికి వెళ్లి దేవుడి ముందు దీపం వెలిగిస్తారు.. భక్తుల కోసం పూజలు చేస్తారు. అదే చేతులు మధ్యాహ్నానికి ఆకలితో ఉన్నవారికి అన్నం పెడతాయి. చూపు కోల్పోయిన వారికి కంటి వెలుగు అందిస్తాయి. పెళ్లి చేయలేని పేద కుటుంబాల్లో కొత్త బంధాలకు బాటలు వేస్తాయి. ఆపదలో ఉన్నవారికి 'మేమున్నాం' అంటూ భరోసా ఇస్తాయి.దేవుడిని కొలవడం ఒక్కటే భక్తికాదు.. తోటి మనిషికి అండగా నిలవడమే నిజమైన మానవత్వం అనే భావనతో సేవా మార్గంలో సాగుతున్నారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం ఇందిరానగర్‌కు చెందిన పూజారి దేవర వినోద్. శ్రీ కనకదుర్గాదేవి, స్వయంభు శ్రీమహంకాళి ఆలయంలో అర్చకుడిగా విధులు నిర్వహిస్తూనే.. సామాజిక సేవను తన జీవితంలో భాగం చేసుకున్నారు. 'ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులు మిన్న' అనే మాటను ఆచరణలో పెట్టారు.

ఒక ఆలోచన.. ఓ యువసేన

పేదల కష్టాలను చూసిన ప్రతిసారీ ఏదో ఒకటి చేయాలనే ఆలోచన ఆయనలో బలపడింది. ఆ సంకల్పమే 2016లో 'దేవర వినోద్ యువసేన' ఏర్పాటుకు కారణమైంది. స్నేహితులతో కలిసి ప్రారంభించిన ఈ సేవా కార్యక్రమాలు క్రమంగా ఎన్నో కుటుంబాలకు చేరువయ్యాయి.

ఆకలికి అన్నం.. ఆపదకు అండ

కరోనా మహమ్మారి సమయంలో అందరూ ఇళ్లకే పరిమితమైన వేళ.. వలస కూలీలు, పేద కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఆ సమయంలో వినోద్ యువసేనతో కలిసి గ్రామాల్లో తిరిగారు. ఒకటి కాదు.. రెండు కాదు.. వరుసగా 64 రోజుల పాటు అన్నదానం, అంబలి, నిత్యావసర సరుకుల పంపిణీ చేపట్టారు.

ఆ రోజుల్లో అందించిన ఆ చిన్న సాయం.. ఆకలితో ఉన్న కుటుంబాలకు ఎంతో పెద్ద భరోసాగా మారింది.

113 కుటుంబాల్లో వెలుగులు

చూపు మందగించి వైద్యం చేయించుకోలేని పేదల కోసం కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. గోలేటి లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో 113 మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయించారు. చీకటిలో మగ్గుతున్న వారి జీవితాల్లో చూపు రూపంలో కొత్త వెలుగు నింపారు.

11 పేద కుటుంబాల్లో పెళ్లి సందడి

పేదరికం కారణంగా పెళ్లి చేయలేని కుటుంబాలకు కూడా వినోద్ అండగా నిలిచారు. తన సొంత ఖర్చులతో 11 పేద జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించారు. ఆ ఇళ్లలో పెళ్లి మేళతాళాలు మోగేలా



చేశారు. దుప్పట్లు, చీరలు, నిత్యావసర వస్తువుల పంపిణీతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించారు. రక్తదాన, వైద్య శిబిరాల ద్వారా మరెందరికో చేయూతనిచ్చారు.

సేవకు దక్కిన గౌరవం...

సామాజిక సేవలో ఆయన చేస్తున్న కృషిని గుర్తించిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ సంస్థ 'డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్' గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. పుదుచ్చేరిలోని



కంబన్ కలైయరంగం ఆడిటోరియంలో జరిగిన 'సామాజిక నాయకులు--దార్శనికుల సమ్మేళనం--2026'లో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కరోనా సమయంలో చేసిన సేవలకు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ అవార్డు, శ్రీజ్ఞాన సరస్వతి దేవి చారిటబుల్ ట్రస్టు నుంచి కొవిడ్-19 ఉత్తమ సేవా పురస్కారాన్ని కూడా అందుకున్నారు. లిపుట్ట నుండి బయటపడిన విగ్రహం.... కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం ఇందిరానగర్లో కొలువుదీరిన ఇద్దరు అమ్మ వార్ల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మలతో కొలువైన ఈ పుణ్యక్షేత్రం మహారాష్ట్రలోని చంద్రపూర్ ఆలయం తర్వాత ఇక్కడి దానికి ప్రత్యేకత ఉంది. కాగజ్ నగర్ మండలం బారెగూడకు చెందిన మోర్లె నారాయణ-లక్ష్మి దంపతుల కుమారుడు వినోద్.. ఆలయ ప్రధాన అర్చకుడిగా కొనసాగుతున్నారు. చిన్నవయసులో ఆయన నిద్రలో అమ్మవారు పాము రూపంలో కనిపించి పుట్టలో కొలువై ఉన్న తనను బయటకు తీయాలని చెప్పారట. చైత్ర పౌర్ణమి తర్వాత అమ్మవారి శిలా విగ్రహం బయటపడింది. అప్పటి నుంచి పూజలు ప్రారంభించారు. ఆలయం వెనుక గుహలో నిద్రిస్తున్నట్లు మహంకాళీ అమ్మవారు, గుడి ఆవరణలో మహంకాళీ విగ్రహం, నాగదేవత విగ్రహం, కాలభైరవస్వామి, అరుణాచల శివాలయం, శనీశ్వర విగ్రహాలను ఏర్పాటు చేశారు. 2015లో వినోద్ ఆధ్వర్యంలో ఆలయాన్ని నిర్మించి మహంకాళీ, శ్రీ కనకదుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు.



పెరుగుతున్న భక్తుల తాకిడి..

అమ్మవారి కృప, గ్రామ సహకారంతో స్థల ఆలయం చెందుతోంది. ప్రతి ఏటా ఆషాడ పౌర్ణమి అనంతరం భూగర్భం నుంచి సహజంగా నీరు ఊరుతుంది. భక్తులు ఆ నీటిని తీర్థం రూపంలో తీసుకుంటారు. దీంతో ఆరోగ్యం ఐశ్వర్యం, మనశ్శాంతి కలుగుతుందని భక్తులు నమ్మకం. అంతేగాక ఉగాది తర్వాత చైత్రమా సంలో జాతర నిర్వహిస్తున్నాం. అమ్మవారి కల్యాణం, బోనాలు, బలిదానం, ఊరేగింపు, పల్లకీ సేవ కార్యక్రమాలు ఉంటాయి. భక్తులు భారీగా తరలి వస్తున్నారు. బోనాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం వాటిని ప్రసాదంగా భక్తులకు అందిస్తారు. పిల్లలు లేని దంపతులు ప్రసాదం తీసుకున్న తర్వాత సంతాన భాగ్యం కలుగుతుందని నమ్మకం. నిత్యం అమ్మవార్ల దర్శనానికి కోసం సైతం రద్దీ నెలకొంటుంది.

సేవకు అంతం లేదు..

- దేవర వినోద్ స్వామి, అర్చకుడు

చిన్నప్పటి నుంచే నిరుపేదలకు ఏదో ఒక రూపంలో సేవ చేయాలనే కోరిక ఉండేది. ఆలయంలో దేవుడిని కొలుస్తూనే సమాజానికి సేవ చేయాలనుకున్నాను. గ్రామస్థులు, మిత్రుల సహకారంతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. ప్రస్తుతం రెబ్బెన బస్టాండ్‌లో అంబలి పంపిణీ కొనసాగిస్తున్నాం. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నదే నా లక్ష్యం' అని దేవర వినోద్ స్వామి చెబుతున్నారు.

జమ్మికుంటలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు!

రూ.25 లక్షల నిధులతో పాలకవర్గం భారీ ఏర్పాట్లు

పూల బతుకమ్మలతో కళకళలాడిన కాలేజీ మైదానం..

భారీ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసిన వేడుకలు





జమ్మికుంట, అక్టోబర్ 18 (సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు జమ్మికుంట పట్టణంలో అంబరాన్నంటాయి. తొమ్మిది రోజులపాటు ఆడపడుచుల ఆటపాటలు, పూల బతుకమ్మలతో సందడిగా సాగిన ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో రూ. 25 లక్షలతో చేపట్టిన ఏర్పాట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

విద్యుత్ కాంతులతో వెలిగిన కాలేజీ మైదానం

సద్దుల బతుకమ్మ వేడుకల కోసం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, స్వాగత తోరణాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సాయంత్రం వేళ విద్యుత్ దీపాల వెలుగులతో మైదానం దేదీప్యమానంగా మారింది. పండుగ వాతావరణం ఉట్టిపడేలా మున్సిపల్ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

పూల బతుకమ్మలతో మహిళల సందడి

జమ్మికుంట పట్టణం తోపాటు పరిసర ప్రాంతాల నుంచి మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను మైదానంలో ఏర్పాటు చేసి, వాటి చుట్టూ తిరుగుతూ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేసి, ఒకరికొకరు వాయనాలు ఇచ్చి పుచ్చుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

సద్దుల బతుకమ్మ వేడుకలకు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఆడపడుచులు ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకునేందుకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ , మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి తదితరులు పట్టణ ప్రజలకు, మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసుల భారీ బందోబస్తు

వేడుకలకు భారీ సంఖ్యలో మహిళలు, ప్రజలు తరలిరావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. సీఐ రామకృష్ణ గౌడ్ పర్యవేక్షణలో పట్టణ పోలీసులు, అదనపు బలగాలు బందోబస్తు నిర్వహించాయి. మైదానం పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టడంతో సద్దుల బతుకమ్మ వేడుకలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన మంత్రి పొన్నం ప్రభాకర్

సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని గౌరమ్మను ప్రార్థించాలనీ మహిళలను కోరిన మంత్రి పొన్నం ప్రభాకర్





సిద్ధిపేట ప్రతినిధి, అక్టోబర్ 18, (సింగిడి): హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్ట వద్ద సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మహిళలు, ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడుతూ పండుగ సంబరాల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ సందర్భంగా గౌరమ్మను పూజిస్తూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులందరూ పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలని అమ్మవారిని వేడుకోవాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ఆందోళన ఉందని, మన రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినప్పటికీ వ్యవసాయానికి అవసరమైన సమృద్ధి వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సంతోషంగా జీవించాలని గౌరమ్మను ప్రార్థించాలని సూచించారు.బతుకమ్మ ఆడుతూ, పాటలు పాడుతూ తమ కుటుంబ సభ్యుల శ్రేయస్సును కోరుకునే మహిళలు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాగుండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కూడా ప్రార్థించాలని అన్నారు.రంగురంగుల పూలతో ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. మహిళలు, ఆడపడుచులు అందరూ కలిసి ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ జంగపల్లి ఐలయ్య, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అధికారులు, మహిళలు, ఆడపడుచులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగ ఆడపడుచుల ఆత్మీయతకు, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుంది

- బతుకమ్మ సంబరాల్లో ఎదులాపురం నీరజ వెంకటేష్ కుటుంబ సందడి
- గోదావరిఖనిలో రాజ్‌ఠాగూర్ ఆధ్వర్యంలో ఘనంగా దసరా ఉత్సవాలు







గోదావరిఖని, అక్టోబరు 18 (సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు పొట్యాల గ్రామంలో ఉత్సాహంగా జరిగాయి. ఈ వేడుకల్లో పొట్యాల మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎదులాపురం నీరజ వెంకటేష్ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పండుగను జరుపుకున్నారు. కుటుంబ సభ్యుల సందడి, పూల బతుకమ్మల అందాలతో వేడుకలు సందడిగా సాగాయి.బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ, దసరా పండుగలకు ప్రాధాన్యమిస్తూ వేడుకలను నిర్వహిస్తోందన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాగూర్ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా పండుగలకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ నిరంతరం కృషి చేస్తున్నారని వెంకటేష్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని, రానున్న రోజుల్లో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. బతుకమ్మ, దసరా పండుగలు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తూ తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటుతున్నాయని తెలిపారు.

గంగుల నివాసంలో అంబరాన్ని అంటిన సద్దుల బతుకమ్మ వేడుకలు

కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ సంబరాలు, సంప్రదాయ పాటలతో సందడి



కరీంనగర్, అక్టోబర్18(సింగిడి): సద్దుల బతుకమ్మ వేడుకలు కరీంనగర్‌లో ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో కుటుంబ సభ్యులు ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ, పాటలు పాడుతూ చప్పట్లతో ఆటపాటలతో సందడి చేశారు. కుటుంబ సభ్యుల వేడుకలను గంగుల కమలాకర్ తిలకించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు ఆయన నివాసంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలలో గంగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహాగౌరీ అవతారంలో మహాశక్తి అమ్మవారి దర్శనం

మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రత్యేక పూజలు

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



కరీంనగర్, అక్టోబర్18(సింగిడి): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం శ్రీ మహాశక్తి ఆలయంలో గౌరీదేవి అమ్మవారు మహాగౌరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వారికి ఆశీర్వచనాలు అందించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ పాల్గొన్న ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు.



రాష్ట్రమంతా నీళ్లగోస ఉన్నా.. సిద్దిపేటలో మత్తడి దూకుతున్న కొమటి చెరువు

- కాలేశ్వరం నిర్మాణంతోనే సిద్దిపేటకు జలసిరులు
- బతుకమ్మ పండుగ తెలంగాణకే సొంతం
- మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచానికే చాటి చెబుతున్న తెలంగాణ ఆడబిడ్డలు
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు

సిద్దిపేట ప్రతినిధి, అక్టోబర్ 18, (సింగిడి): ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రమొత్తం నీళ్లు నీళ్లకరువు అనికరువుతో అలలాడిపోతుంటే సిద్దిపేట కోమటి చెరువు గోదావరి జలాలతో మత్తడి దూకుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. బతుకమ్మ వేడుకల సందర్భంగా ఆయన ఆదివారం కుటుంబ సమేతంగా కోమటి చెరువు మినీ ట్యాంక్ బండ్ ప్రాంతాల్లో కలియతిరిగి ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం



కావడంతోనే సిద్దిపేటకు స్వచ్ఛమైన గోదావరి జలాలు వచ్చాయని ఒకప్పుడు మురికి నీళ్లతో ఉండే చెరువు నేడు స్వచ్ఛమైన గోదావరి జలాలతో నిండుగా ఉందాన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ కే సొంతమని. తెలంగాణ బిడ్డలు మన సంస్కృతి సాంప్రదాయాలతో ప్రపంచవ్యాప్తంగా బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డగా ఈ బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. పూలను పూజించి ప్రకృతిని ప్రేమించే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజలదన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో తగ్గించాలన్నారు. సిద్దిపేట కోమటి చెరువు ను అన్ని విధాల అభివృద్ధి చేయడంతోనే ప్రజలందరూ ఆనందోత్సవాల మధ్య ఈ బతుకమ్మ వేడుకలు జరుపుకుంటున్నారన్నారు.



గాయత్రీనగర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



- పూల బతుకమ్మలతో మహిళల ఆటపాటలు, ఆనందోత్సాహాల మధ్య సంబరాలు

కరీంనగర్, అక్టోబర్ 18(సింగిడి): గాయత్రీ నగర్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల సంబరాల ముగింపు సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పూజలు చేశారు. అనంతరం సంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మల చుట్టూ ఉత్సాహంగా ఆడిపాడారు. కాలనీవాసులంతా కలిసి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు గూట్ల శంకర్, మోసర్ల రాంరెడ్డి, పూసాల సంపత్, భీమానాతుని శ్రీనివాస్, డాక్టర్ శివ, విజయ్, దండే లక్ష్మణ్, మల్కారెడ్డి, రాము, భాజపా నాయకుడు సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

- డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేష్



కరీంనగర్, అక్టోబర్18(సింగిడి): బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక అని డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేష్ అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగకు తెలంగాణ ప్రజల జీవన విధానంలో ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. బతుకమ్మ వేడుకలు మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు ప్రాంతీయ అస్తిత్వం, జానపద కళలు, సంప్రదాయాలను భావితరాలకు అందిస్తాయని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోనూ ఈ పండుగ సాంస్కృతిక ఐక్యతకు, ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని గుర్తుచేశారు. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పండుగ ప్రతి ఇంటా సుఖసంతోషాలు నింపాలని, మహిళలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడి భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రమేష్ పేర్కొన్నారు.

గ్రామ ప్రజలకు సర్పంచ్ కొత్త రాంరెడ్డి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు



మానకొండూర్, అక్టోబర్18(సింగిడి): తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని రంగపేట గ్రామ ప్రజలందరికీ సర్పంచ్ కొత్త రాంరెడ్డి-రజిత హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొమ్మిది రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే ఈ పూల పండుగ గ్రామ ప్రజల జీవితాల్లో సంతోషాన్ని నింపాలని ఆకాంక్షించారు. గ్రామంలోని మహిళలు, సోదరీమణులు అందరూ కలిసికట్టుగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రంగపేట గ్రామంలో అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని సర్పంచ్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

గట్టుదుద్దెనపల్లిలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు



మానకొండూర్, అక్టోబర్18 (సింగిడి) : మండల పరిధిలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబురాలు అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ కనకం సుజాత ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ మహిళలందరూ రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ఒకచోటికి చేరి ఆడపాపలంతా కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. గౌరమ్మను పూజిస్తూ, సాంప్రదాయక పాటలతో గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపారు. ఈ వేడుకల్లో పాల్గొన్న కనకం సుజాత మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని కొనియాడారు. గ్రామంలో మహిళలందరూ కలిసికట్టుగా ఈ సంబురాలను ఇంత ఘనంగా నిర్వహించడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో గ్రామ మహిళలు, యువతులు పాల్గొని సంబురాలను విజయవంతం చేశారు. చివరగా మహిళలు బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేసి, ఒకరికొకరు సద్దుల ప్రసాదాలను పంచుకున్నారు.

కిష్టాపూర్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

పేరూరు గ్రామానికి లింక్ రోడ్డు నిర్మించాలని వినతి

సానుకూలంగా స్పందించిన ఆవుల రాజిరెడ్డి

కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్



కొల్చారం, అక్టోబర్ 18 (సింగిడి): మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారితో పాటు పేరూరు గ్రామానికి వెళ్లే లింక్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేశం గౌడ్ నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డిని కోరారు. శనివారం కిష్టాపూర్ గ్రామానికి వచ్చిన ఆవుల రాజిరెడ్డిని గ్రామ కాంగ్రెస్ నాయకులతో కలిసి మల్లేశం గౌడ్ కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న రహదారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత పదేళ్లుగా కిష్టాపూర్ ప్రధాన రహదారి అభివృద్ధికి నోచుకోకపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గ్రామానికి చేరుకోవడానికి ఈ రహదారే ప్రధాన మార్గం కావడంతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కిష్టాపూర్ ప్రధాన రహదారిని రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేసి, గ్రామం నుంచి పేరూరు వెళ్లే లింక్ రోడ్డు నిర్మాణాన్ని కూడా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో నెలకొన్న ఇతర సమస్య లను వివరిస్తూ గ్రామ కాంగ్రెస్ నాయకుల సమక్షంలో వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆవుల రాజిరెడ్డి సానుకూలంగా స్పందించారు. కిష్టాపూర్ ప్రధాన రహదారి, పేరూరు లింక్ రోడ్డు నిర్మాణ సమస్యలను తన దృష్టిలో ఉంచుకున్నామని తెలిపారు. సంబంధిత అధికారులతో పాటు ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామితో మాట్లాడి రహదారుల నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఇతర సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ద శ్రీశైలం, వార్డు సభ్యులు పెద్దల కిషన్, తోష నవీన్, ఎంబరి మల్లేశం, కాంగ్రెస్ నాయకులు భాస్కర్, మల్కాప్రవీణ్, వెంకటేశం, ప్రభాకర్, కుమార్, పెద్ది నరేష్, గావ్ కాని పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

పూల సింగిడి.. బతుకమ్మ సందడి

మంచిర్యాల, అక్టోబరు 18 (సింగిడి): పూలను పేర్చి.. పూజలు చేసి.. పాటలు పాడుతూ.. కోలాటాలతో సందడి చేస్తూ.. ఆడపడుచులంతా ఒక్కచోట చేరి ఆనందాన్ని పంచుకునే పండుగ బతుకమ్మ. ప్రకృతిని ఆరాధిస్తూ.. పూలలో దేవతను కొలుస్తూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ పండుగ మంచిర్యాల జిల్లాలో ఘనంగా జరిగింది. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు పల్లెలు, పట్టణాలకు కొత్త శోభను తీసుకొచ్చాయి. మహిళల ఆటపాటలు, బతుకమ్మ పాటలతో పండుగ వాతావరణం నెలకొంది. బతుకమ్మ అంటే కేవలం పూల పండుగ మాత్రమే కాదు.. ఆడబిడ్డల ఆత్మీయతకు, కుటుంబ బంధాలకు, తెలంగాణ ఆచార వ్యవహారాలకు ప్రతీక. పుట్టింటికి చేరిన ఆడపడుచులు, అత్తవారింటి నుంచి వచ్చిన మహిళలు, చిన్నారులు, వృద్ధులు కలిసి బతుకమ్మను పేర్చడం నుంచి నిమజ్జనం వరకు ప్రతి ఘట్టాన్ని ఆనందంగా జరుపుకొన్నారు. తీరొక్క పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ సందడి చేశారు. కాలం మారినా.. జీవనశైలి మారినా.. బతుకమ్మ పండుగలోని ఆత్మీయత మాత్రం చెక్కుచెదరడం లేదు. పెద్దలు నేర్పిన పాటలను యువతులు ఆలపిస్తుండగా.. చిన్నారులు ఉత్సాహంగా ఆటల్లో పాల్గొన్నారు. పూలను సేకరించడం, బతుకమ్మను పేర్చడం, పండుగకు అవసరమైన ఏర్పాట్లు చేయడంలో మహిళలు పరస్పరం సహకరించుకున్నారు. దీంతో పండుగ కేవలం వేడుకగా కాకుండా.. కుటుంబాలను, ఇరుగుపొరుగు వారిని కలిపే ఆత్మీయ వేదికగా నిలిచింది.

తంగేడు, గునుగు తదితర స్థానిక పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశాయి. పూల అందాల మధ్య



అమ్మవారిని పూజించిన మహిళలు కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. పండుగ ముగిసిన తర్వాత కూడా బతుకమ్మ పాటలు, ఆడపడుచుల నవ్వులు, కలిసిమెలిసి గడిపిన క్షణాలు మధుర జ్ఞాపకాలుగా మిగిలాయి. పూలను పూజగా.. పాటలను పలకరింపుగా.. ఆత్మీయతను ఆభరణంగా మలిచే బతుకమ్మ పండుగ మంచిర్యాల జిల్లాలో తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని చాటిచెప్పింది.





కొత్తపల్లిలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



జమ్మికుంట, అక్టోబర్ 18 (సింగిడి) : జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జమ్మికుంట మున్సిపల్ పాలకవర్గం 25 లక్షల రూపాయల నిధులతో మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు ఘనంగా చేశారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగను మహిళలు తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహించుకున్నారు. చివరి రోజు సద్దుల బతుకమ్మ వేడుకలకు మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఏర్పాటు చేయగా మహిళలు భారీ ఎత్తున తరలివచ్చి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



మానకొండూర్, అక్టోబర్18(సింగిడి): పచ్చునూర్ గ్రామంలో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. గ్రామంలోని యాదవ నగర్, లక్ష్మీ నరసింహ స్వామి టెంపుల్, హనుమాన్ టెంపుల్, ఎల్లమ్మ టెంపుల్ పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన బతుకమ్మ వేడుకలను స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సందర్శించారు. వేడుకలను సందర్శించిన వారిలో సర్పంచ్ పారునాంది కేశవ్, ఉప సర్పంచ్ మూధగాని అనిల్ గౌడ్, వార్డు సభ్యులు పూసాల సతీష్, పిట్టల మల్లేశం, కోమల్ల నరేష్, కాల్వల రవి, తాళ్ల వెంకటేష్, నెలవేణి శంకర్ ఉన్నారు. వీరితో పాటు మాజీ వైస్ ఎంపీపీ గోపు మధుసూదన్ రెడ్డి, కూరాకుల పోషాలు యాదవ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సీతా నాగరాజు, ఎలుకపెల్లి రంజిత్, కల్వల ప్రవీణ్, గోపు మహిపాల్ రెడ్డి, కూరాకుల శ్రీనివాస్ యాదవ్, కసిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొని వేడుకలను తిలకించారు.

ఘనంగా ధీరవ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవం

కాపా, అక్టోబర్ 18(సింగిడి): కుషాయిగూడ డివిజన్ నాగార్జున నాగర్ కాలనీ మెయిన్ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ధీరవ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఘనంగా ప్రారంబిం చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మేడ్చల్ మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి, లతో కలిసి మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొని హాస్పిటల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్పిటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియ జేస్తూ, తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ నిర్వహకులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

వేడుకల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్న మేయర్ కొలగాని శ్రీనివాస్ దంపతులు

కరీంనగర్, అక్టోబర్18(సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా, ప్రకృతి ఆరాధనకు ప్రతిరూపంగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు కరీంనగర్ నగరంలో ఘనంగా జరిగాయి. నగరంలోని తీగలగుట్టపల్లిలో గల అమ్మవారి ఆలయం వద్ద నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ దంపతులు కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి, మహిళలతో కలిసి సంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మ ఆడి సందడి చేశారు. ఈ సందర్భంగా మేయర్ నగర ప్రజలకు సద్దుల బతుకమ్మ, విజయదశమి పండుగ శు భాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని గౌరమ్మను ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో స్థానిక మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకున్నారు.



కరీంనగర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, బతుకమ్మను తలపై ఎత్తుకొని మహిళల్లో ఉత్సాహం

కరీంనగర్, అక్టోబర్18(సింగిడి): నగరంలోని మార్క్‌ఫెడ్ మైదానంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బతుకమ్మను తలపై ఎత్తుకొని మహిళలతో కలిసి వేడుకల్లో సందడి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణతో పాటు దేశ, ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో



కరువు నుంచి విముక్తి కలగాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని గౌరమ్మను ప్రార్థించాలని కోరారు.పూలనే దేవతగా భావించి పూజించడం తెలంగాణ ప్రత్యేకత అని పేర్కొంటూ, ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగను పర్యావరణానికి హాని కలగకుండా జరుపుకోవాలని సూచించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. కరీంనగర్ జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేస్తామని మంత్రి తెలిపారు. ప్రజా సంక్షేమం, జిల్లా అభివృద్ధే లక్ష్యంగా సమిష్టిగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో మాజీ సూడా చైర్మన్ కోమిటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు ప్రాచీన విలువిద్య అకాడ





- సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆసంపల్లి శ్రీనివాస్
- 200 మంది క్రీడాకారులకు టీ షర్ట్స్ పంపిణీ

గోదావరిఖని, అక్టోబర్18 (సింగిడి) : ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడంతోపాటు ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడే ప్రాచీన యుద్ధకళ అకాడ అని పెద్దపెల్లి జిల్లా సైకిల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆసంపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో జై భారత్ హనుమాన్ అకాడ టీం 200 మంది క్రీడాకారులకు ఆసంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీ షర్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాసంపల్లిఆసంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... నేటి సమాజంలో బాలబాలికలు అందరు కూడా అకాడ విద్యలో శిక్షణ పొందాలని పిలుపునిచ్చారు. అకాడ విద్యలో శిక్షణ పొందే వారికి తన సహకారం ఉంటుందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకోనీ ప్రతి పాఠశాలలో ప్రాచీన యుద్ధ కళలను ప్రోత్సహిస్తూ శిక్షణ ఇప్పించాలని శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రాచీన యుద్ధకళల శిక్షణ కార్యక్రమాలకు మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ సహకారం ఉంటుందని తెలిపారు. గడిచిన నాలుగు దశాబ్దాలుగా జై భారత్ హనుమాన్ అకాడ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక అకాడ ప్రదర్శన నిర్వహిస్తారు. అకాడ మాస్టర్ మచ్చ శంకర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మచ్చ విశ్వాస్, నాతరి ఆదిత్య, పల్లె ప్రశాంత్, నంబయ్య తో పాటు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

వంటింటి ఔషధం..

నోట్లో వేసుకుంటే?



పుదీనా మన వంటగదిలో సులభంగా దొరికే సుగంధ మూలిక. ఇది ఆహారానికి ప్రత్యేక రుచిని, సువాసనను అందించడమే కాకుండా ఆరోగ్యానికి కూడా అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం, ఒత్తిడి, తక్కువ శారీరక శ్రమ వంటి కారణాలతో గ్యాస్, అజీర్ణం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో సమతుల్య ఆహారంలో భాగంగా పుదీనాను చేర్చుకోవడం కొంత ఉపశమనాన్ని అందించవచ్చు. అయితే ఇది ఏ వ్యాధికీ ప్రత్యక్ష ఔషధం కాదని గుర్తుంచుకోవాలి. పుదీనాలో ఉండే మెంథాల్ వంటి సహజ సమ్మేళనాలు జీర్ణవ్యవస్థ కండరాలను సడలించడంలో సహాయపడతాయి. దీంతో కొంతమందిలో కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. భోజనం తర్వాత వేడి పుదీనా టీ లేదా పుదీనా నీటిని తీసుకోవడం జీర్ణక్రియకు ఉపయోగపడుతుంది.

ఎసిడిటీ ఉంటే కాస్త జాగ్రత్త

పుదీనా కొందరిలో కడుపు అసౌకర్యాన్ని తగ్గించవచ్చు. అయితే GERD (గ్యాస్ట్రోఎసోఫేజియల్ రిఫ్లక్స్) లేదా తీవ్రమైన యాసిడ్ రిఫ్లక్స్ సమస్య ఉన్నవారిలో గుండెల్లో మంటను పెంచే అవకాశం కూడా ఉంది. అందువల్ల అలాంటి వారు వైద్యుల సలహాతోనే పుదీనాను తీసుకోవాలి.

నోటి దుర్వాసనకు ఉపశమనం



పుదీనాలోని సహజ యాంటీబ్యాక్టీరియల్ గుణాలు నోటిలో దుర్వాసనకు కారణమయ్యే కొన్ని సూక్ష్మజీవుల పెరుగుదలను తగ్గించడంలో సహాయపడతాయి. భోజనం అనంతరం కొన్ని తాజా పుదీనా ఆకులను నమలడం లేదా పుదీనా మౌత్ రిన్స్ ఉపయోగించడం వల్ల నోరు తాజాగా ఉంటుంది.



రోగనిరోధక శక్తికి మద్దతు

పుదీనాలో విటమిన్-ఎ, విటమిన్ జ, ఐరన్, మాంగనీస్ వంటి పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీర కణాలను ఆక్సీకరణ ఒత్తిడి నుంచి రక్షించడంలో సహాయపడతాయి. క్రమం తప్పకుండా సమతుల్య ఆహారంలో భాగంగా పుదీనాను చేర్చుకోవడం రోగనిరోధక శక్తికి మద్దతునిస్తుంది.

చర్మ ఆరోగ్యానికి ఉపయోగకరం

పుదీనాలోని శోథ నిరోధక గుణాలు మొటిమలు, చిన్నపాటి చర్మ వాపులు, అధిక నూనె ఉత్పత్తిని నియంత్రించడంలో కొంతవరకు సహాయపడవచ్చు. కొంతమంది పుదీనా పేస్ట్ లేదా ఫేస్ ప్యాక్‌లను ఉపయోగిస్తారు. అయితే సున్నితమైన చర్మం ఉన్నవారు ముందుగా చిన్న ప్రాంతంలో పరీక్షించి ఉపయోగించడం మంచిది.

బరువు నియంత్రణలో పరోక్ష సహాయం

పుదీనా నేరుగా బరువు తగ్గించదు. కానీ జీర్ణక్రియను మెరుగుపరచడం, చక్కెర పానీయాలకు బదులుగా పుదీనా నీటిని తీసుకునే అలవాటు ఏర్పడితే మొత్తం కేలరీల వినియోగం తగ్గే అవకాశం ఉంటుంది. దీంతో బరువు నియంత్రణకు పరోక్షంగా సహాయపడుతుంది.





పుదీనాను ఎలా తీసుకోవాలి?

- ఉదయం 5-6 పుదీనా ఆకులను గోరువెచ్చని నీటిలో వేసి తాగవచ్చు.
- పుదీనా-అల్లం హెర్బల్ టీ తయారు చేసుకుని తాగవచ్చు.
- చట్నీలు, సలాడ్లు, శాండ్‌విచ్‌లు, సూప్‌లలో కలిపి తీసుకోవచ్చు.
- నిమ్మరసంతో కలిపి పుదీనా నీరు తయారు చేసుకోవచ్చు.
- మజ్జిగలో పుదీనా, జీలకర్ర పొడి కలిపి తాగితే జీర్ణక్రియకు తోడ్పడుతుంది.
- తీసుకునే ముందు గుర్తుంచుకోవాల్సిన విషయాలు
- పుదీనాను అధికంగా తీసుకోవడం అందరికీ అనుకూలం కాదు.

- తీవ్రమైన యాసిడ్ రిఫ్లక్స్, కడుపు పూతలు లేదా దీర్ఘకాలిక జీర్ణ సమస్యలు ఉన్నవారు వైద్యుడిని సంప్రదించాలి.
- గర్భిణీలు లేదా కొన్ని మందులు వాడుతున్నవారు క్రమం తప్పకుండా అధిక పరిమాణంలో పుదీనా తీసుకునే ముందు వైద్య సలహా తీసుకోవాలి.
- గ్యాస్, కడుపు నొప్పి, రక్తపు మలం లేదా నిరంతర అజీర్ణం వంటి లక్షణాలు ఉంటే కేవలం ఇంటి చిట్కాలపై ఆధారపడకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరం



29 నుంచి మణిపాల్ హెల్త్ రూ.9275 కోట్ల ఐపీఓ

దిల్లీ: ప్రముఖ హాస్పిటల్ చైన్ మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఇష్యూకు సిద్ధమైంది. మార్కెట్ నుంచి రూ.9,275 కోట్లు సమీకరించే లక్ష్యంతో జులై 29 నుంచి సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.560-590గా నిర్ణయించింది. రూ.77,600 కోట్ల మార్కెట్ విలువతో ఐపీఓకు వస్తోంది. ఫ్రెష్ ఇష్యూ, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో నిధుల సమీకరణ చేపట్టనుంది.

ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ. 8000 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కంపెనీ జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ రూపంలో 2.16 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయించనున్నారు. ప్రమోటర్లు అయిన ఇంపీరియస్ హెల్త్‌కేర్ ఇన్వెస్ట్‌మెంట్స్, మణిపాల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ గ్రూప్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు టీపీజీ ఎన్‌జీ మ్యాగజైన్, సెవెంటీ సెకండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, అమ్మర్ ఎన్‌డీఎన్ బీహెచ్‌డీ, నోవో హోల్డింగ్స్ ఇన్వెస్ట్ ఆసియా, ఫోనిక్స్ బేర్ ఇన్వెస్ట్‌మెంట్స్ తమ వాటాలు విక్రయించనున్నాయి.

ఐపీఓ నిధులు వీటికే

ఫ్రెష్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ. 5,378 కోట్లను అనుబంధ సంస్థ మణిపాల్ హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రుణాలు తిరిగి/ముందస్తు చెల్లింపులకు వినియోగించనున్నారు. మరో అనుబంధ సంస్థ సహ్యాద్రి హాస్పిటల్స్‌లో మైనారిటీ వాటాల కొనుగోలుకు రూ. 574



కోట్లు వెచ్చించనున్నారు. మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నారు. జులై 28న యాంకర్ ఇన్వెస్టర్లకు బిడ్డింగ్ తెరుచుకోనుంది. జులై 31న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. క్యూఐబీలకు 75 శాతం, నాన్‌ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు 15 శాతం, రిటైల్ ఇన్వెస్టర్లకు 10 శాతం షేర్లను రిజర్వ్ చేశారు. ఉద్యోగులకు రూ. 15 కోట్ల విలువైన షేర్లను కేటాయించారు. ఒక్కో షేరుపై రూ. 56 డిస్కౌంట్ అందిస్తున్నారు. ఇన్వెస్టర్లు కనీసం 25 ఈక్విటీ షేర్లకు బిడ్లు దాఖలు చేయాలి.

దేశవ్యాప్తంగా హాస్పిటల్స్

మణిపాల్ హెల్త్ సంస్థకు దేశవ్యాప్తంగా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఉన్నాయి. 2025 సెప్టెంబర్ 30 నాటికి దేశవ్యాప్తంగా 38 హాస్పిటల్స్ (ప్రొఫార్మా బేసిస్‌లో 48) కలిగి ఉంది. 10,761 లైసెన్స్‌డ్ బెడ్లు నిర్వహిస్తోంది. 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సేవలందిస్తోంది. 2025 నవంబర్‌లో 49వ హాస్పిటల్‌ను బెంగళూరులో ప్రారంభించింది. 2025 సెప్టెంబర్ 30 నాటికి తొలి ఆరు నెలల్లో రూ. 4,713 కోట్ల ఆదాయాన్ని, రూ. 571.8 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఆగస్టు 5న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో షేర్లు లిస్ట్ కానున్నాయి. ప్రస్తుతం గ్రే మార్కెట్‌లో 4 శాతం ప్రీమియం పలుకుతోంది.

వృద్ధి భయాలు.. ఐదో రోజూ నష్టాల్లో సూచీలు



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల నష్టాల పరంపర కొనసాగుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలతో పెరిగిన చమురు ధరల కారణంగా ద్రవ్యోల్బణం భయాలు నెలకొన్నాయి. వృద్ధికి విఘాతం కలుగుతుందన్న ఆందోళనలు దీనికి తోడయ్యాయి. దీంతో వరుసగా ఐదో రోజూ సూచీలు నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా నిఫ్టీ ఆటో, రియాల్టీ, ఫార్మా స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. నిఫ్టీ 23,800 దిగువకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 75,708.19 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,391.39) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 75,474.43 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 331.62 పాయింట్ల నష్టంతో 76,059.77 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 102.15 పాయింట్ల నష్టంతో 23,767.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.57గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, ట్రెంట్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 97.68 డాలర్ల వద్ద ఉండగా.. బంగారం ఔన్సు 4059 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

హోండా ధమాకా.. ఒకేసారి 10 మోడళ్ల ఆవిష్కరణ

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా తన టూవీలర్ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. దేశీయ మార్కెట్‌లోకి కొత్తగా 10 మోడళ్లను ఆవిష్కరించింది. ఇందులో ఏడు పూర్తిగా కొత్తవి కాగా.. మూడు మోడళ్లను అప్‌డేట్ చేసింది. స్కూటర్లు, రోడ్‌స్టర్, క్రూయిజర్, అడ్వెంచర్ విభాగానికి చెందిన టూవీలర్లు ఇందులో ఉన్నాయి. ICE, ఎలక్ట్రిక్ స్కూటర్లు, ఫ్లెక్స్ ఫ్యూయల్ ఆప్షన్‌తో లభించనున్నాయి. దేశీయ వాహనదారుల అవసరాలకు అనుగుణంగా స్థానికంగా వీటిని తయారుచేయనున్నట్లు కంపెనీ తెలిపింది. వీటిని దశలవారీగా మార్కెట్‌లోకి విడుదల చేయనుంది. ధర, మార్కెట్‌లో అందుబాటు వంటి వివరాలు ఆయా మోడళ్లను లాంచ్ చేసినప్పుడు కంపెనీ వెల్లడించనుంది.



విమానయాన సేవల్లోకి అదానీ గ్రూప్.. స్పష్టతనిచ్చిన సంస్థ

హోండా ADV160: హోండా తీసుకొస్తున్న అడ్వెంచర్ స్కూటర్ ఇది. 160 సీసీ లిక్విడ్-కూల్డ్ ఇంజిన్‌తో రానుంది. జు85 ఇథనాల్ ఫ్యూయెల్‌కు సపోర్ట్ చేస్తుంది. 8.1 లీటర్ల ఫ్యూయెల్ ట్యాంక్, 27 లీటర్ల అండర్-సీట్ స్టోరేజ్ కలిగి ఉంటుంది.

హోండా CB500: సీబీ 350 రేంజ్‌లో 501 సీసీ వేరియంట్‌లో సింగిల్-సిలిండర్, ఎయిర్-కూల్డ్ ఇంజిన్‌తో రానున్న రెట్రో రోడ్‌స్టర్ బైక్ ఇది. రెట్రో లుక్, మంచి రైడింగ్ అనుభవం కోరుకునే వారి కోసం ఈ బైక్‌ను తీసుకురానుంది.

హోండా రెబెల్ 300: 286సీసీ లిక్విడ్-కూల్డ్ ఇంజిన్‌తో రానున్న ఎంట్రీ-లెవల్ క్రూయిజర్ బైక్ ఇది. స్టాండర్డ్, ఇ-క్లచ్ వేరియంట్లలో లభ్యమవుతుంది.

రెబల్ 500: 471cc పారలల్-ట్విన్ ఇంజిన్‌తో దేశీయ మార్కెట్‌లోకి మరోసారి ఎంట్రీ ఇస్తున్న మోడల్ ఇది. గతంలో పరిమిత సంఖ్యలో హోండా వీటిని విక్రయించింది. ఇది కూడా స్టాండర్డ్, ఇ-క్లచ్ వేరియంట్లలో లభ్యం కానుంది.

హోండా XR300L: హోండా నుంచి వస్తున్న ఆన్-రోడ్, ఆఫ్-రోడ్ బైక్. 293.5 సీసీ కెపాసిటీతో రానుంది.

XR300 ర్యాలీ: దూరపు ప్రయాణాల కోసం టూరింగ్, అడ్వెంచరస్ బైక్. గ్లోబల్‌గా విక్రయిస్తున్న ర్యాలీ బ్రాండ్ డిజైన్‌తో ఈ బైక్‌ను తీసుకురానున్నారు.

హోండా QC3 ఈవీ: హోండా తన ఈవీ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరిస్తోంది. 3 ఎఐపీ బ్యాటరీ సామర్థ్యంతో ఒక్కసారి ఛార్జ్ చేస్తే 151 కిలోమీటర్ల రేంజ్ ప్రయాణిస్తుంది. 2.40 గంటల్లో 0-80 శాతం ఛార్జ్ అవుతుంది. 5 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే, స్మార్ట్ కీ వంటి ఫీచర్లు ఉన్నాయి.

ఏమిటీ ఇ-క్లచ్ టెక్నాలజీ: హోండా కొత్తగా ఇ-క్లచ్ లీవర్ టెక్నాలజీని పరిచయం చేస్తోంది. ట్రాఫిక్‌లో వాహనాన్ని నడపడం సులభతరం చేయడం కోసం క్లచ్ లీవర్‌ను ఉపయోగించకుండానే గేర్లు మార్చే సదుపాయం తీసుకొస్తోంది. ఈ సిస్టమ్ ఆటోమేటిక్‌గా క్లచ్ ఆపరేషన్స్‌ను నిర్వహిస్తుంది. మాన్యువల్‌గా ఆపరేట్ చేసే అవసరం ఉండదన్నమాట.

విమానయాన సేవల్లోకి అదానీ గ్రూప్..

స్పష్టతనిచ్చిన సంస్థ



దిల్లీ: గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ కొత్తగా విమానయాన సేవల్లోకి ప్రవేశించేందుకు సన్నాహాలు చేస్తోందని వార్తలు వస్తున్నాయి. వీటిపై ఆ సంస్థ క్లారిటీ ఇచ్చింది. ఆ కథనాలు, మార్కెట్ ఊహాగానాలు నిరాధారమైనవని, అవాస్తవమని అదానీ గ్రూప్ ప్రకటించింది. విమానయాన రంగంలోకి ప్రవేశించడానికి అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఏ ప్రతిపాదననూ పరిశీలించడం లేదని స్పష్టతనిచ్చింది.



ముంబయి, దిల్లీ వంటి అత్యధిక రద్దీ ఉండే విమానాశ్రయాలను నిర్వహిస్తున్న కంపెనీలు, షెడ్యూల్డ్ విమానయాన సంస్థలో 10 శాతానికి పైగా వాటా కలిగి ఉండకూడదనే నిబంధనను సవరించాలని ప్రభుత్వాన్ని 'అదానీ గ్రూప్' కోరిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మరోవైపు ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమానికి మద్దతుగా భారత వైమానిక దళం (ఐఏఎఫ్) కోసం.. తదుపరి తరం ఏరియల్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ (AEW&C-MKII) వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్.. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (DRDO)ఓ ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ నేపథ్యంలోనే అదానీ గ్రూప్ విమానయాన రంగంలోకి ఎంట్రీ ఇవ్వనున్నట్లు ఊహాగానాలు వచ్చాయి

బతుకమ్మ పండుగకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద బతుకమ్మ ఏర్పాట్లు, సుందరీకరణ పనుల పరిశీలన

హుస్నాబాద్ (సింగిడి): బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. శనివారం హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద బతుకమ్మ పండుగ ఏర్పాట్లు, చెరువు సుందరీకరణ పనులు, చెరువు కట్టపై నూతనంగా నిర్మిస్తున్న మైసమ్మ ఆలయ పనులను పరిశీలించారు. బతుకమ్మ ఘాట్ మెట్ల వద్దే కాకుండా చెరువు వైపు ఇతర ప్రాంతాల్లో అవసరమైన చోట్ల బారికేడ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలు, కుటుంబ సభ్యులు ప్రశాంతంగా, సంతోషంగా పండుగ జరుపుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆరేపల్లి చెరువు వద్ద కూడా బతుకమ్మ వేడుకల కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని, గ్లాస్ బ్రిడ్జి, కప్పగుట్ట పర్యాటక అభివృద్ధి, అర్బన్ ఫారెస్ట్ పార్కు ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఎల్లమ్మ చెరువుతో పాటు కొత్త చెరువు, పల్లె చెరువులను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. హుస్నాబాద్‌ను క్రీడారంగంలో అభివృద్ధి చేసేందుకు కబడ్డీ అకాడమీని మంజూరు చేశామని, స్విమ్మింగ్ పూల్‌కు సంబంధించిన ఉత్తర్వులు త్వరలో రానున్నాయని తెలిపారు. హుస్నాబాద్‌లో స్టేడియం ఏర్పాటు చేయాల్సి ఉందని, నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. మల్లెచెట్టు చౌరస్తా నుంచి రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నామని, కొత్తపల్లి--హుస్నాబాద్, హుస్నాబాద్--





జనగామ మధ్య నాలుగు వరుసల రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యారంగంలో కోహెడలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణం జరుగుతోందని, శాతవాహన విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. చిగురుమామిడిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఎల్కతుర్తిలో ఐఐఐటీ శాఖ, వంగరలో నవోదయ పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, సైదాపూర్‌కు మరో పబ్లిక్ స్కూల్ మంజూరు కానుందని, అక్కన్నపేటలో పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో 250 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, అక్కన్నపేట, ఎల్కతుర్తి మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు మంజూరయ్యాయని, ఆర్డీవో కార్యాలయానికి సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేస్తున్నామని చెప్పారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని, కాలువలకు సంబంధించిన భూసేకరణ కొనసాగుతోందని, భూసేకరణ పూర్తయిన వెంటనే కాలువల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఎంఎంఆర్ ప్యాకేజీ కింద కూడా పనులు ప్రారంభమవుతాయని, సాగునీటికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని, పంట పూర్తయ్యే వరకు రాత్రి వేళల్లో కూడా విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుత నీటి నిల్వలను వచ్చే వేసవిలో తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉన్నందున ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు పంటలు సాగు చేయాలని, ఈ సీజన్‌లో పరి సాగును వాయిదా వేసే అంశాన్ని పరిశీలించాలని రైతులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావం, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, ఈ అంశాలపై మంత్రివర్గ సమావేశంలో కూడా చర్చించినట్లు తెలిపారు. ఈ సమయంలో రాజకీయాలకు అతీతంగా రైతులకు అండగా నిలవాలని అన్ని వర్గాలకు విజ్ఞప్తి చేశారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న' కార్యక్రమంతో పాటు పల్లెల్లో ప్రజా పాలన ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్నామని, సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచుకోవాలని ప్రజలకు సూచిస్తున్నామని తెలిపారు. గత పదేళ్లలో ఎన్ని రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇచ్చారో ప్రజలకు తెలుసునని, ప్రస్తుత ప్రభుత్వం హుస్నాబాద్ నియోజకవర్గంలో ఒక్క ఏడాదిలోనే 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, హుస్నాబాద్ పట్టణానికి 500 ఇళ్లు కేటాయించామని పేర్కొన్నారు. గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ నిష్పక్షపాతంగా ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు ఎక్కడ ఆక్రమణకు గురైనా సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, ఆక్రమణలపై ప్రజలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా ప్రజల సమస్యలను విజ్ఞాపనల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని పర్యాటకం, విద్య, వైద్యం, రహదారులు, సాగునీరు, క్రీడలు తదితర అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులందరూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, ఆర్డీవో రామ్మూర్తి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాల్య తండాలో ప్రతి వార్డులో

వీధిలైట్ల ఏర్పాటు

గ్రామ అభివృద్ధికి సర్పంచ్ నాగ నాయక్ ప్రత్యేక చొరవ



డోర్నకల్/మరిపెడ (సింగిడి): మరిపెడ మండలంలోని వాల్య తండా గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ నాగ నాయక్ ఆధ్వర్యంలో ప్రతి వార్డులో వీధిలైట్లను ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రజలకు రాత్రి వేళల్లో మెరుగైన వెలుతురు అందించడంతో పాటు, రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా వీధిలైట్ల ఏర్పాటు చేపట్టారు. గ్రామంలోని అన్ని వార్డుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా సర్పంచ్ నాగ నాయక్ చర్యలు తీసుకుంటున్నారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రతి వార్డులో వీధిలైట్ల ఏర్పాటు పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు గ్రామపంచాయతీ కృషి చేస్తోంది.



బతుకమ్మ వేడుకల్లో కులవివక్షపై చర్యలు తీసుకోవాలి

టి.రేపాక ఘటనపై సమగ్ర విచారణ జరపాలి..

తెలంగాణ అంబేద్కర్ సంఘం డిమాండ్

భీమదేవరపల్లి (సింగిడి): తెలంగాణ సంస్కృతి, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకల్లో దళిత మహిళల పట్ల కులవివక్షకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం డిమాండ్ చేసింది. కొత్తకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ మాట్లాడుతూ.. యాదాద్రి భువనగిరి జిల్లా టి.రేపాక గ్రామంలో జరిగిన ఘటనపై నిజనిర్ధారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కులవివక్షకు తావులేని సమాజ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిజమని తేలితే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని అన్నారు. భారత రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించిన విషయాన్ని గుర్తుచేస్తూ, పండుగలు ప్రజలను ఐక్యం చేయాలే తప్ప కులాల పేరుతో విభజించకూడదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొండూరి ఎల్లయ్య, బహుజన్ రాష్ట్ర కార్యదర్శి కండె సుధాకర్, కట్కూర్ సర్పంచ్ ముంజ బాలరాజు, బత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలి: టీ ఏ

బల్మూరు, (సింగిడి): బల్మూర్ మండలంలోని గట్టు తుమ్మెన్ గ్రామంలో వి. బి– జి రామ్ జి పథకం ద్వారా చేపట్టిన ప్లాంటేషన్ పనులను టెక్నికల్ అసిస్టెంట్ మహేందర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను క్రమపద్ధతిలో సవరించాలని కూలీలకు సూచించారు. నాటిన ప్రతి మొక్క రక్షణ కోసం చెట్టు చుట్టూ తప్పనిసరిగా కంప ఏర్పాటు చేయాలని అధికారుల ఆదేశాల మేరకు స్పష్టం చేశారు.



వసూళ్ల వెనుక నాయకురాలు ఎవరు?

అంగన్వాడీ టీచర్ల నుంచి డబ్బుల సేకరణపై మరోసారి చర్చ

రూ.3 వేల వసూళ్ల ప్రచారంపై విజిలెన్స్ విచారణ ఏదీ?

జిల్లా ఉన్నతాధికారుల స్పందన కోసం ఎదురుచూపులు

మెట్‌పల్లి, (సింగిడి): మెట్‌పల్లి ఐసీడీఎస్ ప్రాజె క్టు పరిధిలో పండుగ కానుకల పేరుతో అంగన్వాడీ టీచర్ల నుంచి డబ్బులు సేకరిస్తున్నారనే ప్రచారంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఒక్కో టీచర్ నుంచి రూ. 3 వేల వరకు వసూలు చేస్తున్నారనే సమాచారం వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారంలోకి రావడంతో ఈ వ్యవహారంపై చర్చ కొనసాగుతోంది. అయితే, డబ్బుల సేకరణ జరిగినట్లు, దాని వెనుక ఎవరున్నారనే విషయం అధికారికంగా నిర్ధారణ కాలేదు.

నాయకురాలి పాత్రపై ప్రశ్నలు!

ఈ ప్రచారం వెనుక ఎవరైనా నాయకురాలు ఉన్నారా? డబ్బులు సేకరించాలంటూ ఎవరి నుంచైనా సూచనలు వచ్చాయా? సిబ్బందిపై ఒత్తిడి తెచ్చారా? అనే ప్రశ్నలు చర్చకు వస్తున్నాయి. ప్రచారంలో ఉన్న పోస్టర్ ప్రామాణికత, డబ్బుల సేకరణకు సంబంధించిన ఆధారాలను పరిశీలిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఆధారాలు



లేకుండా ఎవరి పేరునూ ప్రస్తావించడం సముచితం కాదు.

విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తారా?

ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, అవసరమైతే విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలని పట్టణంలో చర్చ జరుగుతోంది. సిబ్బంది నుంచి వివరాలు సేకరించి, డబ్బుల సేకరణకు సంబంధించిన సందేశాలు, పోస్టర్లు, ఇతర ఆధారాలను పరిశీలించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ప్రచారం నిరాధారమైతే ఆ విషయాన్ని కూడా స్పష్టం చేయాలని కోరుతున్నారు.

అధికారుల స్పందన ఏదీ?

అంగన్వాడీ సిబ్బందికి సంబంధించిన ఈ ప్రచారంపై సంబంధిత శాఖ అధికారులు ఇప్పటివరకు ఏదైనా అధికారిక వివరణ ఇచ్చారా? విచారణకు చర్యలు తీసుకున్నారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అధికారుల స్పందన, విచారణ వివరాలు అందుబాటులోకి వస్తేనే ప్రచారంలో ఉన్న సందేహాలకు సమాధానం లభిస్తుంది. వసూళ్ల ప్రచారంలో వాస్తవమెంత? బాధ్యులెవరు? జిల్లా ఉన్నతాధికారులు విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తారా? అన్నది వేచి చూడాలి.

మదర్సా పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి...



ఆర్మూర్, (సింగిడి): ఆర్మూర్ నియోజకవర్గం సందిపేట మండల కేంద్రమైన రాజ్ నగర్ దుబ్బు లోని మదర్సా గొడవ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. మదర్సా పేరు చెప్పి అక్రమంగా విరాళాలు వసూలు చేస్తున్న మౌలానా పై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేసినందుకు, ఫిర్యాదుదారులపై గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్లో బెదిరింపులకు దిగుతున్నారని, చంపేస్తామని బెదిరిస్తున్నారని, ప్రాణహాని ఉందని బాధితులు శనివారం మళ్లీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రాజ్ నగర్ దుబ్బు రెహమానియా మజీద్ పక్కన గల పైజాన్ ఇసలీం ఫాతిమా మదర్సా పేరు చెప్పి అక్రమంగా డబ్బులు వసూలు చేసి, వేరే చోట మౌలానా సొంత జాగాలో ఇంకో మదర్సా కడుతూ డబ్బులు దండుకుంటున్నాడని, కాలనివాసులమంతా అతనిపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసినందుకు మాపై గుర్తు తెలియని వ్యక్తులతో చంపేస్తామని బెదిరింపులకు దిగుతున్నాడని, మౌలానా అయి ఉండి గొడవలు సృష్టించడమేంటని ప్రశ్నించారు, నందిపేట్ లో సోదర భావంతో అన్ని మతాల వారు కలిసిమెలిసి ఉంటామని, ఇలాంటి వ్యక్తుల వల్ల మతసామరస్యం దెబ్బతింటుందని, అధికారులు వెంటనే సమగ్ర విచారణ జరిపి, చర్య తీసుకోని గొడవలు కాకుండా చూడాలని కోరారు

యువతలో సంస్కారం.. సమాజంలో మహిళలకు గౌరవం..!

దీక్షా క్రమశిక్షణను నిత్యజీవితంలో ఆచరించాలి: ఏసీపీ మడత రమేష్

పెద్దంపేట దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజలు.. పోలీసు అధికారులకు ఘన సత్కారం





గోదావరిఖని, (సింగిడి): ఆధ్యాత్మికత మనిషికి మానసిక ప్రశాంతతను అందించడమే కాకుండా, క్రమ శిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవడానికి దోహదపడుతుందని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అన్నారు. దీక్షా సమయంలో పాటించే నియమాలు, నిష్ఠలు జీవితంలోనూ ప్రతిబింబించాలని, యువత మంచి నడవడికను అలవర్చుకుంటూ మహిళల పట్ల గౌరవభావంతో వ్యవహరించాలని సూచించారు. అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలో శ్రీ దుర్గాభవాని యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ ఆహ్వానం మేరకు ఏసీపీ మడత రమేష్ ఉత్సవ మండపాన్ని సందర్శించారు. రామగుండం సీఐ కృష్ణకుమార్, ఎస్సై హరి శేఖర్, అంతర్గాం ఎస్సై టి. ఉదయ్ కిరణ్‌లతో కలిసి దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా అలవడే క్రమశిక్షణ, సహనం, నిబద్ధత వంటి లక్షణాలు జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. పండుగల సమయంలో చూపించే భక్తి, నియమ నిష్ఠలను రోజువారీ జీవితంలోనూ పాటించాలని సూచించారు. యువత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా గుర్తించాలని ఏసీపీ మడత రమేష్ అన్నారు. యువతలో నైతిక విలువలు పెంపొందించి, మహిళల పట్ల గౌరవం, ఆడపిల్లల పట్ల ఆదరణ కలిగిన ఆలోచనా విధానాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంచి సంస్కారం, మానవీయ విలువలు కలిగిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షిస్తూ, బతుకమ్మ, విజయదశమి పండుగలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని పోలీసు శాఖ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉత్సవాల్లో పాల్గొన్న ఏసీపీ మడత రమేష్, సీఐ కృష్ణకుమార్, ఎస్సై హరిశేఖర్, అంతర్గాం ఎస్సై టి. ఉదయ్ కిరణ్, పెండ్యాల మహేష్‌లను శ్రీ దుర్గాభవాని యూత్ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గాభవాని యూత్ సభ్యులు పైడిపల్లి విజయ్, బీరెల్లి శరణ్, మారుతి అజయ్, కోల ఉదయ్, కోలా మధు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేముల శ్రీనివాస్, మేరుగు కుమార్ గౌడ్, పల్లె రవీందర్, గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పైడిపల్లి ప్రసాద్, వెల్పుల కుమార్ యాదవ్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావం కరువు పరిస్థితులపై కళాజాత బృందం అవగాహన

ఆరుతడి పంటల సాగుతో కరువు ముప్పును తగ్గించుకోవాలి



కాటారం, (సింగిడి): ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో వచ్చే మార్పులు, కరువు పరిస్థితులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు సూచించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్, డీపీఆర్ఓ ఆదేశాల మేరకు శనివారం కాటారం మండలం కొత్తపల్లి గ్రామంలో సెగ్గం శిరీష కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షపాతం, నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, పెసలు, మినుములు, నువ్వులు వంటి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని కళాకారులు సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలతో సాగు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎండల తీవ్రత నుంచి రక్షణకు తగిన జాగ్రత్తలు పాటించాలని, వర్షపు నీటిని సంరక్షించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు సెగ్గం శిరీష, పులి రాధిక, కాస స్వాతి, ఆత్మకూరి మహేందర్, కమ్మల ప్రవీణ్ కుమార్, ఒనపాకల కుమార్ పాల్గొన్నారు

బతుకమ్మకు పూల మార్కెట్ల కళకళ!

కాటారంలో పండుగ సందడి..



కాటారం, (సింగిడి): సద్దుల బతుకమ్మ పండుగ ఆదివారం జరగనున్న నేపథ్యంలో శనివారం కాటారం మండల కేంద్రంలోని పూల మార్కెట్లు సందడిగా మారాయి. బతుకమ్మలను అందంగా పేర్చేందుకు అవసరమైన పూల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. మండలంలోని వివిధ గ్రామాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో మార్కెట్ ప్రాంతం కిటకిటలాడింది. పూల కొనుగోళ్లు జోరుబతుకమ్మ అలంకరణకు అవసరమైన గునుగు, బంతి, చామంతి,సీతమ్మ జడ, తంగేడు తదితర పూల విక్రయాలు జోరుగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు పెద్ద మొత్తంలో పూలను తీసుకువచ్చి విక్రయాలు చేపట్టారు. కిలో బంతిపూలు రూ. 100 చొప్పున అమ్మకాలు సాగినట్లు తెలిసింది.

పండుగకు ముందురోజే..

కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో వ్యాపారాలు పుంజుకున్నాయి. పండుగకు ముందే పల్లెల్లో సందడిపూల కొనుగోళ్లతో కాటారం ప్రధాన మార్కెట్ ప్రాంతం జనసందోహంతో కళకళలాడింది. రంగురంగుల పూలను కొనుగోలు చేసేందుకు మహిళలు, కుటుంబాలు ఆసక్తి చూపడంతో పండుగ వాతావరణం ముందుగానే నెలకొంది. సద్దుల బతుకమ్మ వేడుకలకు సిద్ధమవుతున్న ప్రజలతో కాటారం పూల మార్కెట్లు సందడిగా కనిపించాయి.

నస్తూరుపల్లిలో రీ సర్వే పనులపై అదనపు కలెక్టర్ ఆరా

తహసీల్దార్ కార్యాలయంలో దెబ్బతిన్న పైకప్పుల పరిశీలన..



కాటారం, (సింగిడి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. అశోక్ కుమార్ శనివారం కాటారం మండలంలోని నస్తూరుపల్లి గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రీ సర్వే పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

దెబ్బతిన్న పైకప్పుల పరిశీలన

అనంతరం కాటారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ పి. అశోక్ కుమార్, తహసీల్దార్ నాగరాజుతో కలిసి కార్యాలయంలోని పలు గదులను పరిశీలించారు. తహసీల్దార్ ఛాంబర్, నాయబ్ తహసీల్దార్ ఛాంబర్‌తో పాటు ఇతర గదుల్లో దెబ్బతిన్న పైకప్పులను గమనించారు. కొన్ని చోట్ల సీలింగ్ ప్లాస్టర్ ఊడిపడే ప్రమాదం ఉండటంతో భవనం పరిస్థితినిపరిశీలించారు. కార్యాలయంలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి ప్రమాదం జరగకుం డా భవన భద్రతపై తగిన చర్యలు తీసుకోవా ల్సిన అవసరాన్ని గుర్తించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ నాగరాజు,సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), గ్రామ పంచా యతీ అధికారి (జీపీఓ), లైసెన్స్‌డ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

అవగాహన లేమితో ముసురుకుంటున్న అంటువ్యాధులు

సాధారణ పరిశుభ్రతా చర్యలతో నివారించగలిగే అంటువ్యాధుల బారిన ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు పడుతున్నారు. ఫ్లూ వంటి శ్వాసకోశ వ్యాధుల నుండి ఆసుపత్రులలో సంక్రమించే ఇన్ఫెక్షన్ల (నూ×ం) వరకు, ఇవి కుటుంబాలు, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలపై తీవ్రమైన భారాన్ని మోపుతున్నాయి. భారతదేశంలో, కిక్కిరిసిన ఆసుపత్రులు, నివారించదగిన ఇన్ఫెక్షన్ల అవగాహన కొరతతో ఈ సవాలు మరింత తీవ్రం అవుతున్నది. శుభవార్త ఏమిటంటే, ఈ ఇన్ఫెక్షన్ సమస్యలకు పరిష్కారాలు మన చేతుల్లోనే ఉన్నాయి. క్రమం తప్పకుండా చేతులను సరిగ్గా కడుక్కోవడం, సకాలంలో టీకాలు వేయించుకోవడం, సురక్షితమైన తాగునీటి వినియోగం, పరిశుభ్రతా పద్ధతులు వంటి సాధారణ చర్యలు ప్రపంచవ్యాప్తంగా లెక్కలేనన్ని ప్రాణాలను కాపాడగలవు. అత్యంత సాధారణమైన 7 రకాల ఇన్ఫెక్షన్లలో బాక్టీరియల్, వైరల్, ఫంగల్, పారాసైటిక్, యాంటీ పాథోజెన్స్, ఆర్థ్రోపాడ్ లేదా ఎక్టోపారాసైట్స్, ప్రియాన్ సంబంధిత వ్యాధులు ఉన్నాయి.

సాధారణ అంటువ్యాధులు : నివారణ వ్యూహాలు:

అత్యంత సాధారణ ఇన్ఫెక్షన్లలో శ్వాసకోశ, మూత్ర నాళం, శస్త్రచికిత్స జరిగిన ప్రదేశం, చర్మం మరియు మృదు కణజాల ఇన్ఫెక్షన్లు ఉన్నాయి. కోవిడ్–19, ఇన్ఫ్లుయెంజా మరియు క్షయ (టీ) అనేవి గమనించిన కొన్ని శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు. మూత్ర నాళంలోకి బ్యాక్టీరియా ప్రవేశించడం వల్ల మహిళల్లో మూత్ర నాళ ఇన్ఫెక్షన్లు సర్వసాధారణం. శుభ్రపరచని శస్త్రచికిత్స పరికరాలు, అసురక్షిత ఆసుపత్రి పద్ధతుల కారణంగా హాస్పిటల్–అక్వైర్డ్ ఇన్ఫెక్షన్లు వస్తాయి. చర్మంపై బ్యాక్టీరియా లేదా ఫంగల్ ఇన్ఫెక్షన్లు వేగంగా వ్యాప్తి చెందుతాయి. ఇన్ఫెక్షన్ వ్యాప్తిని నివారించగల ఉత్తమ పద్ధతులలో సరైన పద్ధతిలో చేతులు కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, శానిటైజర్లు వాడటం, వ్యక్తిగత రక్షణ పరికరాలు ఉపయోగించడం, సురక్షితమైన ఆహార తయారీ, ఉపరితలాలను క్రిమిరహితం చేయడం, సకాలంలో టీకాలు వేయించుకోవడం, సురక్షితమైన ఆసుపత్రి వాతావరణాన్ని నిర్వహించడం, సరైన వంట పద్ధతులు పాటించడం వంటి కొన్ని పద్ధతులు ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ఏ ఆరోగ్య సంరక్షణ కేంద్రం కూడా నూ×ం బారి నుండి సురక్షితం కాదు. ఆసుపత్రిలో ఉన్న సమయంలో, అధిక–ఆదాయ ప్రపంచవ్యాప్తంగా అంటువ్యాధులు అత్యంత సాధారణమైనవి అయినప్పటికీ, వాటిని సులభమైన జీవనశైలితో నివారించవచ్చు. నివారణ అనేది ప్రతిఒక్కరి బాధ్యత అని ఈ వారోత్సవాలు గుర్తు చేస్తున్నాయి. ఆసుపత్రులలో అపరిశుభ్రతతో పాటు అనారోగ్యకరమైన పద్ధతుల వల్ల అంటువ్యాధులు సంభవిస్తాయి. ఇళ్లు, కార్యాలయాలు, యాంటీ–మైక్రోబియల్ నిరోధకత, ఆసుపత్రి–సంబంధిత అంటువ్యాధులు (నూ×ం) అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయని మరిచి పోరాదు.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

యువజన దుర్గా మండలి ఆధ్వర్యంలో

వైభవంగా కుంకుమ పూజలు



కాగజ్‌నగర్,(సింగిడి):దేవీ నవరాత్రులను పురస్కరించుకుని కాగజ్ నగర్ పట్టణంలోని 28వ వార్డులో శ్రీ యువజన దుర్గా మండలి వద్ద శనివారం కుంకుమ పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో స్థానిక మహిళలు మరియు భక్తులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు సమర్పించారు అమ్మవారి నామ స్మరణతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది మహిళలందరూ భక్తిభావంతో పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రార్థించారు భక్తులందరి సహకారంతో ఈ కార్యక్రమం అత్యంత విజయవంతంగా ముగిసింది కమిటీ సభ్యులు తెలిపారు

కాటారం పీహెచ్‌సీలో

డీఎంహెచ్‌వో తనిఖీ

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు..

మందుల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలి



కాటారం, (సింగిడి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ సిబ్బందికి సూచించారు. శనివారం కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఆసుపత్రిలోని వైద్య సేవలు, రికార్డులను పరిశీలించారు. ఓపీ రిజిస్టర్లు, సిబ్బంది హాజరు పట్టిక, ఫార్మసీలో మందుల నిల్వలు, ఇన్‌పేషెంట్ వార్డును తనిఖీ చేశారు. రోగులకు అవసరమైన మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని, వైద్య సేవల్లో నాణ్యత పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో క్షయ నివారణ కార్యక్రమ అధికారి డాక్టర్ సందీప్, స్థానిక వైద్యాధికారులు డాక్టర్ మౌనిక, డాక్టర్ హారిక పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందించడమే లక్ష్యం

నేతావత్ పర్కజాల తండా గ్రామ పంచాయతీలో గ్రామసభ

ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సమీక్ష.. సర్పంచ్ బానోత్ కొండయ్య

డోర్నకల్ /మరిపెడ (సింగిడి):మరిపెడ అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పథకాన్ని అమలు చేస్తోందని నేతావత్ పర్కజాల తండా గ్రామ సర్పంచ్ బానోత్ కొండయ్య అన్నారు. శనివారం మరిపెడ మండలంలోని నేతావత్ పర్కజాల తండా గ్రామ పంచాయతీ ఆవరణలో ఆయన అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు తీరుపై సమీక్ష నిర్వహించి,పథకానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అంశాలను సమావేశంలో చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ కొండయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి లబ్ధిదారుల వివరాలను సమీక్షిస్తూ,అర్హులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. ఈ గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి అశోక్,వార్డు సభ్యులు బానోత్ అమ్మి,బానోత్ బాల,నేతావత్ పద్మ,నేతావత్ కృష్ణ,ఆశా వర్కర్ సునీత,సీఏ మోతిలాల్,యువ నాయకులు వెంకన్నగౌడ్, లింగ,గ్రామ పంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మైనార్టీ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

డోర్నకల్ ఎమ్మెల్యే విప్ డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్



డోర్నకల్ /మరిపెడ (సింగిడి):మరిపెడ మైనార్టీ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెంది, తమ కాళ్లపై తాము నిలబడాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్ ఆకాంక్షించారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి కుటుంబ అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి స్వయం ఉపాధి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.ఇందిరమ్మ మైనార్టీ మహిళా పథకం కింద మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని మరిపెడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్ మైనార్టీ మహిళలకు కుట్టుమి షన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహిళలు కుట్టుమి షన్లను సద్వినియోగం చేసుకొని కుట్టుపనిని ఉపాధి మార్గంగా మలుచుకోవాలని ఆకాంక్షించారు. స్వయం ఉపాధి ద్వారా ఆదాయం పెంచుకుంటూ కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరు గుపరుచుకోవాలని సూచించారు. మైనార్టీ మహిళలు ఆర్థి కంగా అభివృద్ధి చెందేందుకు ఇటువంటి ఉపాధి అవకాశాలు ఉపయోగపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి,వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి,మండల అధ్యక్షులు గుగులోత్ రవి నాయక్,వార్డ్ కౌన్సిలర్లు,కో – ఆప్షన్ సభ్యులు,మైనార్టీ నాయకులు,సర్పంచులు,అధికారులు డిఆర్ఓ నాగలక్ష్మి,ఎమ్మార్వో కృష్ణవేణి,ఆర్ ఐ సాయి, కార్యదర్శిలు,మహిళలు ఇంకా తదితరులు పాల్గొన్నారు..

జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన

అందాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి



బోధన్, (సింగిడి):: బోధన్ మండలం అందాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి రిజ్వాన్ జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సునీత తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన 70వ ఎస్ జి ఎఫ్ అండర్ 17 రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను చాటి బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బాలికల విభాగంలో సింధుబాయి అండర్ 17 బాలికల విభాగంలో కాశీస్థ పథకాన్ని సాధించింది. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్య కుమార్, ఫిజికల్ డైరెక్టర్ సునీత, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ అడ్వాల జ్యోతి దంపతులు





బుగ్గారం, (సింగిడి):జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో శ్రీ నవ దుర్గా భవాని సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శ్రీ నవదుర్గ భవాని అమ్మవారిని జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ అడ్వాల జ్యోతి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సగౌడ్, గ్రామ సర్పంచ్ నక్క రాజవ్వ రాజయ్య, ఉపసర్పంచ్ జంగా లావణ్య శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు



బోధన్,(సింగిడి): బోధన్ పట్టణంలోని రాకాసి పేట్ దుర్గా భవాని మండపం వద్ద దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శనివారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకు మార్చన పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.

మరువలేనిది వారి త్యాగం.. చెరిగిపోనిది వారి జ్ఞాపకం

8ఏ ఇంక్లైన్ అమర కార్మికులకు ఘన నివాళి

సింగరేణి చరిత్రలో చెరగని విషాదం..

కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని నాయకుల పిలుపు

యైటింక్లయిన్ కాలనీ, (సింగిడి): సింగరేణి 8ఏ ఇంక్లైన్ బొగ్గు గనిలో జరిగిన ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పో యిన కార్మికుల 23వ వర్ధంతి సందర్భంగా అమర కార్మికులకు ఘన నివాళులర్పించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీని వాస్‌లు అమర కార్మికులను స్మరించుకుంటూ పుష్పాంజలి ఘటిం చారు.ఈ సందర్భంగా యనియన్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి మాట్లాడుతూ.. 8ఏ ఇంక్లైన్ గని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల త్యాగం సింగరేణి చరిత్రలో ఎప్పటికీ చెరిగిపోదన్నారు. 23 ఏళ్ల గడిచినా వారి కుటుంబాల కన్నీటి జ్ఞాపకాలు, వారి త్యాగం నేటికీ మనసులను కలచివేస్తున్నాయని పేర్కొన్నారు. బొగ్గు ఉత్పత్తి ద్వారా సింగరేణికి వెలుగులు అందించేందుకు గనుల్లోకి దిగిన కార్మికులు తిరిగి తమ కుటుంబాల చెంతకు చేరుకోలేకపోవడం తీరని విషాదమన్నారు. తమ శ్రమతో సంస్థ అభివృద్ధికి తోడ్పడిన కార్మికులు విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోవడం సింగరేణి చరిత్రలో మాయని మచ్చగా నిలిచిపోయిందన్నారు. ప్రతి కార్మికుడు సురక్షితంగా విధులు నిర్వహించేలా భద్రతా ప్రమాణాలను మరింత పటిష్టం చేయాలని కోరారు. అమర కార్మికులకు తమ సంఘం తరఫున ఘన నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు.ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గని ప్రమాదంలో ప్రా ణాలు కోల్పోయిన కార్మికుల త్యాగం ఎంతో గొప్పదని అన్నారు. వారి కుటుంబాల వేదనను ఎప్పటికీ మరచిపోలేమని పేర్కొన్నారు. గనుల్లో పనిచేసే ప్రతి కార్మికుడి ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రమాదాలు పునరావృతం కాకుండా యాజమాన్యం పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. అమర కార్మికులకు జోహార్ అర్పిస్తూ.. వారి త్యాగం చిరస్మరణీయమని అన్నారు.గని ప్రమాదా లు పునరావృతం కాకుండా కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధా న్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ వర్ధంతి మరోసారి గుర్తుచేస్తోందని నాయకులు పేర్కొన్నారు. ప్రతి కార్మికుడు విధులు ముగించుకుని క్షేమంగా ఇంటికి చేరుకునేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టడం యాజమాన్యం, కార్మిక సంఘాలు, ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.



చీకటి కాలనీలో వెలుగులు..

ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్ మార్పుతో ఊరట!... వీధి దీపాలు ప్రారంభించిన సర్పంచ్ మాచర్ల కుమారస్వామి

భీమదేవరపల్లి, (సింగిడి): ఏళ్ల తరబడి చీకటిలో మగ్గిన కాలనీకి వీధి దీపాల వెలుగులు అందుబాటులోకి వచ్చాయి. మరోవైపు బస్టాండ్ ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించడంతో స్థానికులకు ఊరట కలిగింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలో చేపట్టిన ఈ పనులను గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.భీమదేవరపల్లి గ్రామంలోని ఓ కాలనీలో కొన్నేళ్లుగా వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించే చర్యల్లో భాగంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాలను అమర్చారు. దీంతో కాలనీలో రాత్రివేళల్లో వెలుగులు నిండనున్నాయి. అదేవిధంగా బస్టాండ్ ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటుకు మార్చడంతో ప్రయాణికులు, స్థానికులకు ప్రమాదాల ముప్పు తగ్గనుంది. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ వీధి దీపాల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి పనులు చేపట్టినట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ లక్ష్మణ్ నాయక్, ఉపసర్పంచ్ ఐలయ్య, వార్డు సభ్యులు వెంకటేశ్వర్లు, బొల్లంపల్లి శ్యామ్, పంచాయతీ కార్యదర్శి మోహన్, లైన్‌మెన్లు బాలరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిపెడ మున్సిపల్ చైర్‌పర్సన్

ప్రగతిశ్రీపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

డోర్నకల్ /మరిపెడ (సింగిడి):మరిపెడ మున్సిపల్ చైర్‌పర్సన్ విశారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.మరిపెడ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కంచెర్ల నరేశ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి చైర్‌పర్సన్ ప్రగతిశ్రీపాల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మరిపెడ పత్రికా విలేకరుల ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ ప్రగతి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తూ, పట్టణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ సిబ్బంది,పత్రికా



విలేకరులు మూడవత్ రవి, కారంపూరి వెంకటేశ్వర్లు,బోడపట్ల సతీష్,దేవరశెట్టి శ్రీశైలం,బోడ శీను తదితరులు పాల్గొని చైర్‌పర్సన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

హుస్నాబాద్ (సింగిడి): మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందాలంటే జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిందేనా..? అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో వైద్యం అందక ఇబ్బందులు పడాల్సిందేనా..? ఒకప్పుడు హుస్నాబాద్ పరిసర గ్రామాల ప్రజలను వేధించిన ఇలాంటి సమస్యలకు పరిష్కారంగా నిలుస్తున్నారు సురక్ష హాస్పిటల్ వైద్యుడు డా. ధర్మ, ఎంబీబీఎస్, ఎం. డి. (జనరల్ మెడిసిన్), సాధారణ వైద్య నిపుణులు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించి, చిన్ననాటి నుంచి వైద్యుడిగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగిన ఆయన.. హుస్నాబాద్ మండలం బల్ నాయక్ తండా నుంచి ప్రారంభమైన తన ప్రయాణాన్ని ప్రజలకు వైద్య సేవలు అందించే స్థాయికి తీసుకొచ్చారు. పేదరికం, గ్రామీణ ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు, అత్యవసర వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులను అర్థం చేసుకున్న ఆయన.. ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉండాలనే ఆశయంతో హుస్నాబాద్‌లో సురక్ష హాస్పిటల్ ద్వారా గత 12 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తున్నారు. హుస్నాబాద్ చుట్టుపక్కల అనేక గ్రామాలకు కేంద్రంగా ఉన్నప్పటికీ, గతంలో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్, వరంగల్ వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి. దాదాపు 40 నుంచి 50 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి రావడంతో రోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, గుండె సంబంధిత సమస్యలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో వైద్యం అందడం ఎంతో కీలకం. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని డా. ధర్మ, ఎంబీబీఎస్, ఎం.డి. (జనరల్ మెడిసిన్), సాధారణ వైద్య నిపుణులు, హుస్నాబాద్‌లోనే వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అండగా నిలుస్తున్నారు. కేవలం వైద్య వృత్తినే ఉపాధిగా భావించకుండా, పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో ముందుకు సాగడం డా. ధర్మ, ఎంబీబీఎస్, ఎం.డి. (జనరల్ మెడిసిన్), సాధారణ వైద్య నిపుణుల ప్రత్యేకత. సొంత భవనంలో ఆధునిక వైద్య సదుపాయాలతో సురక్ష హాస్పిటల్‌ను అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక ప్రజలకు వైద్య సేవలను చేరువ చేస్తున్నారు. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయనకు గ్రామీణ ప్రజల కష్టాలు, ఆర్థిక ఇబ్బందుల పై అవగా హన ఉండటంతో..





వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరాన్ని తగ్గించి, ప్రజలకు తమ ప్రాంతంలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తు న్నారు. మారుమూల తండాలో జన్మించి, వైద్యుడిగా ఎదిగి, తాను పుట్టి పెరిగిన ప్రాంత ప్రజలకు సేవలు అందించడం డా. ధర్మ, ఎంబీబీఎస్, ఎం.డి. (జనరల్ మెడిసిన్), సాధారణ వైద్య నిపుణుల ప్రయాణంలోని విశేషం. చిన్ననాటి కలను నిజం చేసుకోవడంతో పాటు, తన వృత్తి ద్వారా సమాజానికి ఉపయోగపడాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. గత 12 ఏళ్లుగా హుస్నాబాద్‌లో సురక్ష హాస్పిటల్ ద్వారా వైద్య సేవలు అందిస్తూ ప్రజలకు చేరువైన ఆయన.. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్యం అందుబా టులో ఉండాలనే లక్ష్యంతో సేవలందిస్తున్నారు. పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరాన్ని సాధ్యమైనంత వరకు తగ్గిస్తూ, ప్రజలకు తమ ప్రాంతంలోనే వైద్య సదుపా యాలు అందించేందుకు కృషి చేస్తున్న డా. ధర్మ, ఎంబీబీఎస్, ఎం.డి. (జనరల్ మెడిసిన్), సాధారణ వైద్య నిపుణుల సేవలు హుస్నాబాద్ పరిసర ప్రాంతాల ప్రజలకు భరోసానిస్తున్నాయి.

ఆపదలో ప్రాణదాతగా.. ప్రజాసేవలో చెరగని ముద్ర!

108 ఉద్యోగికి ఆత్మీయ వీడ్కోలు.. సేవలను స్మరించుకుంటూ సహచరుల అభినందనలు

అంకితభావానికి అభినందన.. అనుబంధాలకు ఆత్మీయ వీడ్కోలు

పెద్దపల్లి, (సింగిడి):ఆపదలో ఉన్నవారికి అత్యవసర వైద్య సేవలు అందిస్తూ, ప్రాణాలను కాపాడే మహత్తర బాధ్యతలో భాగస్వా ములవుతున్న 108 ఉద్యోగుల సేవలు అభినందనీయ మని పెద్దపల్లి జిల్లా 108 ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. విధి నిర్వహణలో బాధ్యత, సమయస్ఫూర్తి, అంకితభావంతో పనిచేసిన ఉద్యోగికి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. సహచర ఉద్యోగుల మధ్య జరిగిన ఈ కార్యక్రమం ఆనందం, ఆత్మీయత, భావోద్వేగాల నడుమ ప్రత్యే కంగా నిలిచింది.ప్రాణాపాయ పరిస్థితుల్లో బాధిత ులకు సకాలంలో వైద్య సహాయం అందించడంలో 108 సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని సంఘం ప్రతినిధులు అన్నారు. ప్రతి నిమిషం విలువైన అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తతతో వ్యవహరిస్తూ, ప్రజలకు అండగా నిలవడం గొప్ప సేవాభావానికి నిదర్శనమని తెలిపారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ ప్రజలకు సేవలందించిన ఉద్యోగి పనితీరును కొనియాడారు.కలిసి పనిచేసిన అనుభవాలు, కష్టసుఖాల్లో పరస్పరం అందించుకున్న సహకారం ఉద్యోగుల మధ్య విడదీయలేని బంధాన్ని ఏర్పరుస్తాయని సహచరులు పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంలో మార్పులు సహజమే అయినప్పటికీ, కలిసి పనిచేసిన రోజులు, పంచుకున్న అనుభూతులు ఎప్పటికీ గుర్తుండిపోతాయని భావోద్వేగంగా వెల్లడించారు. వీడ్కోలు పొందిన ఉద్యోగి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, ఆయురారోగ్యా లతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.



108 ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం జిల్లా సంఘం నిరంతరం కృషి చేస్తుందని ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగులం దరూ ఐక్యంగా ఉంటూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజలకు నాణ్యమైన అత్యవసర వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఉద్యోగి నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో దాసరపు సంపత్, తిరుమల సురేష్, పడిందా కుమార్, స్వామి, అనిల్, రవి వర్మ, కిషన్, రాజ్ కుమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. వీడ్కోలు పొందిన ఉద్యోగికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన భవిష్యత్తు మరింత విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. సహచరుల అభిమానం, ఆప్యాయతల మధ్య జరిగిన ఈ కార్యక్రమం ఉద్యోగుల మధ్య ఉన్న ఐక్యతకు, సేవాభావానికి ప్రతీకగా నిలిచింది.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

బోధన్, (సింగిడి): బోధన్ పట్టణంలోని రిలయన్స్ స్మార్ట్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. మహిళా సిబ్బంది సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను పేర్చారు. అనంతరం బతుకమ్మ చుట్టూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ స్మార్ట్ మేనేజర్ ప్రశాంత్, యోగేష్, భూమయ్య, థాంక్యూ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా వెన్న ముద్ద బతుకమ్మ సంబరాలు

-సంప్రదాయ పూల పండుగలో ఆనందోత్సాహాలతో పాల్గొన్న మహిళలు

వనపర్తి ప్రతినిధి, (సింగిడి): వనపర్తి పట్టణంలోని చిట్యాలరోడ్డులో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ కాలనీ, మర్రికుంట లోని సరస్వతి కాలనీ, డాగ్ స్క్వాడ్ కాలనీ మహిళలు శనివారం రాత్రి వెన్న ముద్ద బతుకమ్మ వేడుకలనుఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచేబతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతోబతుకమ్మలను అందంగా పేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ చేరి పాటలుపాడుతూ, చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మపాటలు, మహిళల కోలాహలంతో కాలనీల్లో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు ఒకచోటచేరి సంప్రదాయ పద్ధతుల్లో వేడుకలు నిర్వహించడంతో కాలనీల్లో సందడినెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచేబతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు భావితరాలకు మనసంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేస్తుందని పలువురు పేర్కొన్నారు. అనంతరంఆయా కాలనీవాసులు నల్ల చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో డబుల్ బెడ్ రూమ్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, బతుకమ్మ సంబరాలకమిటీ



సభ్యులు, సరస్వతీ కాలనీ, డాగ్ స్క్వాడ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

భారత్ గ్యాస్ 'జిప్ లైట్' కొత్త కనెక్షన్ ప్రారంభం

రూ.3,671కే కనెక్షన్..తేలికపాటి సిలిండర్‌తో సౌకర్యాలు

భీమదేవరపల్లి, (సింగిడి): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ భారత్ గ్యాస్ ఏజెన్సీ, వంటగ్యాస్ వినియోగదారులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించే లక్ష్యం తో భారత్ పెట్రోలియం సంస్థ 'జిప్ లైట్' పేరుతో తేలికపాటి గ్యాస్ సిలిండర్ కొత్త కనెక్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సులభంగా ఎత్తి తరలించడంతోపాటు, సిలిండర్‌లో ఎంత గ్యాస్ మిగిలి ఉందో బయట నుంచే తెలుసుకునేలా దీనిని రూపొందించినట్లు సంస్థ తెలిపింది. కొత్త కనెక్షన్ ధర రూ. 3,671గా నిర్ణయించగా, గ్యాస్ నింపే ఖర్చు అదనంగా చెల్లించాలి. ఆధార్ లేదా ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డుతో దరఖాస్తు చేసుకోవచ్చు. హలో బీపీసీఎల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే సౌకర్యంతోపాటు, నాలుగు గంటల్లో ఇంటి వద్దకే సిలిండర్ సరఫరా చేసే సేవను కూడా సంస్థ ప్రకటించింది. తుప్పు నిరోధకత, గ్యాస్ లీకేజీ ప్రమాదాలను తగ్గించే ప్రత్యేక రక్షణ సాంకేతికత ఈ సిలిండర్ ప్రత్యేకతలని వెల్లడించింది.



సుభాష్ యూత్ నిత్య అన్నదానానికి ఉదార చేయూత

రూ.51,116 విరాళం అందించిన యప్‌టీవీ, అధినేత పాడి ఉదయ్ నందన్ రెడ్డి

జమ్మికుంట, (సింగిడి): జమ్మికుంట పట్టణంలోని పద్మశాలి వీధిలో సుభాష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలు 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కమిటీ సభ్యులు చేపట్టిన నిత్య అన్నదాన కార్యక్రమానికి యప్‌టీవీ, ట్యూరిటో సంస్థల వ్యవస్థాపకుడు, సీఈఓ పాడి ఉదయ్ నందన్ రెడ్డి రూ. 51,116 విరాళాన్ని అంద జేసి తన ఉదారతను చాటుకున్నారు. నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించాలన్న సుభాష్ యూత్ కమిటీ సంకల్పానికి ఆయన వెంటనే స్పందించి, తన బృందం ద్వారా విరాళాన్ని అందించారు. ఈ సంద ర్భంగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, సుభాష్ యూత్ ఆధ్వర్యంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు 25 ఏళ్లు పూర్తి చేసుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ ఏడాది ఉత్సవాలను గతంలో కంటే వైభవంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన పాడి ఉదయ్ నందన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులు ఆయన కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సుభాష్ యూత్ అధ్యక్షుడు ముత్యాల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి



చుక్కారపు అఖిలేష్, ఉపాధ్యక్షులు చుంచు శివ, చుంచు వీరేశం, ఎల్ల గణేష్, సీహెచ్ మనోజ్ కుమార్, జమ్మికుంట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శరత్ కుమార్, కమిటీ సభ్యులతో పాటు పాడి ఉదయ్ నందన్ రెడ్డి బృంద సభ్యులు అంజి గౌడ్, రాయిశెట్టి కుమారస్వామి, మంతెన శ్రీధర్, తాళ్లపెల్లి కుమారస్వామి, సిరిగిరి రాజశేఖర్, తొట్ల రాకేష్, దాసారపు చందు, లోకేష్, అశోక్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్పీ కాలువలో బాలిక మృతదేహం వెలికితీత

కాలువలో గల్లంతైన పదేళ్ల కామాక్షి.. చెన్నారిగూడెం శివారులో మృతదేహం లభ్యం

చిలుకూరు (సింగిడి): ఎన్ఎస్పీ కాలువలో గల్లంతైన పదేళ్ల బాలిక కడమంచి కామాక్షి మృతదేహం శనివారం చిలుకూరు మండలం లోని చెన్నారిగూడెం గ్రామ శివారులో లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం దోసపాడు గ్రామానికి చెందిన కడమంచి శ్రీరాములు దంపతులు శుక్రవారం ఉదయం సరుకుల కోసం సూర్యాపేటకు వెళ్లి మధ్యాహ్నం 3 గంటలకు ఇంటికి తిరిగొచ్చారు. అప్పటికే వారి చిన్న కుమార్తె కామాక్షి కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఇంటి పక్కనే ఉన్న ఎన్ఎస్పీ కాలువ ఒడ్డున బాలిక దుస్తులు కనిపించడంతో కాలువలో పడిపోయి ఉంటుందని అనుమానించారు. కాలువ వెంట గాలిస్తుండగా శనివారం చెన్నారిగూడెం శివారులో బాలిక మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చిలుకూరు ఎస్సై బి. మోహన్ బాబు తెలిపారు.



అనుమతులు లేని వైన్స్‌పై చర్యలెవి?

రేగులగూడెం తెలంగాణ వైన్స్‌పై సమగ్ర విచారణ జరపాలి..

కాటారం, (సింగిడి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న తెలంగాణ వైన్స్ అనుమతుల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. సదరు వైన్‌షాపునకు అవసరమైన అనుమతులు, గ్రామపంచాయతీ నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్ఓసీ) ఉన్నాయా అనే అంశంపై విచారణ జరగగా, అవసరమైన అనుమతులు లేవని అధికారులు వెల్లడించినట్లు మొగిలి రాజ్‌కుమార్ యాదవ్ తెలిపారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు.. నిర్వాహకులకు నోటీసులు

ఈ వ్యవహారంపై మొగిలి రాజ్‌కుమార్ యాదవ్ జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన అధికారులు విచారణ చేపట్టగా, అవసరమైన అనుమతులు లేవని తేలినట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో గ్రామపంచాయతీ అధికారులు వైన్‌షాపు నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.

ఇంతకాలం అధికారులు ఏం చేస్తున్నారు?

అవసరమైన అనుమతులు లేకుండానే షాపు నిర్వహణ జరుగుతున్నట్లు విచారణలో వెల్లడైతే, ఇంతకాలం సంబంధిత శాఖల అధికారులు ఏం చేస్తున్నారని మొగిలి రాజ్‌కుమార్ యాదవ్ ప్రశ్నించారు. నిబంధనల ఉల్లంఘనలపై కేవలం నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజలకు నిబంధనలు తెలియజేయాల్సిన అధికారులే వాటి అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నారనే అనుమానాలకు ఈ వ్యవహారం తావిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.



అన్ని అనుమతులపై సమగ్ర విచారణ చేపట్టాలి రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని తెలంగాణ వైన్స్‌కు సంబంధించిన గ్రామపంచాయతీ అనుమతులు, ఎన్ఓసీ, ఎక్సైజ్ లైసెన్స్ తదితర పత్రాలను సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే లైసెన్స్ రద్దు సహా చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అలాగే, ఇప్పటివరకు చేపట్టిన విచారణ, జారీ చేసిన నోటీసులు, వాటిపై షాపు నిర్వాహకులు ఇచ్చిన సమాధానాలు, తదుపరి తీసుకున్న చర్యలపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు తేలిన అధికారులపైనా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి

జిల్లా కలెక్టర్, డీపీఓ, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి పూర్తిస్థాయి విచారణ జరపాలని మొగిలి రాజ్‌కుమార్ యాదవ్ కోరారు.

శాకంబరీ దేవిగా అమ్మవారి అలంకారం

శరన్నవరాత్రుల ఏడో రోజు భక్తులకు దర్శనమిచ్చిన కాళరాత్రి దుర్గాదేవి





భీమదేవరపల్లి, (సింగిడి): శరన్నవరాత్రుల వేడుకల్లో భాగంగా కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో అమ్మవారి పూజలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఏడో రోజు శనివారం అమ్మవారిని శాకంబరీ దేవి అలంకారంలో అలంకరించగా, కాళరాత్రి దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తుల ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, శైవశుద్ధి, పుణ్యాహవచనం, సర్వతోభద్ర మండల ఆవాహన నిర్వహించి, అనంతరం చతుఃషష్టి ఉపచార పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. శాకంబరీ దేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపించారు. నవరాత్రుల్లో ఏడో రోజు విశిష్టతను చాటుతూ కాళరాత్రి దుర్గాదేవి రూపంలో అమ్మవారి దర్శనం భక్తులను ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తింది. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పి. కిషన్‌రావు పర్యవేక్షించారు.

నానో యూరియా నానో డిఏపితో అధిక దిగుబడి





లక్ష్మణ్ చందా, (సింగిడి): లక్ష్మణ చందా:: నానో యూరియా నానో డీఏపీని ఉపయోగించి అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కనకాపూర్ గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... నానో యూరియా వాడడం వల్ల కలిగే లాభాల గురించి క్లుప్తంగా రైతులకు వివరించారు. అనంతరం ఆయన బాబాపూర్ గ్రామం లో వరి పొలాలు పరిశీలించటం జరిగింది. ప్రభుత్వం ఇస్తున్న బోనస్ ఫైన్ రకాల లో ఔ+ 44(సిద్ధి) వేసిన రైతు ఫీల్డ్ ను పరిశీలించి విత్తన లక్షణాలు అవగాహన కల్పించడం అయినది. రైతుల కి డిస్పే చేసి వాటిని గుర్తించడం జరిగింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి పొలంలో (BPH) దోమ మరియు కాండం తెగులు పరిశీలించడం జరిగింది. ధోమ కి పైమిట్రోజైన్ 120gr/ ఎకరం లేదా ట్రిఫ్లుమెజోపైరిమ్ 94ml / ఎకరం పిచికారీ చెయ్యాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కే. మౌనిక, కనకాపూర్ సర్పంచ్ వెంకట రాజు, మేకల రాజేందర్ మేకల వంశీ రైతులు బాబాపూర్ సర్పంచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ సురేష్ రెడ్డి, వెంకటరావు, కె అశోక్, రాజేశ్వర్ రైతులు పాల్గొన్నారు.





లక్ష పుష్పార్చన

శ్రీ లలిత సహస్రనామ పూజలు నిర్వహించిన కవిత మహేశ్వర్‌రెడ్డి దంపతులు

నిర్మల్ ప్రతినిధి, (సింగిడి): నిర్మల్ జిల్లా ఽ రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, సుభిక్షం కోసం, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి వారి సతీమణి ఏలేటి కవితారెడ్డి లక్ష పుష్పార్చన, శ్రీ లలితా సహస్రనామ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రార్థిస్తూ నిర్మల్ జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు సాగు చేసిన పంటలు సమృద్ధిగా పండి మంచి దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే జిల్లా, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, నిర్మల్ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు.

ఆలూర్ నుంచి ధని గ్రామం వరకు నూతన రహదారి

నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసిన బిజెఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

సీఆర్ఆర్ నిధులు రూ.3.60 కోట్లతో రహదారి నిర్మాణం





నిర్మల్ ప్రతినిధి, (సింగిడి): నిర్మల్ నియోజకవర్గ పరిధిలోని అలూర్ గ్రామం నుంచి ధని గ్రామం వరకు సీఆర్ఆర్ (జ==) నిధులు రూ. 3 కోట్ల 60 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన రహదారి నిర్మాణ పనులకు బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, ప్రయాణ సమయం తగ్గి ప్రజలకు మరింత సౌకర్యవంతమైన రాకపోకలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇర్ల చిన్నయ్య, సారంగాపూర్ మండల బీజేపీ అధ్యక్షులు కల్వ నరేష్, మండల ఉపాధ్యక్షులు ఇర్ల విజయ్, బీజేపీ సీనియర్ నాయకులు రావుల రామనాథ్, జమాల్, భూమయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, అశోక్, తోట భోజన్న , మండల సర్పంచులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దుర్గాదేవి నిమజ్జనంలో అప్రమత్తతే శ్రీరామరక్ష...

నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలి

చిన్నారుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: ఏసీపీ గజ్జి కృష్ణ



సుల్తానాబాద్, (సింగిడి): దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల ముగింపు సంద ర్భంగా నిర్వహించే నిమజ్జన వేడుకలను ప్ర శాంతమైన వాతావరణంలో, ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలకు తావులేకుండా జరు పుకోవాలని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ సూచిం చారు. వేడుకల సమయంలో ప్రతి ఒక్కరూ పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ తమతోపాటు ఇతరుల భద్రతకు ప్రాధాన్య మివ్వాలని కోరారు. శనివారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాల దుర్గాదేవి ఉత్సవ కమిటీల సభ్యులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆనందంగా జరుపుకునే పండుగల్లో నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరిగితే కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఊరేగింపుల్లో మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ట్రాక్టర్లపై చిన్నారులను పక్కన లేదా ప్రమాదకరంగా కూర్చోబెట్టి వాహనాలను నడపవద్దని స్పష్టం చేశారు. ఊరేగింపు సమయంలో విద్యుత్ తీగలు, రహదారిపై గుంతలు, వేగ నిరోధకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డ్రైవర్లకు సూచించారు. మహిళలు కోలాటాలు ఆడే సమయంలో రహదారి పక్కన విశ్రాంతి తీసుకుంటే ట్రాక్టర్ డ్రైవర్లు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. వాహనాల అదుపు తప్పితే చిన్నారులు టైర్ల కింద పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నిమజ్జనంలో నిర్లక్ష్యం వద్దు.... దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనాన్ని నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని ఏసీపీ సూచించారు. చెరువుల్లోకి చిన్నారులను దిగనివ్వకూడదని, క్రేన్ సౌకర్యం లేని చోట పెద్దలు తగిన జాగ్రత్తలతోనే నిమజ్జనం చేపట్టాలని తెలిపారు. ప్రాణనష్టం జరిగితే బాధిత కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోతాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ప్రజలందరూ సమన్వయంతో వ్యవహరించి దుర్గాదేవి నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా పూర్తి చేసుకోవాలని, పండుగ ఆనందం ప్రతి కు టుంబంలో నిలవాలని ఏసీపీ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో సీఐ పొన్నమనేని రంజిత్‌రావు, ఎస్ఐ చంద్రకుమార్, అదనపు ఎస్ఐ అశోక్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, వివిధ గ్రామాల ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



దుర్గామాత మండపాల్లో మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ప్రత్యేక పూజలు



నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):నిజామాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక్ నగర్‌లో భారీ విద్యుత్ దీపాల అలంకరణతో అద్భుతంగా ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని ఆయన సందర్శించారు. మండపాన్ని అందంగా, ఆకట్టుకునే విధంగా విద్యుత్ దీపాలతో అలంకరించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. నగరంలో ఇంత అద్భుతంగా దుర్గామాత మండపాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం హనుమాన్ నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ 23వ డివిజన్ అధ్యక్షులు జక్క మహేష్ ఆహ్వానం మేరకు అక్కడ ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ వాతావర ణంలో భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకు లను అభినందించారు.

మోకాళ్లపై కూర్చొని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వినూత్న నిరసన

మహబూబ్‌నగర్ జిల్లాలో ఆరో రోజుకు చేరిన నిరవధిక సమ్మె



మహబూబ్‌నగర్ బ్యూరో (సింగిడి):జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు మోకాళ్లపై కూర్చొని వినూత్న రీతిలో శాంతియుత నిరసన తెలిపారు.'మోకాళ్లపై మా నిరసన.. న్యాయం జరిగే వరకు మా పోరాటం' అనే నినాదంతో ఉద్యోగులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఆరోగ్య శాఖలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు వైద్య సేవలందిస్తున్న తమను ప్రభుత్వం గుర్తించి, న్యాయం చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరా టాన్ని కొనసాగిస్తామని తెలిపారు .ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ సునీల్, ఉపాధ్యక్షుడు డాక్టర్ అభినయ్, కోశాధికారి డాక్టర్ రాజేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు మహేష్ కుమార్, వెంకటేష్, బుచ్చిబాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు డాక్టర్ సుధా, డాక్టర్ తహసీన్, డాక్టర్ లీలా, డాక్టర్ వీర కుమార్, డాక్టర్ నవీన్, డాక్టర్ రోహిత్, నవీన్, బాలు, శ్రీలత, హేమలత తదితరులు నిరసనలో పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):నగరంలోని నాందేవా డలో ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి బెజ్జం సుజాత మా ట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం మహిళల ఆత్మగౌరవాన్ని నినబెట్టుకుందా మని, హింస లేని సమాజానికై పోరాడుదామన్నారు. దేశంలో జరుగుతున్న టువంటి సర్ పోరాటంలో ఎంతో మంది మహిళలు, యువతి, యువకులు కుటుంబాలను వదులుకొని శాంతియుతంగా నిరసన చేస్తుంటే, నవరా త్రుల సందర్భంగా అమ్మవారిని పూజిస్తే మరోపక్కమహిళలపై హింసాత్మ కంగా దాడులు చేస్తూ మహిళల్ని, మహిళా జర్నలిస్టులపై అసభ్యకరంగా ప్రవర్తించిన వారికి కఠినమైన చర్యలు తీసుకోని శిక్షించాల్సింది పోయి ప్రమోషన్లు ఇచ్చి భారతదేశా పరువు తీస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైన దని, ఈ ప్రభుత్వానికి గనక బుద్ధి చెప్పకపోతే రేపు రానున్న రోజుల్లో ఇంకా ఎన్ని దారుణాలు ఎన్ని ఘోరాలు చూడాల్సి ఉంటుందోనని ఆవేదన వ్యక్తం చేశారు. హింస లేని సమాజం రావాలంటే పోరాటం ఒక్కటే మార్గమని, పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అనే నినాదం స్ఫూర్తితో ముందుకు వెళ్లి భారతదేశాన్ని కాపాడుకునే బాధ్యత మనందరి పైన ఉందని మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఐద్వా నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అనిత, సభ్యులు అరుణ , సుమ, దీపికా, శైలజ, నీలిమ, లక్ష్మీ, శ్రీదేవి, శారదా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి..

పీఆర్సీ నివేదిక విడుదల చేయాలి.. హెల్త్ కార్డులు పూర్తిస్థాయిలో అమలు చేయాలి: ఎస్టీయూ.

నాగర్‌కర్నూల్ (సింగిడి):ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. పీఆర్సీ నివేది కను తెప్పించి అమలు ప్రక్రియను వేగవంతం చేయా లని, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు.నాగర్‌కర్నూల్ జిల్లా కేం ద్రంలోని భవనంలో జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీధర్‌రావు అధ్యక్షతన ఎస్టీయూ ప్రత్యేక కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఏఐఎస్టీఎఫ్ ఆడిటర్ ఎం. పర్వత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్టీయూ 80 సంవత్స రాలు పూర్తి



చేసుకున్న సందర్భంగా జిల్లాలో వైభవోత్స వాలను ఘనంగా నిర్వహించాలని పిలుపుని చ్చారు. ఇటీవల ఇండోనేషియా రాజధాని జకార్తాలో 40 దేశాల ప్రతినిధులు పాల్గొన్న అంతర్జాతీయ విద్యా సదస్సులో పాల్గొని తిరిగి వచ్చిన పర్వత్‌రెడ్డిని ఈ సందర్భంగా ఎస్టీయూ నాగర్‌కర్నూల్ జిల్లా శాఖ ఘనంగా సన్మానిం చింది. ఎస్టీయూ 80వ వార్షికోత్సవా లను నవంబర్ 14న ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎస్. మధుసూదన్‌రెడ్డి ప్రకటించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతోపాటు వారి సంక్షేమానికి ప్రభు త్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు కే. రమేష్, డి. ప్రభాకర్, కే. రఘురాంరెడ్డి, జిల్లా నాయకులు కర్ణాకం ర్‌రెడ్డి, సత్యనారాయణ, బాలస్వామి, హనుమంతరెడ్డి, జమీల్ అహ్మద్, మురళి, ప్రవీణ్‌కుమార్, నరసింహ, వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, మండల బాధ్యులు శివశంకర్, హుస్సేన్, నారాయణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌పి విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను ప్రారంభించిన సినీనటి నిధి అగర్వాల్

నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):నిజామాబాద్ నగరంలోని టిఆర్ పి విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను ఆదివారం సినీ నటి నిధి అగర్వాల్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిధి అగర్వాల్ మాట్లాడుతూ నిజామాబాద్‌లో విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను ప్రారంభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. టిఆర్పి విశిష్టలో సంప్రదాయ కళాత్మకతను ఆధునిక శైలితో మేళవించిన విభిన్నమైన డిజైన్లు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ నిజామాబాద్ కు ప్రతి షోరూమ్ ప్రతి బ్రాండ్ రావడం ఎంతో గర్వంగా ఉందని మరిన్ని ఇతర బ్రాండ్లు హైదరాబాద్ తో సమానంగా నిజామాబాద్ లో ఏర్పాటు చేయాలని ఇక్కడ ఉన్న వారికి ఉపాధి అవకాశాలు, పట్టణ అభి వృద్ధి మరింత పెరగాలి అని తెలిపారు. తొడుపునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సంప్రదాయ ఆభరణాల తయారీ నైపుణ్యాన్ని ఆధునిక డిజైన్లతో సమన్వయం



చేస్తూ అద్భుతమైన ఆభరణాల కలెక్షన్‌ను అందుబాటు లోకి తీసుకొచ్చామని తెలిపారు. మహిళలు, పురుషుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన బంగారు, వజ్రాభరణాలతో పాటు నెక్లెస్‌లు, బ్రాస్‌లెట్లు, చెవి ఆభరణాలు,ఉంగరాలు తదితర విస్తృత శ్రేణి ఆభరణాలు తమ షోరూమ్‌లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. నైపుణ్యం కలిగిన కళాకారులు ప్రతి ఆభరణాన్ని ఎంతో శ్రద్ధతో, నైపుణ్యంతో ప్రత్యేకమైన డిజైన్లలో రూపొందిస్తారని తెలిపారు. వినియోగదారుల అభిరుచులకు



అనుగుణంగా తమకు నచ్చిన ప్రత్యేకమైన ఆభరణాలను రూపొందించుకునేందుకు కస్టమైజ్డ్ జ్యువెలరీ డిజైన్ సేవలను కూడా అందిస్తున్నామని పాలభట్ల ఆనంద్ బాబు పేర్కొన్నారు. నిధి అగర్వాల్ రాకతో షోరూమ్ ప్రారంభోత్సవం సందడిగా మారింది. ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అభిమానులకు నిధి అగర్వాల్ ఆప్యాయంగా అభివాదం చేస్తూ సందడి చేయడంతో కార్యక్రమానికి మరింత ఆకర్షణ చేకూరింది.

దుర్గాష్టమి వేడుకల్లో ఆయుధ పూజ.. పాల్గొన్న జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్.

పోలీస్ ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎస్పీ



నాగర్‌కర్నూల్ (సింగిడి): విజయదశమి పండుగను పురస్కరించుకుని దుర్గాష్టమి సందర్భంగా జిల్లా సాయుధ దళం (ఏఆర్) కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ఆయుధ పూజ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్, ఐపీఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖకు చెందిన ఆయుధాలు, వాహనాలకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..



ప్రతి సంవత్సరం దసరా పండుగను పురస్కరించుకుని పోలీస్ శాఖలో ఆయుధ పూజ నిర్వహించడం గొప్ప సంప్రదాయమని తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలోని చెడును అరికడుతూ, ప్రజలకు రక్షణ కల్పించి, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు.ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీస్



అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలతో పాటు పోలీస్ అధికారులు, సిబ్బందికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు, నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ అశోక్ రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు జగన్, రాఘవరావు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ఆలయ ఫౌండర్ రమేష్‌బాబు ప్రత్యేకపూజలు



కల్వకుర్తి (సింగిడి): కల్వకుర్తి పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ వైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆలయాన్ని సంద ర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఆలయంలో దుర్గాదేవి రూపంలో కొలువుదీరిన అమ్మవారిని ఆయన భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు పొందుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులతో కలిసి ఆధ్యాత్మిక వాతావరణంలో గడిపారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు ప్రజలందరినీ ఒకచోట చేర్చి సామాజిక ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.దుర్గామాత కరుణాకటాక్షాలతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆనందం వెల్లివిరియాలని, ప్రజలందరూ సంతోషంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ ప్రజలకు బతుకమ్మ, విజయదశమి (దసరా) పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, ఆలయ ట్రస్ట్ ఫౌండర్ రమేష్ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కలిమిచర్ల గోపాల్, కార్యదర్శి రాజు, కమిటీ సభ్యులు శ్రీధర్, శేఖర్, ముత్యాలు, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల విందుగా సద్దుల బతుకమ్మ

బతుకమ్మ పాటలు, సంప్రదాయ నృత్యాలతో మారుమోగిన గ్రామాలు







గుండాల, (సింగిడి):మండలంలోని పలు గ్రామాలలో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు మహిళల ఆనందోత్సాహాల మధ్య అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామాలన్నీ పూల పరిమళాలతో కళకళలాడగా, మహిళలు సంప్రదాయ దుస్తుల్లో రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మండల కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ వద్ద నిర్వహించిన సద్దుల బతుకమ్మ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు.తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుంది. పాటల ద్వారా ప్రేమ, ఆప్యాయత, బంధుత్వం, స్నేహం, కుటుంబ విలువలను గుర్తు చేసుకుంటూ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరా లకు అందించేలా వేడుకలను నిర్వహించారు. అనంతరం "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" అంటూ హర్షధ్వానాల నడుమ సమీపంలోని చెరువు, బావుల్లో బతుకమ్మలను వదిలి పెట్టారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ పాటల పోటీలు నిర్వహించగా విజేతలకు బహు మతులు అందజేశారు. ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మహిళలకు శు భాకాంక్షలు తెలియజేసి బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా చిరస్థాయిగా నిలవాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మహిళలు, గ్రామ పెద్దలు, యువత, చిన్నారులు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి మండలంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటన

ఆళ్ళపల్లి, (సింగిడి): మండల పరిధిలోని రాయపాడు, అనంతోగు, ఆళ్ళపల్లి గ్రామ పంచాయతీల్లో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) పాయం వెంకటేశ్వర్లు ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తాజాగా జారీ చేసిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు.ఈ పర్యటనలో భాగంగా అనంతోగు గ్రామంలో లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ



సంక్షేమ ఫలాలు అందుతాయని స్పష్టం చేశారు.అనంతరం అనంతోగు, ఆళ్ళపల్లి గ్రామ పంచాయతీల్లో 'వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ' (ఉపాధి హామీ) నిధులతో నిర్మించిన నాలుగు నూతన సీసీ రోడ్లను ప్రారంభించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన చేతిపంపును ప్రారంభించి వినియోగంలోకి తీసుకొచ్చారు.అలాగే, మండల కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ వద్ద స్థానిక వ్యాపారవేత్త వితరణతో ఏర్పాటు చేసిన బతుకమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

అయిజ మున్సిపాలిటీ అవినీతి ఆరోపణలపై రాజకీయ దుమారం

విమర్శలు పక్కనపెట్టి.. అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దాం: కాంగ్రెస్

గద్వాల ప్రతినిధి (సింగిడి):జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం లోని అయిజ మున్సిపా లిటీలో బడ్జెట్ అంచనాలు, బిల్లుల చెల్లింపులపై నెలకొన్న వివాదం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. మున్సిపాలిటీలో అక్ర మాలు జరుగుతున్నా యంటూ కౌన్సిలర్ మాస్టర్ షేక్షా వలి ఆరోపణలు చేయగా, ఈ వివాదానికి పరస్పర విమర్శలతో కాకుండా పరిష్కార మార్గాల ద్వారా ముగింపు పలికి పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించాలని కాంగ్రెస్ నాయకుడు మద్దిలేటి కోరారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయ కులు విష యాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా తాము పోరాటం చేస్తున్నామని, తమ నాయకులు తప్పులను గుర్తించి సంబంధిత వ్యక్తుల నుంచి లేఖలు తీసుకొ చ్చిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. అవినీతి పరులకు మద్దతు ఇచ్చిన అంశంపై తాము గతంలో ప్రకటన చేసిన నేపథ్యంలో, దానికి స్పందనగా వ్యక్తిగతంగా, వ్యవస్థపరంగా, మున్సిపాలిటీ పరంగా విమర్శలు చేయడం జరిగిందన్నారు.అయితే, ఎప్పటి కప్పుడు



ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ పోవడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండ దని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే అయిజ మున్సిపాలిటీ అభివృద్ధిలో వెనుకబడిందని, ఇలాంటి పరిస్థితుల్లో వివాదాలను కొనసాగించడం కంటే సమస్యలకు పరిష్కారం కనుగొనడం ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ దిశగా పరిష్కారం కోసం ముం దుకు రావాలని చేసిన సూచనకు సానుకూలంగా స్పందించాల్సింది పోయి ఎద్దేవా చేసే వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ప్రజాప్రతినిధులు పరస్పర విమర్శలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రజల సమస్యలు, పట్టణ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు.మున్సిపా లిటీలో గతంలో కొన్నితప్పులు జరిగి ఉండవచ్చని,అవి తెలిసి జరిగాయా, తెలి యక జరిగాయా, అవగాహన లోపంతో జరిగాయా అనే అంశాలను పక్కనపెట్టి, వాటిని సరిదిద్దుకునే దిశగా ఆలోచించాలని పేర్కొన్నారు. సమస్యలపై చర్చ లు, తీర్మానాల ద్వారా పరిష్కారాలు సాధించు కోవచ్చని తెలిపారు.

వివాదాలకు ముగింపు పలికి అభివృద్ధికి బాటలు వేయాలి

అయిజ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిం చేందుకు ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో పనిచేయాలని మద్దిలేటి కోరారు. పదేపదే విలేకరుల సమావేశాలు నిర్వహించి పరస్ప రం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగు తుందని అన్నారు. విమర్శలు, ప్రతివిమర్శలకు స్వస్తి పలికి, మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై చర్చించి పరిష్కారాలు కనుగొం దామని పిలుపునిచ్చారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేసి అయిజ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రైల్వే బ్రిడ్జి ట్రాఫిక్ డైవర్షన్‌ను దీపావళి వరకు వాయిదా వేయాలి

పండుగల వేళ ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దు: నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల

నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):నిజామాబాద్ నగరంలోని విజయ టాకీస్ పక్కన ఉన్నరైల్వే బ్రిడ్జి విస్తరణ పనుల్లో భాగంగా ఆది వారం నుంచి అమలు చేస్తున్న ట్రాఫిక్ డైవర్షన్‌ను దీపావళి పండుగ వరకు వాయిదా వేయాలని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. దసరా పండుగకు కేవలం మూడు రోజుల ముందు ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దసరా పండుగ సందర్భంగా చుటు పక్కల గ్రామాల నుంచి, నగరం లోని వివిధ ప్రాం తాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో నిజామా బాద్‌కు వచ్చి పండుగ కొనుగోళ్లు చేస్తుంటారని తెలిపారు. ఇప్పటికే నగరంలో ట్రాఫిక్ రద్దీ



అధికంగా ఉన్న నేపథ్యంలో కొత్తగా ట్రాఫిక్ ఆం క్షలు విధించడం ప్రజలకు మరింత ఇబ్బందిక రంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ డైవర్షన్ కారణంగా వ్యాపారులు, చిరు వ్యాపారులు, వాహనదారులు, పండుగ కొనుగోళ్ల కోసం వచ్చే కుటుంబాలు ఇబ్బందులు పడే పరిస్థి తి ఉందన్నారు. పండుగల సమయంలో ప్రజలకు సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు, వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులకు మేము వ్యతిరేకం కాదని, కానీ ప్రజలకు ఇబ్బం దులు కలగకుండా పనులు చేపట్టాలి అని గణేష్ బిగాల స్పష్టం చేశారు. పోలీసు అధికారులు,రైల్వే శాఖ అధికారులు సమ న్వయంతో చర్చించి, దసరా ,దీపావళి పండుగలు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ డైవర్షన్‌ను వాయిదా వేయడంతో పాటు, బ్రిడ్జి విస్తరణ పనుల విష యంలో తగిన ప్రణాళిక రూపొందించాలని కోరారు. ప్రజల సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యతగా ఉండాలని, పండుగల సమయంలో ప్రజలను ట్రాఫిక్ సమస్య లతో ఇబ్బందులకు గురిచేయ కుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని గణేష్ బిగాల డిమాండ్ చేశారు.

బాడుగ దిల్ బస్సులు నడపండి

కోదేరు (సింగిడి):కోదేరు మండల పరిధిలోని బాడుగదిన్నె గ్రామానికి ఆర్టీసీ బస్సును నడపాలని సిపిఐ మండల కార్యదర్శి కిరణ్ కోరారు స్వతంత్రం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్న బాడుగదిన్నె గ్రామానికి ఎర్ర బస్సు ఎలాంటిదో అని ఆ గ్రామస్తులు ఆవేదనలు వెలిబుచ్చారు ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పడం తప్ప ఆచరణలో ఉంచడం లేదని మండిపడ్డారు బాడిగదిన్న గ్రామం నుండి కాలినడకన సింగోటం లేదా నరసాయిపల్లి గ్రామాలకు వెళ్లి బస్సులో ప్రయాణం చేసే పరిస్థితి బాడుగదిన్నె గ్రామస్తులకు దాపురించిందని ఆయన ఆవేదనను వెలిబుచ్చారు అత్యవసర సమయాల్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించడం తప్పడం లేదని వందలాది రూపాయలు చెల్లించి ఆటో లలోప్రయాణం చేయక తప్పడం లేదు రాత్రి వేళలో సింగోటం లేదా నరసాయి పల్లి గ్రామంలో బస్సు దిగి గ్రామాన్ని కాలినడకతో తమ ఇంటికి చేరుకోవాల్సి వస్తుందని ఆయన అన్నారు ప్రసవ సమయాల్లో ఆటోలు వేలాది రూపాయలు తీసుకొని గమ్మేసానాలకు చేరడం ఈ గ్రామ ప్రజలకు తప్పడం ఇప్పటికీ లేదు ముసలివారు కాలిన డకన సింగోటం వచ్చి బస్సు ఎక్కి పరిస్థితి ఆ గ్రామ ప్రజలకు దాపురించింది ఇప్పటికైనా ప్రభుత్వం ఆచరణలో ఉంచడం లేదని ఆయన విమర్శించారు ఆర్టీసీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన మోమాటానికి నడుపుతామని చెబుతారు కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే ఉందని ఆయన తెలిపారు ఇప్ప టికైనా అధికారులు ఆర్టీసీ అధికారులు స్పందించి బాడుగదిన్నె గ్రామానికి బస్సులు నడిపి కాలినడగను నివారించాలని ప్రైవేట్ వాహనాల జోరులు తగ్గించాలని ఆయన డిమాండ్ చ

singidinews@gmail.com



దసరా స్పెషల్ ప్రోమో విడుదల..

వైల్డ్ ఫైర్ కంటెస్టెంట్ డైరెక్ట్ నామినేట్ కావడంతో అంతా షాక్?

బుల్లితెర అతిపెద్ద రియాలిటీ షో బిగ్‌బాస్ సీజన్ 10 ఆరో వారం ముగింపు దశకు చేరుకుంది. శనివారం ఎపిసోడ్‌లో కంటెస్టెంట్లకు వరుస వార్నింగ్‌లు ఇచ్చిన హోస్ట్ నాగార్జున, ఆదివారం ఎపిసోడ్‌ను దసరా స్పెషల్ గ్రాండ్‌గా ప్లాన్ చేశారు. తాజాగా, విడుదలైన దసరా స్పెషల్ ప్రోమో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఎప్పటిలాగే హోస్ట్ నాగార్జున పవర్‌ఫుల్ డ్యాన్స్, పర్ఫార్మెన్స్‌తో ఈ ఎపిసోడ్ ఘనంగా ప్రారంభమైంది. ఆ తర్వాత హౌస్‌మేట్స్ ఇద్దరిద్దరు జంటలుగా వచ్చి స్టేజీపై అద్భుతమైన డ్యాన్సులతో రచ్చ చేశారు. ఈ పండుగ సంబరాల్లో అలరించడానికి 'వరం' సినిమా యూనిట్



కూడా స్టేజీపై సందడి చేసింది. అయితే, ఈ వేడుకల నడుమ నాగార్జున కంటెస్టెంట్లకు ఒక ఊహించని షాక్ ఇచ్చారు. వైల్డ్ కార్డ్ ఎంట్రీల ద్వారా వచ్చిన వైల్డ్ ఫైర్స్ టీమ్‌లో ఏమాత్రం ఫైర్ కనిపించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. వారి ఆట తీరుపై మిగతా హౌస్‌మేట్స్ అభిప్రాయాలు చెప్పాలని ఆదేశించారు. గేమ్ సరిగ్గా ఆడని వారికి మిర్చి ఇచ్చి తమ అసంతృప్తిని తెలపాలని కోరారు. ఈ టాస్క్‌లో ఎక్కువమంది హౌస్‌మేట్స్ దక్షి గేమ్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దక్షి అసలు ఓపెన్ అవ్వడం లేదని, హౌస్‌లో ఆమె ప్రభావం ఏమాత్రం కనిపించడం లేదని చెబుతూ ఆమెకు మిర్చీలు ఇచ్చారు. దీంతో నాగార్జున దక్షితో ఒక కుండను పగలగొట్టించారు. ఆ కుండలో ఉన్న పేపర్‌ను చూసి హౌస్‌మేట్స్ అందరూ ఒక్కసారిగా నోరెళ్లబెట్టారు. దక్షి వచ్చే వారానికి నేరుగా నామినేట్ అయినట్లు అందులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఊహించని ట్విస్ట్‌తో దక్షి తీవ్రమైన డేంజర్ జోన్‌లో పడినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ ప్రోమో నెట్టింట హల్‌చల్ చేస్తోంది.

: సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చిన నటి పూర్ణ, 'జైలర్-2' చిత్రం ద్వారా గ్రాండ్ రీఎంట్రీ ఇచ్చి సంచలన విజయాన్ని అందుకున్నారు. సూపర్ స్టార్ రజినీకాంత్, నెల్సన్ దిలీప్ కుమార్ కాంబోలో భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఈ సినిమా భారీ విజయం సాధించడంతో, తాజాగా, సోషల్ మీడియా వేదికగా నటి పూర్ణ ఒక ఎమోషనల్ పోస్ట్ షేర్ చేశారు. సూపర్ స్టార్ రజినీకాంత్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవాలని ప్రతి నటుడు కోరుకుంటారని, కానీ తనకు ఆ అదృష్టం వస్తుందని కలలో కూడా ఊహించలేదని పూర్ణ ఆనందం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి తాను ఆయనకు వీరాభిమానినని, ముఖ్యంగా రజినీ

కష్టానికి ఎప్పటికైనా ప్రతిఫలం దక్కుతుంది..

'జైలర్-2' విజయంపై పూర్ణ ఎమోషనల్ పోస్ట్

నటించిన 'నరసింహ' సినిమా అంటే తనకు ఎంతో ఇష్టమని గుర్తుచేసుకున్నారు. 'జైలర్-2' వంటి భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో ఇంత మంచి పాటలో డ్యాన్స్ చేసే అవకాశం వస్తుందని తాను అనుకోలేదని.. ఈ సందర్భంగా ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణకు, అద్భుతమైన రెస్పాన్స్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. మనం చేసే కష్టానికి, పని పట్ల ఉన్న అంకితభావానికి ఏదో ఒక రోజు ఖచ్చితంగా తగిన ప్రతిఫలం దక్కుతుందని అంతా అంటూ ఉంటారని.. తనకు ఆ సమయం ఈ 'జైలర్-2' రూపంలో వచ్చిందని ఆమె ఎమోషనల్ అయ్యారు. తనకు ఈ గోల్డెన్ ఛాన్స్ ఇచ్చిన దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్, సన్ పిక్చర్స్ నిర్మాత కళానిధి మారన్, ఎనర్జిటిక్ మ్యూజిక్ అందించిన సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

సినిమా సింగిడి Cinma Singidi

సోమవారం
19-10-2026

మనుగడ కోసం ఉత్కంఠభరిత పోరాటం..

జ్యోతి పూర్వజ్ 'కిల్లర్' నుంచి బిగ్ అప్‌డేట్ ఇచ్చిన మేకర్స్



జ్యోతి పూర్వజ్, పూర్వాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సెన్సేషనల్ స్పై థ్రిల్లర్ మూవీ 'కిల్లర్'. పూర్వాజ్ స్వయంగా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్లపై పూర్వాజ్, పద్మనాభ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం అక్టోబర్ 30కి గ్రాండ్‌గా విడుదల కాబోతుంది. ఇక సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్రబృందం ప్రమోషన్ల స్పీడ్ పెంచింది. ఇందులో భాగంగా తాజాగా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ డేట్‌కి సంబంధించి బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. 'నీ భవిష్యత్తు నా గతం.. అక్టోబర్ 21న 'సూపర్ హీరో' కిల్లర్ ట్రైలర్‌ను విడుదల చేస్తున్నాం. ఈ దసరా పండుగకు మనుగడ కోసం జరిగే అత్యంత ఉత్కంఠభరితమైన పోరాటాన్ని థియేటర్లలో చూడండి. అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో కిల్లర్ విడుదలవుతోంది' అని క్యాప్షన్ జత చేశారు. దీంతో పాటు మేకర్స్ విడుదల చేసిన స్పెషల్ వీడియో క్లిప్ ఇప్పుడు నెట్టింట తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ క్లిప్‌లో నటి జ్యోతి పూర్వజ్ వెనుక నల్లటి ఆకారాలు పాములాగా కదులుతున్న సీన్స్ చూస్తుంటే సినిమాపై క్యూరియాసిటీ ఒక్కసారిగా పెరిగిపోయింది.

పిల్లల కోసమే పెళ్లి చేసుకుని విడాకులు తీసుకోవద్దు..

వివాదాస్పద వ్యాఖ్యలపై క్లారిటీ ఇచ్చిన అనుపమ

యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్, విలక్షణ నటుడు నరేష్, దర్శకుడు తరుణ్ భాస్కర్, అఖిల్ రాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ 'క్రేజీ కల్యాణం'. బద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం అక్టోబర్ 16న థియేటర్లలో విడుదల వర్కింగ్ రన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అయితే, ఈ మూవీ ప్రమోషన్స్ సమయంలో నరేష్ పెళ్లి, పిల్లల గురించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వివాదంపై ఓ ప్రెస్‌మీట్‌లో భాగంగా నరేష్ వ్యాఖ్యలపై అనుపమ ఓపీనియన్ అడగ్గా.. దానికి ఆమె ఆమె పెళ్లి వద్దని, కేవలం పిల్లలను మాత్రమే కనాలని చెప్పినట్లుగా ఒక చిన్న వీడియో క్లిప్ నెట్టింట విపరీతంగా వైరల్ అయింది. దీనిపై నెటిజన్లు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించడంతో తాజాగా, 'క్రేజీ కల్యాణం' సక్సెస్ మీట్‌లో పాల్గొన్న అనుపమ దీనిపై స్పందిస్తూ అసలు నిజాలను వెల్లడించారు. తన వ్యాఖ్యలను సగం మాత్రమే కట్ చేసి తప్పుగా ప్రచారం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. తానెప్పుడూ పెళ్లి చేసుకోవద్దని చెప్పలేదని అనుపమ స్పష్టం చేశారు. పెళ్లి చేసుకోకపోయినా పిల్లలు కావాలనుకుంటే ప్లాన్ చేసుకోవచ్చని, కానీ కేవలం పిల్లల కోసమే పెళ్లి చేసుకుని ఆ తర్వాత విడాకులు తీసుకోవడం సరైన పద్ధతి కాదని మాత్రమే చెప్పానని వివరించారు. పిల్లల్ని కనేటప్పుడు వారికి సంతోషకరమైన జీవితాన్ని అందించడం ముఖ్యమని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇక పక్కనే ఉన్న నరేష్ కూడా ఈ విషయంలో క్లారిటీ ఇచ్చారు. తన వ్యాఖ్యల వల్ల ఎవరైనా బాధపడి ఉంటే క్షమించాలని కోరారు. ప్రపంచంలో జనాభా తగ్గిపోతోందని, పెళ్లిళ్లకు భయపడి లివిన్ రిలేషన్‌షిప్‌ల వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. పెళ్లి చేసుకున్నా లేదా రిలేషన్‌షిప్‌లో ఉన్నా పిల్లలను కనాలని, లేకపోతే సృష్టి ఆగిపోతుందనే ఉద్దేశంతోనే మాట్లాడానని తెలిపారు. దీంతో ఈ వివాదానికి చెక్ పడినట్లు అయింది.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737